4790

జయంతి

సంపుటము ౧ సంచిక ౩

జయంతి తే సుకృతినో
రససిద్ధాః కవీశ్వరాః

సంపాదకుడు :
విశ్వనాథ సత్యనారాయణ, బి, ఏ

'జయంతి' ఆలోచనాసంఘము

సారస్వతము:—

శ్రీ వున్నవ లక్ష్మీనారాయణపంతులుగారు, బారిస్టరు, గుంటూరు
,, వింజమూరి రంగాచార్యులుగారు, ఎం, ఏ; బి, ఎల్ ,,
,, ఇవటూరి కనకాచలం పంతులుగారు ఎం, ఏ: ఎల్, టి, పర్లాకిమిడి
,, నండూరి వెంకట సుబ్బారావుగారు, బి, ఏ; బి, ఎల్; ఏలూరు

ధర్మశాస్త్రము:—

శ్రీ మహామహోపాధ్యాయ తాతాసుబ్బరాయశాస్త్రిగారు, విజయనగరం
,, కిళాంబి రంగాచార్యులు గారు, ఎం, ఏ; బి, ఎల్, ,,
,, బంకుపల్లి మల్లయ్యశాస్త్రి గారు, పర్లాకిమిడి
,, కావ్యవ్యాకరణతీర్థ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు

లలితకళలు:—

శ్రీ ఆదిభట్ల నారాయణదాసు గారు, విజయనగరము
,, అడివి బాపిరాజుగారు బి, ఏ, చెన్నపట్టణము
,, ఇల్లకోడు రాఘవరావుగారు, పమిడిపాడు
,, పి. వి. రాజమన్నారు గారు, బి, ఏ; బి ఎల్, చెన్నపట్టణము
,, గొడవర్తి రామదాసుగారు, బి ;యం,ఆర్,ఏ,యస్, జయపురము

వార్తాశాస్త్రము:—

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్యగారు ఎం,ఏ;ఎల్,టి,విజయనగరము
,, బసవర్సు రామచంద్రరావుగారు, ఎం, ఏ, కలకత్తా

చరిత్ర – రాజనీతి:—

శ్రీ భావరాజు వెంకటకృష్ణారావుగారు, బి, ఏ; బి, ఎల్,
,, వింజమూరి గోవిందరాజాచారిగారు, బి, ఏ; బి, ఎల్, చెన్నపట్టణము
,, కోలవెన్ను రామకోటీశ్వరరావుగారు, బి, ఏ; బి, ఎల్, ,,

భౌతికశాస్త్రము:—

శ్రీ డాక్టరు ఏ, ఎల్, నారాయణగారు, ఎం, ఏ; డి, ఎస్, సి,
,, డాక్టరు జయంతి చినకామేశ్వరరావుగారు, ఎం, ఏ; డి, ఎస్, సి,
,, పాతూరి, పట్టాభిరామయ్యగారు, ఎం, ఏ; ఎల్ టి,


రసాయనశాస్త్రము:—

డాక్టరు యేచూరి వెంకటరామయ్యగారు, డి, ఎస్, సి, విజయనగరము
శ్రీ కొల్లకూరి సూర్యనారాయణగారు, ఎం, ఏ; ఎల్ టి, చెన్నపట్టణము
,, మసర్ల రాజుగారు, బి, ఏ, బందరు

ప్రకృతిశాస్త్రములు:—

శ్రీ గోపరాజు రామచంద్రరావుగారు, ఎం, ఏ, ఆనందకళాశాల,
,, డాక్టరు వుప్పల లక్ష్మణరావుగారు, ఎం, ఏ; డి, ఎస్, సి; (జర్మనీ)
,, పురాణం సూరిశాస్త్రిగారు, బి, ఏ, బందరు
,, కొండి పురుషోత్తముగారు, ఎం, ఏ, విజయనగరం.

విషయసూచిక



విద్యుచ్ఛక్తిప్రవాహమానం తెలిపే బాటరీబొమ్మ

(౮3 వ పుట చూడవలెను.)

జయంతి



శ్రీ కృష్ణపూర్ణాదేవి

(౧౩-వ ఏట కలకత్తాలో చదివేటప్పుడు)

[illegible]యాం[illegible]



[illegible] నిల్చున్న[illegible]: [illegible] వారి [illegible]

,, కూర్చున్నది: [illegible]

[illegible]

[illegible]మధ్య: [illegible]

కుడి పక్క[illegible] [illegible]దులు

([illegible] ౧౦-౨౬వ తేదీన [illegible]యినపుడు తీసినది)

చెల్లెలు అన్నపూర్ణాదేవికి:

కాంతిపుంజము అస్తమించింది. ఈనాటి శ్రావ్యగీతానికి అప శ్రుతిదోష మావరించింది.

ఆకాశము చీకటితో నిండింది. కారుమబ్బుల కర్కశత్వమే సూర్యభగవానుణ్ణి కప్పివేసుకుంది.

మాతకు చేసుకొన్న సేవ మృత్యుకరాళరూప మవుతుంది. సూర్యుడు పుట్టించే మేఘాలే ఆతేజోబింబాన్ని మాటుపరుస్తవి.

సంతతధారగా స్రవించే బాపినీడుఅశ్రుధారలు అంతర్ధార లైన మహాత్ముని బాష్పాలతో లీనమై పోయినవి.

అన్నపూర్ణ అందమైంది: ఆమె చరిత్ర ఆనందమయమైంది. ఆమెజీవితమే మహాసౌందర్యానందాల రంగుల కలయికతో చిత్రిం చుకొన్నది.

ఆమె కాంతివంతమైనరూపానికి చిహ్నంగా పసిపాప జాన్సీని మనకిచ్చి, మృత్యువును జయించుకొన్నదనుటకు జీవితమే నిదర్శనంగా చూపించు కొన్నది.

• తనకు మరణమే లేదని ఆఖరుమాటగా చెప్పిపోయింది.

అన్నపూర్ణాదేవి మాతకోసము విలువలేని తన చీనిచీనాంబ రాలు హారతిచ్చింది: తన జీవితమే నివేదన అర్పించింది.

బాపిరాజు

Coimbatore

19.10.'27

My dear friend,

Good Narayan Raju sent me a wire on Monday about the passing away of Annapurna. Now I have the letter he informed me of. I knew nothing of this sad event. I had inquired about her on the other day of Vishakhapatnam & he told me she was ailing as usual. ~~yours~~ The wire therefore stunned me.

If you have lost a dear wife, I have lost a dearer daughter. I don't mind your rebuke. You are entitled to chide me, to chide Nature herself on your irreparable loss. But I ask you to share my belief that Annapurna

whom you loved & I loved is not dead. Her imperishable soul must be, now that she cannot speak to us through her body a greater reminder of our respective duties.

I do hope that you will follow in her footsteps & carry out her many noble wishes.

You ask me to give my name to the proposed committee. I may not do so for the simple reason that I have many daughters both dead & living. It would be too great a burden for me to carry if I began to become a member of committees formed to perpetuate their names. I must be satisfied with the endeavour to become worthy of so many noble daughters. I am writing a note about [?] [illegible] [illegible] in Y. I.

M. K. Gandhi

మహాత్ముని లేఖ

కోయంబత్తూరు
౧౯-౧౦-౨౭

నా ప్రియమిత్రమా !

అన్నపూర్ణ దివంగతురాలైందని సోమవారం ప్రియసుహృదుడు నారాయణరాజు తంతి పంపినాడు. ఆవిషయమై వ్రాసిన జాబుకూడా ఇప్పుడే అందింది. ఈదుఃఖసమాచారము నాకు ఏమీ తెలియదు. మొన్ననే దేశభక్తుణ్ణి ఆమె కేలావుందని అడిగాను. ఆమె యథాప్రకారంగానే జబ్బుగా వుందని ఆయన చెప్పినారు. అందుచేత తంతి రాగానే నిర్విణ్ణుడనైనాను.


ప్రియభార్య నీకును, ప్రియతమయగు పుత్రిక నాకును, అస్తమించింది. తీరరాని ఈనష్టానికి నన్నే కాదు విధినికూడా దూరవలసినదే. నీవూ నేనూ ప్రేమించిన అన్నపూర్ణ మృతి పొందలేదని, నావలెనే నీవున్నూ నమ్మవలెనని నాకోరిక. స్థూలాకృతిలో ఆమె మనతో మాటాడలేకపోయినా జరామరణాతీతమగు ఆమెఆత్మ సూక్ష్మాకృతితో మనము స్వధర్మనిర్వహణము చేయడానికి ఇంకా జ్ఞాపకకారణమవుతున్నది. ఆమెధర్మాని కనురూపంగానే ఆమె ఆశయములనెరవేర్చెదవని నావిశ్వాసము

ఆమె స్మృతిచిహ్న నిర్వహణార్థమై యేర్పర్చే సంఘంలో నాపేరు చేర్చుకోనిమ్మని వ్రాసితివి. నేను ఆవిధంగా ఉండకూడదు. అందుకు అసలుకారణం—కీర్తిశేషురాండ్రూ, ఆయుష్మంతురాండ్రూ, అయినకుమార్తెలు నాకు చాలామంది ఉన్నారు. వారందఱి స్మృతిచిహ్నముల నిర్వహణార్థమై యేర్పడే సంఘాలన్నింటిలోనూ, సభ్యుడను కావడ మారంభిస్తే, అది నాకు దుర్భరమైన భారంగా ఏర్పడుతుంది. కాబట్టి సాధ్వీమతల్లులగు అట్టి పుత్రికామణులకు తగిన తండ్రినయ్యే ప్రయత్నంతో మాత్రమే నేను సంతృప్తి పొందవలెను.

అన్నపూర్ణవిషయము 'ఎంగిండియా'లో వ్రాస్తున్నాను.

నీప్రియమైన

ఎమ్. కే. గాంధి.



చిరవియోగానలంబున చిత్తమెగియ
కనకకనక జానకి నన్ను గాంచినపుడు
నాట్టుకొనినదుఃఖముపైనినవ్యహర్ష
వీచికామాలికలుదండు వెడలుచుండ

ఎండ వానయు జతకూడి యుండునట్లు
చీకటియు వెన్నెలయు చెల్మిచేయునటులు
కనుగొనల బాష్పకణములుకారుచుండు
తొగరుపెదవుల చిరునవ్వు తోచుచుండు

అధికార్ల సూర్యనారాయణరావు.

కిన్నెరసానిపాటలు.

౧ కిన్నెరనడకలు.

కరిగింది కరిగింది
కరిగింది కరిగింది
కరిగి కిన్నెరసాని వరదలైపారింది
తరుణికిన్నెరసాని తరకల్లుకట్టింది
పడతికిన్నెరసాని పరుగుల్లువెట్టింది.

కదిలింది కదిలింది
కదిలింది కదిలింది
కదిలికిన్నెరసాని వొటుగుల్లుపోయింది
సుదతికిన్నెరసాని సుళ్లుగాతిరిగింది
ముదితకిన్నెరసాని నురుసుల్లుగ్రక్కింది.

నడిచింది కడరాళ్లు
గడిచింది పచ్చికల్
తడిసికిన్నెరసాని సుడులలో మొరసింది
జడిసికిన్నెరసాని కడలందువారిసింది
సుడిసికిన్నెరసాని జడలుగాకట్టింది.

కరగగా కరగగా
కాంత కిన్నెరసాని
తరగచాలులమధ్య తళతళామెరిసింది·
నురుసుపిండులతోడ బిరబిరానడిచింది
ఇసుకనేలలపైన బుసబుసాపొంగింది
కదలగా కదలగా
కాంత కిన్నెరసాని

పడువుకట్టినవేళ్ల కడుపులాతోచింది
కడలుతెల్లనిపూల నదివోలె కదిలింది
వడలుతెల్లని త్రాచు పడగలావిరిసింది.

నడవగా నడవగా
నాతి కిన్నెరసాని
తొడిమయూడినపూవు పడతిలాతోచింది
కడుసిగ్గుపడురాచకన్నెలాతోచింది
బెడగుపోయినరత్న పేటిలాతోచింది.

పతి రాయివలెమారి
పడియున్న చోటునే
పడతికిన్నెరసాని విడలేకతిరిగింది
ముగ్ధకిన్నెరసాని వగచెందితిరిగింద
వెలదికిన్నెరసాని గలగలాతిరిగింది.

తాను నదిగానేల
నైనా? ననుచులోన
పూనికిన్నెరసాని పొగిలిందిపొగిలింది
ముక్తగీతికవోలె మ్రోగింది మ్రోగింది
ఒకచోటనిలువలే కురికిందిపురికింది.

ఏవుపాయముచేత
నైన మళ్లీతాను
మనిసికిన్నెరసాని నగుదామయనిపించి
ఆపలేనంతకోరిక్ష చేతవిలపించి
ముగుదకిన్నెరసాని మొరసిందిమొరసింది.

తనువీడితేవోర్చు
కొనలేదుకాబోలు
బ్రతికుండగాయింత ప్రణయమ్ముకలదంచు

తెలిసితేయింకెంత చెలిమివుండేదంచు
తలపోసితలపోసి సొలసెకిన్నెరసాని.
అటువంటి పతితోడి
అటువంటికాపురం
బిటుచేసికొంటినం చెక్కడాలేనంత
వగచెందివగచెంది వనితకిన్నెరసాని
వనరిందివనరింది వనితకిన్నెరసాని.
తుదకేమిచేయుగా
నెదవోకఅలవోక
పతిరాయిగామారి పడియున్న గుట్టపై
అతివతన కెరటాల హస్తాలతోచుట్టి
వెతపొందివెతపొంది బిట్టుఘోషించింది
మాటిమాటికి కొండ
మ్రాదిగాపడివున్న
తననీటుకాణ్ని చేతులకౌగిలిస్తుంది
పలకనాయని మ్రోత పడిపల్కరిస్తుంది
పతిగుట్టపైతాను వ్రాలియేడుస్తుంది.
ఓనాధ! ఓనాధ!
ఓనాధ! ఓనాధ!
నాకుమల్లే నీవు నదివోలెపారరా
జలముగాయిద్దరము కలసిపోదామురా
కెరటాలుకెరటాలు కౌగలిద్దామురా
ఓనాధ! ఓనాధ!
ఓనాధ! ఓనాధ!
నీయందుతప్పింక నేనుచెయ్యనులేర
ఆనవెట్టితివేని అడుగుదాటనులేర
ఇకజన్మలోకోప మింతపొందనులేర,

రారటో ప్రియానాథ
రారటో ప్రియానాథ
వెలదినీకిన్నెరా కలగిపోయిందిరా
నాతినీకిన్నెరా నలగిపోయిందిరా
పడతినీకిన్నెరా బడలిపోయిందిరా.

ఓనాధ! నీయందు
నేనుచేసినతప్పు
తిరిగియెప్పటికైన తీర్చుకుంటానురా
నీత్రోవనీదిరా నాత్రోవనాదిరా
మరలనాతోనీవు మాటాడపోవురా

పిలిచింది పిలిచింది
పిలిచింది పిలిచింది
పిలిచికిన్నెరసాని పిలుచుటాపేసింది
బడలికిన్నెరసాని పడిపోయినట్లుంది
తరుణికిన్నెరసాని కెరటాలుతగ్గింది.

వనరింది వనరింది
వనరి కిన్నెరసాని
మండియారిననిప్పుగా మాద్రిగానారింది
తనకర్మమింతియే యనిలోననసనుకుంది
తనకింకబతితోడి తగులులేదనుకుంది.

చేతులారాతాను
చేసుకున్నానాని
యింతికిన్నెరసాని యేడ్చినాయేమ్ఫలూ
సుదతికిన్నెరసాని చూపినాదుఃఖమూ
అవికూడజలములై ఆమెలోకలిసినై

నీలిమబ్బులవోలు
నిడివినీచేతుల్లు
నన్నింకకౌగలించగరావుకాబోలు
నెమ్మదిగనాయెడల్ నిమురవుకాబోలు
కడుప్రేమతోచేరగాతీవుకాబోలు.

నేనుకోపమునంది
నీపక్కనుండగా
వలదన్నకొద్దినా పదములొత్తుచునీవు
తెలచికౌగింటిలో తేర్చుకుంటూనీవు
నాఱొమ్ముతలచేర్చ గారావుబోలు

తలిరాకువంటిమె
త్తనియెఱ్ఱపెదవితో
తార్చినామోమునద్దగరావుకాబోలు
నాయెడల్మిగులనందపుకుప్పయనిచెప్పి
ఎల్లతావులనుముద్దిడరావుకాబోలు.

అనిసన్నగొంతుతో
వనరికిన్నెరసాని
రొదయుడంగినపావు రాయిగొంతుకవోలె
తనలోనతానేమొ మెలమెల్లరొదచేసి
కొను చుపల్లవు నేలకును డిగ్గిపడిపోయె.

జలదేవతలువచ్చి
నెలతకిన్నెరసాని
పడమంచుపదమంచు బలవంతపెట్టంగ
మరిమరీపతిచుట్టు తిరిగికిన్నెరసాని
వలవలాయేడ్చింది పలపలాకుందింది.

జలదేవతలువచ్చి
చలపెట్ట పతిగుట్ట
విడలేకవిడలేక పడతికిన్నెరసాని
చనలేకచనలేక చానకిన్నెరసాని
పోలేకపోలేక బాలకిన్నెరసాని

జల దేవతలువచ్చి
చలపెట్ట పతిగుట్ట
వదలగాలేక యామిదితకిన్నెరసాని
తల్లిదగ్గరనుండి తనమెడకుపలుపోసి
లాగగాబడ్డటి లేగలాసాగింది.
సాగిం దిసాగింది
జాలుగాపారింది
ఆవుపొదుగునపాలు ధారకట్టినయట్లు
వనదేవతలునీళ్లు వొలకపోసినయట్లు
తల్లిచల్లనిప్రేమ వెల్లివారినయట్లు
జాలుగాపారింది
జలజలాపొంగింది
లేతమెండలుదిశా ళినిక్రమ్ముకొన్నట్లు
పాలాట్రగడము పాతరతీసికొన్నట్లు
ముద్దరాలిమనస్సు పొంగివచ్చినయట్లు.
జలజలాపొంగింది
బిలబిలానడచింది
పరికిణీతొక్కాడు పదియేండ్లకన్నెలా
చిన్నిగంతులువేయు తెల్లనాబెయ్యలా
పసిపాపసెలవివారినబోసినవ్వులా.

నడిచిందినడిచింది
నడిచికిన్నెరసాని

నడిచియందాలు చందాలుగా నడిచింది
గడియలోపల పెద్దకాల్వగా కట్టింది
అడవితోగులరాణి యున్నట్లు తోచింది

ఏమికిన్నెరసాని
ఏమికిన్నెరతోగు
బంగారుతీగలో పానకమైపోయె
కొబ్బరిపాలువాకలు కట్టినట్లయ్యె
వెయ్యావులొకసారి పితికినట్లైపోయె.

జలదేవతల వెంట
సాగికిన్నెరసాని
తెలతారకల వెంట వెలుగులాతోచింది
తలిరుపూవుల వెంట తావులాతోచింది
తెనుగుపాటల వెంట తీపిలాతోచింది.

వాయ్యారినడలతో
వచ్చుకిన్నెరసాని
వనదేవతలు పూలు పైక్రుమ్మరించారు
భూదేవతలు మెచ్చు పోయిదీవించారు
వాయుదేవతలు రమ్మని పాటపాడారు.

పాటుకిన్నెరసాని
పజ్జలందు నిల్చి
కోకిలా తన గొంతుకొసవిచ్చి పాడింది
పికిలిపిట్టలు మేలి రకముగా కూసినై.
తెలుగుపిట్టలు వాళ్లు తెలియక పాడినై.

ఎంతదూరముపోయె
సంతదూరముదాక
తెరవకిన్నెర వెన్క తిరిగిచూచుచుపోయె

పడతికిన్నెర తిరిగి పతిచూచుచునెపోయి
నాతికిన్నెర తిరిగి నాథుచూచుచెపోయె

పతివంకచూచుచూ
పడతికిన్నెరసాని
పోయేటివేళలో భూమి తనంతగా
తోరమైవిరియుచూ త్రోవగాచేసింది
కెరటాలతో చొచ్చుకొదు కిన్నెరసాని.

బ్రతికివున్నప్పుడూ
అతివకిన్నెరసాని
యెంతబయ్యారియో యెంతనెమ్మదిచానో
అంతబయ్యారమ్ము అడుగడుగు పోయింది
అంతయిల్లాలి నెమ్మదితనము చూపింది

విశ్వనాథ సత్యనారాయణ

ఫలశ్రుతి

నీవధిష్ఠించు భద్రపీఠీ విరాజ
మాన మాణిక్య కాంతులలోన భ్రమసి
నీరుచిర రాజ్యవుంబొలిమేరలందు
తెన్నుగానక గ్రుడ్డినై తిరుగునన్ను

నన్ను నీచెంతిచేర్చుకొన్నావు దేవి!

నీ వధిష్ఠించు భద్రపీఠీ విరాజ
మాన మాణిక్యకాంతులు మలసీ మలసి
విశ్వ వీథుల ప్రణయముల్ వెల్లివిరియు
ఈయమృతరాజ్యమున మనమిద్దఱమును
నీవు రాజ్ఞివి నేను నీసేవకుడను.

నీవు నిండుకుండవు ప్రేమభావమందు
అమరులకు నైన కొలువ శక్యమ్ముగాని
ప్రణయసూత్రమ్ము నీలోన బయలువెడలి
నాగళాంకిత మైనది నాడునాడు

నీవు నిండుకుండవు ప్రేమభావమందు
మాటిమాటికి నావేశమగ్న మైన
హృదయమున నీదుపాట లూహించుకొనుచు
దిగ్దిగంతాంతరమ్ములు తిరిగితిరిగి
చివర నాకట్టుకంబము చేరుకొందు

దైవతపథాంతరమ్ముల నీవిహార
మిటుల నావంక కే ప్రసారించినావు
అల్పమర్త్యుఁడ నేను
సహస్రకోటి
దివిజగంగలు నాతల నవతరించి
నట్టు లయ్యెను నాదు భాగ్యమ్ము దేవి
ఇచట నాతోడి నీయాట లెలమి మిగుల
భూతలస్వర్గనందనమ్ములు రచించు
కొనుట నాపని !

౧౦.

వినుచు నుందును విన్నది విననియట్లు
కనుచు నుందును కన్నది కననియట్లు
స్వప్నగాథలవలె ప్రపంచములవోలె
చిత్రములు దేవ! నాబహిశ్చేష్టితములు.
సంతతమ్మును విమలతేజఃప్రశాంత
మోహనమ్మైన నీప్రేమమూర్తిలోన
అవ్యయానందమధురరేఖాంచలములు
దిద్దుకొనుచుందు.——

౧౧

వత్సలాఫాలమున నెలవంకగుఱుతు
కందళించి వికాసించి కళలు దేరి
తరుణశారదరాకాసుధాకరాచ్ఛ
బింబము లనంతములు లెక్కపెట్టుకొనెను
ఈయమర్త్యాచ్ఛచంద్రిక లెన్ని నాళ్లు
నాతనవు ముంచుకొను నన్ని నాళ్లు ఒక్క
యీశరత్తేమి నాది సదాశివత్వ
పదవి!

నాయని సుబ్బారావు.

మాధవవర్మ

క్రీ. శ. 3౫0

(ఇతఁడు పల్లవరాజు. నేటిబెజవాడ రాజధాని. ఇతఁడు బృహత్పలాయనులకు పూర్వుఁడు. శివస్కంద వర్మాదుల కాలము వాఁడు కావచ్చును. ఈకథ ఒకశాసనములోనిది. అతనిధర్మమునకు మెచ్చి దేవతలు రెండు ఘడియలకాలము విజయవాటికా పట్టణములో కనక వర్షము కురిపించిరట)

విజయవాటికకోట వీథిలో నాఁడు సంరంభంబు పొందుచు రాజభటులు
ప్రజనొత్తుచున్నారు ప్రక్కప్రక్కలకు భూమిజానియేకతనూజుఁడతఁడు
పదివేల దివ్యసువర్ణమ్ముల నొసంగి శ్వేతమత్తాశ్వముల్ విలిచినాఁడు
అవి పూన్చినరథంబు నారోహణము చేసి అతఁడు పురమ్ము వాహ్యాళిపోవు
రాజపుత్రుఁడు కొన్నతురంగములవి
బహుళభద్రచిహ్నములు శుంభన్మహోగ్ని
వమదమోఘనాసాపుటభ్రమితసాంద్ర
ఫేనములు ఖురఘట్టితోర్వీతలములు

గ్రీష్మవేళానిరాకృతిమేఘగర్భఘూర్ణితవైఖరీనేమినిస్వనములు
చలితశైలాగ్రనిర్ఝరిణీవిధాభప్రజాత్యశ్వదివ్యహేషాస్వనములు
కుద్దాలశాతోగ్రఖురవిఘట్టితధరాచటులోద్ధత పరాగసంచయములు
మత్తక్రుద్ధాహిసంరావత్కశాగ్రసంచాలనోద్భూతనిస్వానకములు
మెఱుము లుఱుములై వచ్చి నిమేషమంద
దాటిపోయె రాసుతుని స్యందనము కదలి
పుడమిఁ దచ్చక్రఘట్టితాంగుఁడయి నెత్తు
రోడికలు గట్ట నటఁబడియుండె నొకఁడు.

పరుగెత్తురథము వెంబడిప్రజల్ మూఁకలై పెద్దయుబరువులుపెట్టినారు
ఎచటఁబ్రజల్ మూఁగి రచటికేగిరిపోను,మఱిరాజభటులుసమ్మర్దమడప
అరదంబు వెనువెంటననుసరింపకయొండ్లమీఁజినవారుభూమీఁతలాన
ధూళిధూసరిత మైవ్రాలిపోయినయట్టిశవమును గనుఁగొనిజాలిఁబడి
అంతలో లోకబాంధవుఁడస్తమించె
అస్తగిరిగహ్వరాంతనిత్యస్థితాంధ
కారకృష్ణవర్ణాహిసంచార భయద
మై కకుప్పులు శ్యామలమైత్ర తనర్చె

*

పొఁడువుమలవెల్గు నెత్తాలపొడిచి దివ్య
కాంతి దిక్కులవెదఁజల్లెఁ గర్మసాక్షి
ఉర్వినేల ధర్మాసనంబుండె నతఁడు
పల్లవేంద్రుండు మాధవవర్మనృపతి

మృదులకపోలపత్రములు మీఁదికి నుబ్బెడునుండలంబులన్
పొదిగిన రత్నదీధితులు మోసులు దాఁటిప్రభాతనీరజా
భ్యుదయము లైన దివ్యనయ రోజ్జ్వల దీప్తులు దాటి శీతరు
గ్వదనము దాఁటి ధర్మను యొకండు తదాస్యమునందు తోఁచెడిన్.

*

కాఁబోలునీమె శోకంబుకట్టినమూర్తి అతిభూమిదుఃఖభారానతాంగి
కాఁబోలు నీమెదుఃఖగత నిరాశాదేవి పతితోర్ధ్వపక్ష్మలబాష్పనేత్ర
కాఁబోలు నీమె యేకతనూజ విరహిత అతిదూషిత శరీరగతనిరాస్థ
కాఁబోలు నీవృద్ధ కాంత న్యాయార్థిని బహుళక్రుధాభుగ్నఫాలభాగ
అనఁగ నొకవృద్ధపేదరాలరుగుదెంచి
నెత్తురట్టలుకట్టిన నిజకుమారు
శవము దిగజార్చి చేతులు చాచి శవము
వైపు తనదృష్టి భూపతి వైపు త్రిప్పి

ఓయి నృపాల! యీబుడుత యొక్కఁడునాదుకులంబుతేప నీ
వో అతిధర్మరాజు వయయో యిది యేమిటయా గతాసువై
యీయనఁగేగెఁబో తినుట కే మిఁక నున్నది నాకు నేమి? నే
డే యిదె వీనివెంటఁబడి యేగెద కోడలి కేమి కావలెన్.

ఇంతకుమించి యాపద లిఁకే మని కల్గు? రథంబుచేతఁ ద్రో
క్కింతు రఁటయ్య భూప్రజల! నెంతగ నున్న సిరుల్ భుజింత్రు పా
లింతురు రాజులైన నదలింతురు తప్పులు కల్గినన్ విచా
రింతురుగాక చంపుట సరే ప్రజ నిట్టు లకారణంబుగన్.

అని నీయిష్టము న్యాయమో మఱియు నన్యాయంబో నీచేతిమీ
దనె కానిమ్మిదె పోవుచుంటి నని బాధాపూర్ణనేత్రద్వయం
బున నేవో వికృతస్వరూపఘటనంబుల్ గల్గి యావృద్ధ యం
తన నచ్చోటఁ గతాసువై పడియె పుత్రాయల్లకాయాసయై

ఆసమయంబునన్ నృపుని యాననసీమ ప్రశాంతచిహ్నముల్
భాసురముల్ వెలార్చె నరపాలుని తత్సభలోనివార లా
హాసముద్గ్రవక్త్రులు దృగంతవినిశ్చలవృత్తు లంతలో
నైశితదీప్తి వొల్చె నరనాథువిశాలవిలోచనంబులన్

అధికృతులఁ బ్రాడ్వివాకుల
బ్రధానసచివులను చూచి వాక్పతినిభుఁ డా
పృథివీపతి ధర్మోన్నతి
విధావినిర్ణయముచేయు విధిపనిపెట్టెన్.

ప్రాడ్వివాకులునుదీర్ఘముగ యోజించిసమర్పించిరఖిలమ్మునధికృతులకు
మత్తాశ్వములుబూన్చి మనుజనాథసుతుండుపురవీథులందునఁబోవరాదు
పసిపాపలుందురు పంగ్వంధులుందురు ప్రాణమ్ముప్రాణమ్మ బదులుకోరు
స్మృతికి భూమీజానిసుతుఁడని కాదని లేదు నీతికిదయలేదటంచు

ప్రాడ్వివాకులు పదు నభి ప్రాయముపడి
రధికృతులు తీర్పు వినిపించి రవనిపతికి

తీర్పు విసినంత సేపు ధాత్రిపతి మోము
కనుతుదల నైనకదలిక గాంచలేదు.

ఆకాశమధ్యసౌధాగ్రమ్మునను జేరె నప్పుడే తీక్ష్ణమార్తాండమూర్తి
బ్రధ్నాంశుతప్తవాఃపధి కృష్ణవేణిక ఇంద్రకూటపుఁగొండ్లెగచి మొరసె
కడగి మధ్యాహ్నశంఖాధ్వనుల్ పల్లవక్ష్మాతలేంద్రుల మొగసాల మ్రోగె
నాటికి ధర్మాసనంబు చాలించె మాధవవర్మ ఆంధ్రపల్లవనృపాలుఁ

డాసనమ్మున నృపతియున్నంతవరకు
నెంత గంభీరుఁడో దిగి యంత దుఃఖ
దళిత చేతస్కుఁడైన ప్రధానసఖులు
రాజుఁ గొని తెచ్చి రంతఃపురంబునకును

సచివులు పుత్రశోకభరసంజ్వరు భూపతిఁ జూచి వారు తీ
ర్చినది తీర్పు రాజు సవరించను వచ్చునటంచుఁ జెప్ప న
య్యుచితవివేకి పుత్రవిరహాగ్రభరాత్ముఁడ గాని న్యాయకా
ర్యచరణభారదుఃఖవివశాత్ముఁడగా నని పల్కె వెండియున్

అసువులు పోవునంతవఱకు కాపతి యేగెను గాని పాప మే
కసుతవియోగదుఃఖితుఁడు క్ష్మాపతిదేహము భూప్రజార్థమై
యసువులు నిల్పె నాటిదివసాంతమునన్ యువరాజు మేనిలో
నసృగుదిత ప్రవాహవలయంబులలో మలుసంజ వాల్చెఁ గో.

నటశివసాయంసంధ్యా
చ్ఛటాఘటానూపురమణిసంభవకాంతి
స్ఫుటచిటచిటచిటనినదో
త్కటకనకము విజయవాటి వర్షము కురిసెన్

విశ్వనాథ సత్యనారాయణ

కృష్ణరాయబారము

శ్రీ వున్నవ లక్ష్మీనారాయణ గారు, గుంటూరు

సంజయరాయబార మిదివరలో చూచి విమర్శించాము. ఇప్పుడు కృష్ణరాయబారానికి వచ్చాము. రెంటికీ చాలా తేడా వున్నది. సంజయుడొక వైపున నమ్మినబంటు. సమర్థుడైన రాజనీతికోవిదుడు. రెండవ పక్షమున ఎన్నికగాంచినవాడు. స్వంత అభిప్రాయము లెటులున్నా యేలినవాని ఆజ్ఞలను శిరసావహించి నిర్వహించ వచ్చినవాడు. కృష్ణుడు రాయబారమునకు ఒకరు పొమ్మంటే వచ్చినవాడు గాడు. సంజయునికి కడపడి జవాబు చెప్పుతూ

ఏ నీపనికై వచ్చెద
గా నొప్ప దలంచె నొండె, దప్పం దలఁచెన్
దానన నెగడెద మే మ
మ్మానవనాథునకు జెప్పు మా మత మెల్లన్.

అని స్వబుద్ధిచేతనే చెప్పివైచినాడు. ఇట్టి బాధ్యతను దీసికొనుటకు కృష్ణునకు అర్హత లేకపోలేదు. పాండవుల కీతడు మూడుతరముల బంధువు. మొదటితరములో ఈయన మేనత్తను పాండురాజున కిచ్చారు. రెండవతరములో సుభద్ర అర్జునుడి భార్య. శశిరేఖను అభిమన్యున కియ్యడము మూడవసారి వియ్యము. ఈ బీరకాయపీచులో దగులొ్కనడమే గాక, కృష్ణార్జునుల కనాదిస్నేహము.

ఆపద గడవం బెట్టగ
నోపి శుభం బైనదాని నొడగూర్పను మా
కీ పుట్టువునకు పాండు
క్ష్మాపాలుడు నిన్ను జూపి చనియె మహాత్మా!

అని ధర్మరాజు కృష్ణుని సంబోధించాడు.

జలజాతప్రభవాదులుఁ మనములో జర్చించి భాషాపతిఁ
బలుకఁ లేని జనార్దనాహ్వయపరబ్రహ్మంబు మాయింటిలో
జెలియై మేనమరందియై సచివుడై చిత్తప్రియుండై మహా
బలసంభాయుకుడై చరించుటలు మాభాగ్యంబు రాజోత్తమా!

యని యొకరు ధర్మరాజుతో నన్నారు. ధర్మరాజు రాజసూయాధ్వర సమయములో

గురు డని సమస్తలోకో
త్తరు డని నీకంటె వృద్ధతములైన వరే
శ్వరు లచ్యుతు నర్చనసెడ
గని మఱినదింప నీకు గా దన దగునే?

అని శిశుపాలుడితో స్వయముగా అన్నాడు. ఇట్టి లోకారాధ్యుడు తాను స్వయముగా సంధికి బోతా నని బయలుదేరాడు. ముందు వెనుక లాలోచించనిది యేమీ జేయని ధర్మరాజూ, దుర్యోధనుని తొడలు విరుగ గొట్టెద ననీ దుశ్శాసనుని రొమ్ము చీల్చి నెత్తురు పీల్చెద ననీ శపథము చేసిన భీముడూ, కలహానికై తయారు తిని వున్న అర్జునుడూ, యౌవనోత్సాహముతో కయ్యానికి కాలుదువ్వే నకులుడూ, అందఱూ మెత్తబడ్డారు. కృష్ణుడు పూనుకొనడము చేత సంధి అయినట్లే భావించారు. కష్టపడకుండా కార్యము గట్టెక్కిన దనుకు న్నారు. తమకోర్కెల నేకరువు బెట్టారు.

అని యెవ్విధమున నైనను
వనజోదర సంధిసేయవలయుం దగ నే
మును వారు గలయుటయు భూ
జనులకు నెల్లను హితంబు సౌఖ్యకరంబున్

అని భీముడే అన్నాడు. ధర్మరాజు

మేలుగాక నీకు బోలినట్లయిన నం
దరిని యేము వారు సద్ధి బొంది
యుండునట్లు గాగ నొడబాటు గావింపు
మెల్లభంగి మనకు నిదియు లెస్స!

అని తన యభిప్రాయ మెరుకపరచి తన సహజనైపుణ్యముతో

క. మఱియెఱుగు దెదిరి నెఱుగుదు
విమ్మి యెఱుగు దర్థసిద్ధి నెతి యెఱుగుదు వా
క్యమ్ముల పద్ధతి నెఱుగుదు
పొమ్మెవ్వడ నేను నీకు బుద్ధులు సెప్పన్.

అని సర్వాధికార మిచ్చి ముగించాడు. అర్జునుడు అమ్మొరకుల నెమ్మెంయినయినను

ఒడబఱచి మాకు వారికి
బుడమి సగము గాగ జేసి పొంది పొసగి యుం
డెడునట్టి తెఱగు సేయుట
కడు మే లది గౌరవము సుఖంబును జేయున్.

అని గట్టిగా జెప్పినతరువాత

హిత మిబ్బంగిది మాకు ధర్మముతెఱం గిట్లుండునం చేను నీ
మతి బోధింప వలంతి నే హితము ధర్మంబుల్ విచారించి చూ
చి తగుం బొమ్మని యేది పంచి తది నిశ్చింతంబునన్ జేసి యు
న్నతి బొందంగలవార మై యునికి కృష్ణా నేడుగా వచ్చెనే.

అని భక్తిని వెల్లడించాడు.

నకులుడు

కిడవగ నోకళ్ల పసరము
నడచిన నోకట్ల—ళులు బెయ్యి నదువవలయునే
చెడు తెరు వాకారవ్యుల
కడ నిలుచుంగాక మనకు గ్రౌర్యంబేలా?

అట్లుంగాక నీవు దమపాలికం బోవుట ధార్తరాష్ట్రు లాదరింపకుండ వెఱవరులె. నీపోయివప్పుడ యీ కార్యంబు దక్కనగు"

నని సామాన్యముగ లోకమున కుండదగిన అభిప్రాయమును వెల్లడించాడు.

ఉత్తర గోగ్రహణసమయములో సంధి జేసికొను మని భీష్ముడు సలహా నియ్యగా దుర్యోధనుడు

మనకు బాండురాజ తనయ వర్గమునకు
నెట్లు పొందు గలుగు నేను రాజ్య
భాగమీను సమర భంగిక విక్రమ
నిరతి బూను టిదియ నిశ్చయంబు.

అని ప్రత్యుత్తర మొసంగియుండుటచే సంధి దుర్ఘటమని కృష్ణు డర్జునున కు జెప్పగా

నకులుడు

> గోగ్రహణంబున గోలె నెంతయు మెత్త
> బడకుండుదురె వారు పద్మనాభ!

అని సర్ది చెప్పినాడు.

ఇక సంధికి బోవలదని చెప్పినవాడు యువకుడైన సహదేవుడు. "నాకీ వంక మాటలు దెలియవు. ఉచితమయినది కయ్యము. ధర్మరాజు మున్నగువారి సంధివాక్యములు రక్కసమాటలు. బిచ్చపుకూడు నాకు బనికిరా" దన్నాడు సహదేవుడు. ఈమాటలకు సాత్యకియునూ, యుద్ధములో ధర్మజునకు తోడ్పడ వచ్చిన రథికవరులునూ విజయధ్యానములు జేశారు.

కృష్ణుడు సంధి గోరిన భీముని హేళనజేసి మందలించాడు. కష్టపడని వారికి కార్యములు దేవుడు చేసిపెట్టడని సూచించాడు. తానేమి చేసికొని వచ్చేదీ, తన అంతరంగములో నేమున్నదీ, కృష్ణుడు జెప్పలేదు. కాని యాయన యభిప్రాయ మీక్రింది పద్యముల వలన దెలిసికొన దగును.

> చేవను లావునం గృషికి వేయువిధంబుల నేల నర్చినం
> దానికొనునే ఫలంబు దతితో దగువర్షము లేకయున్న నా
> ప్పురుషుఁ డెన్ని సేసినను పౌరుషముల్ ఫలియించు టెట్లు నా
> కర్ణముఁ బ్రసన్న మగు దైవముచేతనె చూవె ఫల్గునా !
> కావునఁ సంధికిం బురుషకారము నొగ్గద నోపినంతయుం
> దైవముచేత యెట్లగునొ దాని నెఱుంగ సుయోధనుండు సం
> భావనసేసి పాలొసగు పాడియ గల్గిన బాల్య మాదిగా
> నే విధినైనను జెఱుప నింతలు పాపము లాచరించునే

తాను సంధికై పురుషప్రయత్నము జేయుచున్నాననీ, దైవనియతిచే ప్రయత్నము విఫల మగుననీ, పై విధమున నర్జునునకు సూచింపగా నకులుడు

> గురుఁడుఁ గృపుడు బాహ్లికుడు భీష్ముడును బుద్ధి
> చెప్పి వారి జక్కఁజేయ రెట్లు
> కార్య మీవు చెప్పగా విదురుండు వి
> వంగ నెట్లు గాదనంగ వచ్చు?

అని పురుషప్రయత్నమును దైవసహాయమును రెండును గల వని చెప్పాడు. దానికి కృష్ణు డేమియు ననలేదు.

ఇంతపెద్దభారతములో కథకు ప్రత్యక్షముగా సంబంధించిన ప్రధాన స్త్రీపాత్రలు మూడే! కుంతి, ద్రౌపది, గాంధారి.

వీరు త్తమక్షత్రియ కాంతలు. కుంతీద్రౌపదులు పూర్వయుగపు వారు పూర్వయుగపు సాంఘికవైవాహికధర్మములు వారితో నంత మొందినవి. అంబికాంబాలికలు నియోగ మవలంబించిరి. కుంతి తన వివాహమునకు పూర్వమును తరువాతను గూడ అన్యపురుషసహాయ మున సంతానమును బడసినది. ద్రౌపది ఐదుగురుభర్తలు గలిగియు ఆలవ వానిపై మనస్సును ప్రసరింపజేసినది. కాని వీరందరును యుగ ధర్మము ననుసరించి ఉత్తమ సాధ్వులే. ద్రౌపది సత్యభామకు పాతివ్రత్య మహిమనుగూడ బోధించినది. కాని కౌరవసభలో కర్ణు డాడినమాట లను బట్టి యీ యాచారముల యెడ గౌరవము సన్నగిలు చుండినట్లు గ్రహింపవచ్చును. గాంధారి నూతనయుగపుస్త్రీ. నవయుగ మామె యందు మూర్తిభవించినది. కుంతీద్రౌపదుల బలము వంశపారంపర్య మున వచ్చునట్టిమాత్రము. గాంధారికి మహిమ పాతివ్రత్యముచే గలిగినది. ఈ శక్తి ఆకాలపు భీష్మద్రోణ, అర్జున, అభిమన్యు ఘటోత్కచ, కర్ణదుర్యోధన, శిశుపాల జరాసంధ, మున్నగుఅసాధారణ వ్యక్తుల శక్తు లతో తుల దైనది. అందుచేతనే జరాసంధ భీష్ములను సహితము సంహరించగలిగిన భీమార్జునులు గాంధారియొక్క పతివ్రతామహిమచే భస్మమైపోదు రని భీతిల్లి యామె నెదుర్కొనుటకై ధర్మరాజు కృష్ణుని మోటంచినాడు. ఆమె కోపాగ్నినుండి వ్యాసుడు పాండవులను రక్షింప గల్గెను గాని యాదవకులముమాత్ర మింధనమై నశించినది. ఈ సాధ్వీ మణులు,ముగ్గురును స్త్రీస్వభావ మయిన ఉద్వేగమును పట్టుదలయును గలవారు. కృష్ణుని రాయబారమునకు బంపునప్పుడు ధర్మజాదు లాడిన పేలవపు సంధివాక్యములు విని ద్రౌపది యాక్రోశించినది. ఆ యా క్రోశము ముల్లోకములకును వినబడి వుంటుంది. ముల్లోకనాథుని నసా శమున కెక్కినది.

ద్రోవది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విడ్చి వెండ్రుకల్
దా వలచేత బూని యసితచ్ఛవి బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలగ మనంబున బొంగు విషాదరోషముల్
గావగలేక బాష్పములు గ్రమ్మగ దిగ్గన లేచి యార్తయై.

ఈవెండ్రుకలు బట్టి యీడ్చిన యాచేయి దోఃతగా బోరిలో దుస్ససేను తను వింత లింతలు తునియలై చెదరి రూపఱియున్నగని యుడుకాఱుగాక యలుపాల బొనుపడినట్టి చిచ్చే యిది పెనుగద పట్టిన భీమసేను బాహుబలంబును బొటించి గాండివ మను నొకవి ల్లెప్పుడును వహించు

కత్తివిక్రమంబు గాల్పనే యిట్లు బ
న్నములు పడిన ధర్మనందనుండు
నేను రాజరాజు పీనుంగు గన్గాగ
గా బడయమైతిమే ని కృష్ణ!

“దుష్టనిగ్రహము బూని జగంబులు గాచునట్టి తోబుట్టువు నీవుం దేజమున బొల్చిన భర్తలు జీవించి యుండియు గూడ నాబన్నములకు ప్రతిక్రియ చేయలేకపోయితి” రని కృష్ణుని పాండవులను సహా చుట్టబెట్టి యేడ్చినది. అంత నీయాలాపము విని భక్తవశంవదు డైన శ్రీకృష్ణభగవానులు సంభ్రముడై పురుషప్రయత్న మను పేరుతో తాను రాయబారిపాత్రను ధరించితి ననియు ఘుడచి,

లలనా యడుగుము నీ యే
డ్పులకొలఁ దౌ కురునృపాలపుత్ర కళత్రం
బులయేడ్పు లింక వానిం
గలకల నవ్వుచు వినంగ గాలంబయ్యెన్.

అని ద్రౌపది కంటె నెక్కువగా నాక్రోశించినాడు. కాని ద్రౌపదికి స్థైర్యము తక్కువ. పొంగిపొరలిన కోపసముద్రము యొక్క పోటు వెంటనే తీసిపోయినది. ఇటులనే మఱియొకసారి దుఃఖపరవశ యై అశ్వత్థామను జంపు మని కోరి యాతనిం గట్టి తెచ్చినంజూచి ఆతనితల్లి యెంత యేడ్చునో విడిచిపుచ్చు డని ప్రార్థించిన దీయమ్మ. ఉక్కుయొక్క కాఠిన్యమునూ, బంగారముయొక్క మెత్తదనమునూ పర్యాయముగ నీమె మనస్సు నాక్రమించుచుతవి. కొంతసేపటి కామె యూరడిల్లినది. ద్రౌపది దుఃఖముచే కృష్ణుని మన స్సుఱ్ఱూత లూగుటగని పార్థుడు చుట్టఱికంబున

నుభయపక్షంబులును నీ వొక్క టగుటచే ఉభయపక్షములకును హితము జేయు మని సమరసపెట్టగా కృష్ణుడు మనసు నిలువరించుకొని కడ కిట్లు జెప్పియున్నాడు.

> అన విని కౌరవులకు మీ
> కును హితము ప్రియంబు జేయఁగోరియ కుంతీ
> తనయాగ్రజు పని ధృతరా
> ష్ట్రునికడకుం బోయెదను గడుం బ్రీతి మెయిన్.

అని పలుకగా ధర్మజుడు

> అని పలికిన హరిధర్మ వ
> చనముల తెలిగున కజాతశత్రుఁడు చిత్తం
> బున బొంగి యట్ల చేయుము
> మన నిశ్చయ మిదియ దీని మఱవకు మనఘా!

అని కృష్ణు డబలాపరాధీను డని యెఱిగి కాబోలును, ద్రౌపది దీనాలాపములకు కఱగినట్లై కుంతియాక్రందనమునకు లొంగి సంధికార్యము మఱచి యుద్ధము ప్రకటించి వచ్చునని సంకోచించి కాబోలు, పైపద్యపు కడపటి పంక్తిలో 'మన నిశ్చయ మిదియ, దీని మఱవకు మనఘా' యని అఱచేయి గిల్లి చెప్పినాడు.

కుంతి భోజపుత్రి. బాల్యమున అపవాదభయముచే కన్నపుత్రుని గంగ నిర్పంచ వలసివచ్చినది. చిన్నతనముననే వైధవ్యము ప్రాప్తించినది. తండ్రిలేని బిడ్డలను పెంచి పెద్దజేసినది. లాక్షాగృహదహనాది యిక్కట్టు లెన్నియో తరించినది. బిడ్డలకు ఱెక్కలువచ్చి కాస్త ప్రభుత్వము సాగీసాగనివెంటనే జూదము వాటిల్లినది. లోకమునకు విడ్డూరమును గొలుపు మానభంగము కోడలికి సంభవించినది. బిడ్డలడవుల పాలైనారు. తనభర్త సంపాదించిన రాజ్యమును నాచికొన్న దాయల యింట దాను భరణము గుడువవలసి వచ్చినది. వీనియన్నిటిలో కడపటి పరాధీనజీవితమే యామె క్షత్రియస్వభావమునకు దుర్భరముగ గన్పట్టినది.

> ఇది యెల్లను నొకతల యీ
> పదుమూడేడులును నాకు బావకొడుకుచే

సదయ మగు కూడు గుడుచుట

యని యొకతల యయ్యో నేమి యనగల దనఘా!

యని కృష్ణునికి జెప్పి యేడ్చినది. కృష్ణుడు సంధికి బోయినప్పుడు కొడుకులకు జెప్పిపంపిన వాక్యములు దాస్యమున మునిగిన భారతజాతికి జీవము వోయు సూనవి. సంస్కృతమున మిక్కిలి విస్తరించి యున్నవా నిని తిక్కన క్లుప్తీకరించి మూడు పద్యములుగ జెప్పినాడు. తెనుగు బాస గలంతకాలము ఆంధ్రుల హృదయఫలకములపై తగటు దీసినట్లు ప్రజ్వలింపక మానవు.

వేడికొని క్షత్రపులై కను
[illegible]మి య [illegible] రాజపుత్రులు దమమై
వాడమి దప్పిన నిప్పుడు
వేడిమి పెడచేసినట్లు జనులు [illegible] యనరే!

కొడుకు [illegible] [illegible] [illegible]
[illegible]కి నుచితమైన సమయ
[illegible] [illegible] [illegible]ము [illegible] [illegible] [illegible]ములు
[illegible] గాని పురుషు[illegible] [illegible] మిమ్ము!

భ జబ[illegible] [illegible]
[illegible]ము. వె [illegible] ని [illegible], వా [illegible]
[illegible]
[illegible] [illegible] [illegible] [illegible] [illegible] నదజతోన.

తన పుత్రులు [illegible]ము లేనిచా[illegible]నియు, భా[illegible] [illegible]రచిన యవమా నమునకు [illegible] [illegible] [illegible]నియు ఏ[illegible]దివర కవలంబించిన మార్గము [illegible] [illegible] [illegible] [illegible] [illegible]డికి [illegible]ర్యనిశ్చయము జేయ [illegible] [illegible]సియు నామె యభిప్రాయము.

[illegible] [illegible] [illegible] [illegible] [illegible]ములు విని శ్రీకృష్ణుడు ఒడలు [illegible].

ఉ[illegible] [illegible] [illegible]
[illegible]నవిధ యొ[illegible] యు[illegible]తసా[illegible]
[illegible]త్సాహము నొందు పుత్రుల
[illegible] జూడుగాక [illegible] మింకన్.

అని యోదార్చినాడు.

సంధిమాట లామునలియవ్వ నోట వెలువడలేదు. పైసంగ తులు కౌరవసభలో కృష్ణుడు సంధిమాట లాడకపూర్వము జరిగినవి. కృష్ణుడు విఫలప్రయత్నుడై తిరిగి యామెను సందర్శించినప్పుడు ఆమె సంధికుదురమికి సంతసించి అందరు విన కడపటి సందేశ మిట్లు చెప్పినది.

రాజుల కెందు నారయ పరాక్రమజీవనవృత్తి దక్క నొం
డోట నిషిద్ధ మండ్రు మును లుత్తమసత్త్వులు వంశధర్మముల్
పూజితభంగి జేయుదురు బుద్ధివిహీనులు కొంకదక్క ని
స్తేజపుఁగూటి కియ్యకొని దీనత బొందుదు రంబుజోదరా !

ఈయమ వాక్యములు విని జగదేకధన్వి యగుభీష్ముడు హడలి తత్తరపోయి,

పలుకునె యిట్లు కుంతి విని బమ్మెరవోయితి మింత నెట్టిదం
బు అగునె మాట లియ్యమయు బూజ్యుడు కృష్ణుడు కార్యవాదముల్
పలికెదువా లిట్లు కురుబాలిక ధర్మజవారిరాశికిం
జెలియలికట్ట వాసె మనచే నగు కర్జముచంద మెట్టిదో?

అని రాజసభలో బలికియున్నాడు.

ఇక, గాంధారీదేవి. ఈమె శకునికి సోదరి. కుంతిద్రౌపదులవలె నీమె క్షాత్రధర్మప్రాధాన్య గాదు. కష్టము లెన్నడు నెఱింగియుండ మియె దీనికి కారణము గావచ్చును. ఈమె మహిమకు గారణము పాతివ్రత్యము. పెండ్లికొడుకు గుడ్డివా డని తెలిసి నేత్రపటము గట్టు కొని యామెయు గుడ్డిదయినది. కొడుకు నంటి వజ్రశరీరము గావించి నది. పాండవులకు భాగమిచ్చుట న్యాయ మని బోధించినది. విజయ తనకు జయము కలుగున ట్లాశీర్వదింపు మని దుర్యోధనుడు గోరగా ధర్మ మున్నచోటనే జయ ముండు నని పలికినది. కృష్ణుని తోడ్పాటుచే గాకపోయినను, నాయమ వాగ్బలిమిచేతనే పాండవులకు జయము గలిగి వుంటుంది. యుద్ధము ముగిసిన తరువాత ధర్మరాజు, భీష్మద్రోణ కర్ణులబారి నుండి తప్పినా, భీముడు, గాంధారిశాపము వలన హతుడగు నని భయపడ్డాడు. ఆమె ననునయించుటకై తానుబోక కృష్ణుని బంపా డు. ఆమె కృష్ణునితో సంభాషించుచు కృష్ణుడు సంధికై ప్రయత్నిం

చడమూ దుర్యోధనుడు నిరాకరించడమూ యెరింగియు దుఃఖాతిరేక మున కోపోద్ధత యై

ధృతరాష్ట్రపాండుభూపతుల కుమారులుత్తములోన నీసున సమరమునకు
దొడగిన నీ వడ్డపడవైతి తగ జాలుమానుసు ల్గలిగియు మాననీయ
వాక్యంబ వయ్యును శక్యసమస్తకార్యం బవ జేర్కొనియును నుపేక్ష
సేసితి కురురాజు తెలుపన తిరిగితి నిఖిల రాజుల దజనీకములను
నామ మడచి తెల్లభూములు బా దయ్యె
నంతవట్టుఫలము ననుభవింపు

మని యాదవులు పరస్పర కలహములచే నశింతురుగాక యనియు యాదవకాంత లెల్లరును గౌరవకాంతలవలె విలపింతురుగాక యనియు శపించినది.

ఈసందర్భమున మనమొక విషయము ముఖ్యముగ గమనించ వలసి యున్నది. శ్రీకృష్ణుడు స్వయంనియమిత మయిన యీ రాయబారము నెందులకు దలపెట్టాడు? ఆయనకు సంధి పొసగవలయు నని యుద్దేశము గలదా? సంధిప్రయత్నము విఫలము గావడమునకు గారణ మేమి? సర్వశక్తుడయిన శ్రీకృష్ణు డేల సంధి పొసగించలేక పోయెను? కృష్ణుని మహిమ నెఱింగియున్న ధృతరాష్ట్రుడు సంధి యేల చేయ లేదు? ఘోషయాత్రయందును దక్షిణగోగ్రహణ సమయమునను గలి గిన పరాజయము నెఱింగియుండియూ దుర్యోధను డేల సంధికియ్యకొ నలేదు? కర్ణుడు సంధి నేల ప్రతిఘటించాడు? 'దుష్టచతుష్టయము' వారి రాజనీతి బలాబలముల పరిమితి యేమి? ఈప్రశ్నములకు ప్రత్యుత్తర ముల నిచ్చుటకు తరువాతి వ్యాసములో ప్రయత్నిస్తాము.

గుంటూరు, వున్నవ లక్ష్మీనారాయణ

చుక్కకన్నెలు

(దూడగడప నరసింహారావు. జాతీయకళాశాల. బందరు.)

అనగా అనగా వెనకఎప్పుడో చాలారోజులక్రిందట దేశమంతా అడివిగా ఉండేది. అప్పుడొకవేటకాడు ఉండేవాడు. వేటకాడంటే వేటకాడా! అతని ఛాతీ వెడలుపు, అతని అందమైన పొడగరితనము, అతనిపెద్దకళ్లు నిగనిగలాడే నల్లని అతనిబల్లు, జుట్టూ చూచి ఆకాశంలో తళుకుతళుకు మనేచుక్కకన్నెలు 'ఆహా! ఇతను ఎంత అందంగా ఉన్నాడు' అనుకునేవాళ్లు. అతను విల్లు ఎక్కుపెట్టి లేళ్ల వెంట పరుగెత్తుతుంటే చూచి కాళిదాసు 'వేగదీర్ఘీకృతాంగః' అన్నమాట నేర్చుకుని ఉంటాడు.

అతను పగలల్లా వేటాడి లేడి, జింక, కుందేలు వీటిమాంసము కాల్చుకుని తిని ఏసెలయేటినీళ్లో నాలుగు పుడిసిళ్లు త్రాగి రాత్రివేళల పెద్దరాళ్లమీద పడుకుని చుక్కకన్నెలవంక చూస్తూ ఉంటాడు. అందులో ముఖ్యముగా ముగ్గురుకన్నె లున్నారు. ఆముగ్గురిలో చిన్నఆవిడ ఉన్నది. ఆవిడ మహాచక్కనిచుక్క. ఆవిడా, వేటకాడున్నూ ఒకళ్లని ఒకళ్లు చూడనట్టుగా చూచుకుంటూ ఉంటారు.

ఆ అడివిలో ఒకపెద్దచెరువు ఉంది. ఆచెరువులో బంగారపు తామరలు నీలాలతో చేసినకలువలూ ఉన్నవి. చుట్టూ అడవి. ఒడ్డున చెట్లూ. చెరువులో నీళ్లు కొబ్బరిపాలవలె ఉంటవి. సామాన్యంగా ఈవేటకాడు ఆచెరువు పక్కనే పండుకుంటూ ఉంటాడు.

ఆ ముగ్గురు చుక్కకన్నెలూ ప్రతిరాత్రీ వచ్చి ఆ చెరువువంక చూస్తారు. వెన్నెలలో ఆచెరువులో నీరు తళతళా మెరుస్తుంది. చుక్కకన్నెలకళ్ళు మిలమిలా మెరుస్తవి. అప్పుడు చుక్కకన్నెలు పాడతారు గదా.

చెల్లీ! చెల్లీ! రావమ్మా
అక్కా! అక్కా! ఏమమ్మా
తెల్లతామరల వెండిచెరువులో
వెల్లి మునుగుదా మోయమ్మా!

అని. కానీ యెట్లా వస్తారు. నిచ్చెనా లేదు. మెట్లూలేవాయెను. వాళ్ళు అట్లా అన్నప్పుడల్లా వేటకాడు ఏంచేస్తాడంటే నిల్చుని తన విల్లు బుజముమీద నిలువుగా పట్టుకుంటాడు, చుక్కకన్నలుదానిమీద గాదిగిరావలెనని. అతను అట్లాచెయ్యటంతోటే చుక్కకన్నెలు నవ్వుకొని ఊరుకుంటారు.

ఇట్లాఉండగా ఒకరోజున ఒకసాలీడు చెరువుదగ్గర ఆకాశమల్లె చెట్టుమీద నుంచి చుక్కకన్నెల యిండ్లదగ్గర నల్లవడ్లచేలదాకా గూటిదారాలు అల్లినాడు. ఆరోజున ప్రొద్దుకూకేటప్పటికి వెన్నెల పలపలా వచ్చింది. ఆవెన్నెలలో సాలీడుగూడు తళతళా మెరిసింది. చుక్క కన్నెలూ వచ్చి చెరువు [illegible]

[illegible]! [illegible]! రా[illegible]
అక్కా! [illegible]క్కా! ఏమమ్మా
[illegible]తామరల వెండి[illegible]రువులో
వెల్లి ము[illegible] మోయమ్మా.

అని పాడినారు. గూట్లో [illegible]న్న సాలీడు అన్నాడు గదా:

[illegible]డమ్మా [illegible] చుక్కల్లారా! [illegible]డమ్మా!
వెండిగా[illegible]ముల నిచ్చెన [illegible]
వండు[illegible]మ్మా
[illegible]డమ్మా! [illegible]చుక్కల్లారా [illegible]మ్మా
వెండిచెరువులో [illegible]లాడగ
[illegible]ండమ్మా

అని.

చుక్కలకన్నెలు సాలీడుగూడు చూచి చాలా మెచ్చుకున్నారు. ఆదారాలు వాళ్ళెక్కితే తెగిపోవునేమో అనుకున్నారు. సాలీడుకి వాళ్లఉద్దేశం తెలిసింది.

మల్లెపూల బరు వుంటేనమ్మా
తెల్లదారములు తెగిపోవమ్మా

వెల్ల వెండితో నల్లానమ్మా
తల్లుల్లారా దిగిరండమ్మా
రండమ్మా! ఓచుక్కల్లారా! రండమ్మా!

అని అన్నాడు. చుక్కకన్నెలు వాళ్లల్లోవాళ్లు నవ్వుకుని దిగివచ్చారు. దిగివచ్చి తెల్లవాళ్లు స్నానాలాడారు. నీళ్ళు తబకల్లా కొట్టారు. ఒకళ్లమీద ఒకళ్ళు నీళ్లు చిమ్ముకున్నారు. తాచుపాముల్లే తలలు నీళ్ల మీదపెట్టి యీదారు.

వేటగాడు ఆరోజున భాగా వేటాడి అలిసిసొలిసి నిద్రపోయినాడు. మూడుజాములవేళకి అతనికి మెలకువ వచ్చింది. చెరువులో యెవరో సంగీతమల్లే మాట్లాడినట్లు వినిపించింది. పోయి చూశాడు. చుక్కకన్నెల్ని గుర్తుపట్టాడు. ఔనా కాదా యని యనుమానము తగిలింది. ఆకాశంవంక చూస్తే అక్కడ చుక్కకన్నెలు లేరు. అందుచేత వాళ్లే ననుకొన్నాడు. ఆరోజున శుక్లాష్టమి యగుటచేత అప్పటికే చంద్రుడస్తమించాడు. ఇంతలో తూర్పున చిన్నమబ్బుపట్టి తళుక్కున మెరిసింది. ఆమెరుపులో గట్టుమీద కొంచెం దూరాన యేదో తళతళలాడింది. వేటకాడు ఆ పొదలు ఆ పొదలు చాటుచేసుకొని పోయి చూస్తే, అవి చుక్కకన్నెలు విడిచినచీరలు. మెరిసేటప్పటికి అవ్వే తళతళలాడినవి. ఆచీరలు సన్నని వెండిదారాలతో నేసి బంగారపుపువ్వులు వేశారు. అంచులవెంబడి రత్నాలు చెక్కారు. ఆచీరలు చూసేటప్పటికి వేటగాడికి యొకఊహ కలిగింది. వెంటనే అన్నిటికన్న చిన్నచీరా అన్నిటికన్న అందమైనదీ పుచ్చుకొని ఒకచోటికి పోయి దాక్కొని చూస్తున్నాడు. ఇంతలో చుక్కకన్నెలు మబ్బు మరీపెద్దదైతే యింటికెళ్లేందుకు ఆకాశంలో దోవ తెలియదని వెళదామనుకున్నారు. అప్పుడు సాలీడు పాడాడు.

పొండమ్మా ఓచుక్కల్లారా పొండమ్మా
తెల్లవారితే ప్రొద్దుపొడిచారా
లల్లిక తెగి పోతుందమ్మా
పొండమ్మా ఓచుక్కల్లారా పొండమ్మా

ఇంతలో చుక్కకన్నెలుకూడా

చెల్లీచెల్లీ రావమ్మా అక్కా-అక్కా రావమ్మా
వెండివారముల నిచ్చెన లెక్కీ
కొండపైకి పోదా మో యమ్మా
చెల్లీ చెల్లీ రావమ్మా
అక్కా అక్కా రావమ్మా.

అని పాడారు. చుక్కకన్నెలు చెరువులోనుంచి లేచివచ్చి చీరలు విడచినచోటికి వచ్చిచూస్తే రెండుచీరలే ఉన్నవి. అందరికన్న చిన్న దాని చీర కనబడలేదు. ఇంతలో సూర్యుడిగుఱ్ఱాలు కక్కేనురుసు తూర్పుదిక్కున తుపరలుతుపరలుగా పడుతున్నవి. తమచెల్లిని వదలి పెట్టి అక్కలిద్దరు వాళ్లదారినివాళ్ళు కొండమెట్లెక్కి పోయినారు. సూర్యరథం వచ్చింది. దాని గుఱ్ఱాల గిట్టలు తాకి సాలీడుగూడు మెట్ల న్నీ తెగిపోయినవి. మబ్బులు వందలకివందలు అడ్డంవచ్చినవి. చుక్క కన్నె చీరలేకండా తనయింటికి వెళ్ళటానికి వీలులేదు. నీలమండలదా కా వచ్చే తనతడితల మొలచుట్టూ చుట్టుకొని చెరువుగట్టుమీాద విచా రిస్తూ కూర్చుంది. విచారిస్తున్నది.

పక్షులన్నీ మేలుకొన్నవి. అవి పాడుతున్నవి. ఏమని అంటే.

చల్లీ యేడుపే లమ్మా
అల్లా వేటకాడు దొంగ
పిల్లావా డమ్మా యేడుపేలమ్మా.

దూరాన ఒకమఱ్ఱిచెట్టుకింద నేమీా యెరగనట్లుగ వేటకాడు నిద్రపోతున్నట్టులుగా నటిస్తున్నాడు. చుక్కకన్నె పక్షులుపాడినపాట విని అతన్ని వెతుకొ్కనిపోయి అతన్ని అడిగింది. "నువ్వు యేదికోరు కుంటావో కోరుకో, వరమిస్తాను. నాచీరమట్టుకు నాకియ్యి"

అత నన్నాడు "నీచీర నీకు యివ్వను. నువ్విక్కడ నుండిపో. వాన లు కురిస్తే చలివేస్తుంది. నీ యీా పెద్దజుట్టు నాకుగూడా కప్పుడుకాని."

చుక్కకన్నె చీరలేకండా యేమీా చెయ్యలేదు. అందుచేత యే మంటుంది. ఊరుకుంది. చుక్కకన్నెకి వేటకాడికి తనమీాద చాలా

ప్రేమ ఉన్నదని తెలుసు. వేటకాడు ఈకుచెట్టు ఆకులు తెచ్చి యిచ్చాడు. చుట్టుకున్నది.

వాళ్ళుయిద్దరు మొగుడుగా పెళ్లాముగా యేళుసంవత్సరాలు కాపురంచేశారు. పగలు అతను వేటాడి యిద్దరికి ఆహారం తెచ్చేవాడు. రోజూ సాయంత్రంపూట అతను కాసేపు అడివిపాటలు పాడేవాడు. చుక్కకన్నె చుక్కలోకంలో పాడేపాటలు పాడేది. పాడితే అతను మూర్ఛపోయేవాడు. చుక్కకన్నె ముద్దుపెట్టుకుంటే లేచేవాడు. వెన్నెలరాత్రులలో చుక్కకన్నె వెళ్లి చెరువుగట్టున కూర్చుండేది ఆకాశం వంక చూసేది. అప్పగార్లిద్దరు కన్నీళ్ళు కార్చేవాళ్ళు, ఆవిడకూడా కన్నీళ్ళు కార్చేది. వేటకాడు వెనకనుంచి వచ్చి కళ్ళుమూసేవాడు. ఒకచిన్నమబ్బు అడ్డమువచ్చేది. కన్నీటితో తడిసిన తనచేతులు వేటకాడు తనజుట్టుకు రాచుకునే వాడు. చుక్కకన్నె అలసిమీద వాలిపోయేది.

రోజూ రాత్రులలో సూర్యుడు గుత్తాలు తెంచినదారాలు సాలీడు ముడిపెట్టుకుంటూ వుండేవాడు. ఆ దారాలు వెన్నెలలో తళతళ మెరుస్తూ ఉండేవి. కానీ, యెన్నడూ మళ్లీ తెనాలాడేందుకు చుక్కకన్నెలు దిగిరాలేదు.

ఇట్లావుండగా వేటగాడికీ చుక్కకన్నెకీ నలుగురు బిడ్డలు పుట్టారు. అందరికన్న చిన్నది ఆడపిల్ల. ఆ అమ్మాయిపేరు చిన్నిమణిపూస పెద్దవాడిపేరు చుక్కలవెలుగు. రెండవవాడి పేరు వెండితళుకు. మూడవవాడిపేరు నల్లకలువ.

ఒక రోజున పెళ్లాన్ని పిల్లల్ని పిలిచి వేటగాడన్నాడు "అసలు నాదీ దేశం కాదు. నాతండ్రీ నేనూ పోట్లాడి యిట్లా లేచివచ్చాను. లేచివచ్చి యిరువదియేళులు అగుచున్నది. నాతండ్రి చనిపోయినాడని. వార్త వచ్చింది. నేను వెళ్లివస్తాను." చుక్కకన్నె యేడ్చింది. ఏ అడివి జీవమైనా మీదపడుతుందేమో! దోవ గడ్డగా వుంటుంది. నన్నూ పిల్లల్ని వదలి పెట్టకోయీ వేటగాడా" అంది. అంటే వేటగాడన్నాడు. "ఈఒక్కసారీ వెళ్లకతప్పదు. ఇంకొకసారి నిన్ను వదలిపెట్టి వెడితే అను" అని.

చుక్కలవెలుగు తానుగూడా తండ్రివెంట వెడతా నన్నాడు. తండ్రి "వద్దోయి! నీవు యిల్లుకాస్తూ వుండు" అన్నాడు. తక్కినపిల్లలు మరీ చిన్నపిల్లవాళ్ళు కనుక ఊరుకున్నారు.

చుక్కలవెలుగు తండ్రిని కొంతదూరము పంపించాడు. తండ్రి వారంరోజులలో తిరిగివస్తా నని చెప్పి తాళముచెవు లిచ్చి అన్నిగదుల చెవులూ చూపించి చివరగదిది బంగారపుతాళపుచెవి యని చెప్పి, ఆ తలుపు మట్టుకు యెప్పుడూ తీయవద్దు అని చెప్పాడు. చుక్కలవెలుగు సరే నన్నాడు. ఇంటికి తిరిగిరాగా తల్లి యేడుస్తున్నది. "ఎందుకు యేడుస్తావు. తండ్రి వారంరోజులలో తిరిగి వస్తాడు" అన్నాడు. తల్లి "అందుకు కాదు. నేనూ మాదేశం వెళ్లా లని వుంది. వెళితే మళ్లీ తిరిగిరాను. అందుకని యేడుస్తున్నాను" అంది. చుక్కలవెలుగు అన్నాడు కదా "మమ్మల్ని మానాన్ననీ వదిలిపెట్టి వెళ్ళతావా" అని. తల్లి మిమ్మల్ని వదిలిపెట్టి పోనంది. చుక్కల వెలుగు అనుకున్నాడు, తల్లి అసలు వెళ్ల దనుకున్నాడు. ఆరోజున రాత్రి ఒకరాత్రివేళ చుక్కలవెలుగుకి వచ్చీరాకుండా మెలకువ వచ్చింది. పైట గాలిలో యిట్లా వినబడ్డది.

చెల్లీ లేచి రావమ్మా
కొల్లాదారా లల్లీ సాలీ
దల్లాడమ్మా నిచ్చేటల్లా
చెల్లీ లేచిరావమ్మా.

అతని తల్లి పాడుతున్నది.

చిన్నితల్లీ నామణిపూసను
నేనూ వదిలీ రాలేనమ్మా
నాబంగారపు తల్లీని వదలీ
నే బోనమ్మా కూరాలు.

ఇంతలో మళ్లీ గాలిలో వినిపించింది.

నీతో తీసుకురావమ్మా
నీతల్లిని మణిపూసను చెల్లీ
నీప్రాణాలు మణిపూసైతే

మణిపూసను తీసుకురావమ్మా
చెల్లీ లేచిరావమ్మా

ఈమాటలకు తల్లి బదులుచెప్పలేదు. మళ్లీగాలిలో వినిపించింది.

చెల్లీ లేచిరావమ్మా
తెల్లాగూడా గాలిలో సాగీ వల్లాడమ్మా రావమ్మా
ఎల్లాచుక్కలు నీకోసగమై కళ్లానీళ్లుపెట్టేరమ్మా
చెల్లీ లేచిరావమ్మా

అప్పుడు మణిపూస నిద్రలేచి ఏడ్పుట మొదలుపెట్టింది. ఆ తల్లి యి జోలపాడింది.

ఏడవకమ్మా ఓతల్లీ
నిన్నూవదలీ నేపోనమ్మా ఏడవకమ్మా ఓతల్లీ
నాచీరేమో పోయిందీ
నేనీలుగను దాచినచోటేదో ఏడవకమ్మా

మణిపూస నిద్రపోయింది. కొంతసేపు అంతా నిశ్శబ్దంగాఉంది. మళ్లీ గాలిలో ఒకపాట వినిపించింది.

తల్లీ భయమూ లేదమ్మా
మెల్లగ బంగరుతాళపుచెవి నీ
వెల్లాగయినా సంపాదిస్తే
తల్లీ భయమూ లేదమ్మా

తరవాత చుక్కలవెలుగుకి నిద్రపట్టింది. నిద్రలో యెవరో యిద్దరు దేవతాస్త్రీలు కనబడి 'ఆ బంగారపుచెవితో అతలువు తియ్యి మీతల్లికి జన్మదుఃఖం' పోతుంది అని చెప్పారు.

ప్రొద్దుననే చుక్కలవెలుగు తల్లిదగ్గరకువెళ్లి 'అమ్మా! రాత్రి నిన్నెవరో రమ్మని పిలుస్తున్నారు. నీవు వెళతావా' అని అడిగినాడు. ఆవిడ 'నీవు కలగన్నావు కాబోలు: నన్నెవరూ పిలవలేదే' అన్నది. చుక్కలవెలుగు నమ్మలేదు. చుక్కలవెలుగుకి ఆచివరగది తీసిచూద్దామనిపించింది. వెళ్లి తీసిచూశాడు. అందులో చుక్కకన్నెచీర ధగధగా

మెరిసిపోతోంది. అప్పుడు చుక్కకన్నె తనతక్కినబిడ్డలను స్నానము చేయించుటకు పక్కనున్నవాగుదగ్గరికి తీసుకుపోయింది. తల్లి రావటం తోనే ఆచీర తీసుకువెళ్లి ఆవిడకి యిచ్చాడు. 'అమ్మా! నీవు కట్టుకో' అన్నాడు. ఆవిడ ఆచీర కట్టుకుంది. కట్టుకోగానే చుక్కలవెలుగు అనుకున్నాడు ఈచీరె కట్టుకుని తల్లి రాత్రికలలోకి వచ్చిందని. పిల్లలందరు తల్లిచుట్టూ చేరి గంతులువేశారు.

చుక్కలవెలుగు తల్లితో 'అమ్మా! ఆచీర యింకవిప్పియియ్యి. దాచేస్తాను. రోజూ సాయంత్రం ఇస్తాను. రాత్రికి దాచేస్తావుంటాను.' అని అన్నాడు.

తల్లి 'అట్లాకాదు. ఇది కట్టుకోని పడుకుని, ఇవ్వాళ రాత్రి మణిపూసని జోకొట్టి రేపు ఇస్తానులే' అన్నది.

కొడుకు సరే లే అనుకున్నాడు.

మళ్ళ అవ్వాళ రాత్రి చుక్కలవెలుగుకి మెలకువ వచ్చింది. గాలిలో మాటలు వినపడ్డవి.

> చెల్లీ లేచిరావమ్మా
> తెల్లాగూడులు గాలిలోసాలీ దల్లాడమ్మా రావమ్మా చె।
> ఎల్లాచుక్కలు నీకోసమై కళ్లానీళ్ళోమ్మా చె

కొంచెమునే పయింది. తనతల్లిగూడా దూరమునుంచి యెక్కడనుంచో పాడుతున్నట్టు వినపడ్డది.

> చిన్నితల్లీ నామణిపూసను నేనూ విడగా లేనమ్మా!
> నాబంగారుపుతల్లిని వదలీ నేనుండంగా లేనమ్మా

చుక్కలవెలుగు లేచి చూద్దా మనుకున్నాడు. కాని యతనికి నిద్ర ముసురుకొచ్చింది. మర్నాడు ఎంతో ప్రొద్దెక్కి లేచాడు. లేవడంతోటే తల్లికోసమని పరుగెత్తాడు. తల్లీ మణిపూసా యెక్కడా కనపడలేదు. వెండితళుకూ, నల్లకలువా వచ్చారు. అన్ననిచుట్టుకు ఏడ్చారు. ఆరోజున వాళ్లుముగ్గురూ తిండీతిప్పలూ లేక ఏడుస్తూనే

వున్నారు. చుక్కలవెలుగు 'అమ్మా మమ్మల్ని పిల్లల్ని వదిలిపెట్టి యెక్కడికి పోయావు. మాకు ఆకలివేస్తోంది' అని కేకలువేస్తూ అడివి వెంట తిరిగాడు. చాలా యేడ్చాడు. పిల్లలిద్దరూ మరీయేడ్చారు. ఎవ రో దొంగలువచ్చి తనతల్లినీ మణిపూసనీ, బంగారపుచీరనీ యెత్తుకు పోయా రనుకున్నాడు. చుక్కలవెలుగుకి భయం వేసింది. అయ్యో తండ్రిఆజ్ఞమీరానే. అందువల్లనే గదా యీఆపద వచ్చింది." తండ్రి వచ్చి యేమంటాడో అని వణికాడు. పిల్లల్నిద్దరినీ యే వాగుదగ్గ రకో తీసికొని వెళ్లి నీళ్ళు పట్టాడు.

పొద్దుకూకింది. చీకటి పడ్డది. పిల్లల్నిద్దరినీ పడుకోబెట్టి పక్కని తానుకూర్చుని యేడుస్తున్నాడు. తల్లి బంగారపు చీరగట్టుకొని దబా లున తలుపుతీసుకు వచ్చింది. ముగ్గురుపిల్లలూ ఎగిరి తల్లిమీద పడ్డా రు. ఏడిచారు. తల్లి వోదార్చింది. 'నాయనా! మిమ్మల్ని నేను చూ స్తూనే వున్నాను. నేను మీకు కనబడటం లేదుగాని. ఇదిగో మీకో సం తియ్యని బువ్వ తెచ్చాను. తినండీ' అన్నది. పిల్లలిద్దరూ ఎగబడి తిన్నారు. చుక్కలవెలుగు తినలేదు. "నువ్వు వెళ్లనంటివి గదా! ఎక్క డికి వెళ్లావు. మణిపూస యేదీ!" అన్నాడు. తల్లి చెప్పింది. "మణి పూస మాఅక్కలదగ్గర వున్నది. నే నిక్కడవుండటానికి వీలులేదు. నువ్వు యీబువ్వ తిను. నేను మళ్లీ రేపురాత్రి వస్తాను. మళ్లీ బువ్వ తెస్తాను."

చుక్కలవెలుగు యేడ్చాడు.

'నేను తినను. తండ్రివచ్చి తలుపెందుకుతీశావని కొప్పడతాడు. చీరవిడిచి పో'అన్నాడు.

తల్లి 'ముందర యీ తియ్యని బువ్వ తినుమన్నది. చుక్కల వెలుగు తిన నన్నాడు.

తెల్లవారవచ్చింది. బయట పాటలు వినపడ్డవి.

"చెల్లీ లేచి రావమ్మా
చెల్లాయ్ లేచిరావమ్మా

తెల్లావారితె వెలుగున దారా అల్లులు తెగిపోతాయమ్మా ।చె।
పిల్లా నీప్రాణము మణిపూసా తల్లీ యని యేడుస్తోందమ్మా ।చె।"

నిదరపోతున్న నల్లగలువ లేచి యేడ్వుట మొదలుపెట్టినాడు. తల్లి పాడింది.

'ఏడవకయ్యా నాతండ్రీ నిన్నొవదలీ నే పోనయ్యా ।ఏడ
నీవేడిస్తే నాగుండెల్లో నీరై పోతుం దయ్యా తండ్రీ ।యేడ

చుక్కలవెలుగు కన్ను తెరచి చూచేటప్పటికి తల్లీ లేదు. నల్లగలువా లేదు. మళ్లీ అతనికి పెద్దనిద్ర వచ్చింది. మర్నాడు వెండితళుకు తల్లికోసం యేడ్చాడు. చుక్కలవెలుగు అన్నాడు. "ఏడవకురా! అమ్మ రాత్రికి మళ్లీ వస్తుందీ" అని. కాని పిల్లవాడూరుకోలేదు. ఏడ్చి యేడ్చి అతనికళ్లు వుబ్బినై. ఎట్లాగైతేనేం రాత్రి వచ్చింది. రాత్రి వెంబడే తల్లిగూడా వచ్చింది. వెండితళుకు తల్లినిచూడ్డగానే పోయి మీదబడ్డాడు. 'అమ్మా యీసారి నన్ను వదిలిపెట్టిపోకు' అన్నాడు. అతనితల్లి చుక్కలలోనుంచి తెచ్చిన తియ్యనిబువ్వ అతనికి పెట్టింది. చుక్కలవెలుగేమో తినలేదు. చుక్కలవెలుగు తల్లితో అన్నాడు గదా! 'నీ వేమో మణిపూసను తీసుకువెళ్లావు: నల్లగలువను తీసుకువెళ్లావు. ఇప్పుడేమో వెండితళుకును తీసుకువెళతావు. నాన్న వస్తే యేం చెప్పమంటావు.'"

చుక్కలకన్నె అన్నదీ. 'ఈతియ్యబువ్వతిను. చక్కగా మనం మాట్లాడుకుందాం. నువ్వంతా మరచిపోతావు.' 'అందుకనే నేను తిననన్నాడు' చుక్కలవెలుగు. 'ఒకసారి నాతండ్రి ఆజ్ఞ దాటాను. ఇక మటుకు దాటను' అన్నాడు. ప్రొద్దు పోయింది. అందరికీ నిద్ర మూసుకువచ్చింది. ఒకరాత్రివేళ మళ్లా పాట యిలా వినబడ్డది.

లేరావమ్మా
తెల్లవారితె వెలుగునదారా అల్లులు తెగిపోతాయమ్మా
నల్లకలువా చిన్నిపూసా పిల్లా లేడుస్తున్నారమ్మా. ।చెల్లాన్।

అప్పుడు నా చిత్రగాడు లేచి యేడ్చాడు. తల్లి జోలపాడింది.

ఏడవకయ్యా నాతండ్రీ
నిన్నూవదలీ నేపోనయ్యా ॥ఏడ॥
నీవేడిస్తే నాగుండెల్లో
నీరై పోతుం దయ్యా తండ్రీ ॥ఏడ॥

చుక్కలవెలుగు లేచి చూద్దా మనుకున్నాడు. తల్లి దూర దూరాన పాడినట్టు విన్పించింది. కాని నిద్ర మూసుకువచ్చింది.

ప్రొద్దున్నే లేచాడు. ఎవ్వరూ లేరు. తానొక్కడునూ ! కూర్చుని యేడ్చాడు. మూన్నాళ్ళుగా తిండిలేదు. ఏడ్చియేడ్చి కళ్ళువెఱ్ఱబడి గుంటలుపట్టినవి.

మళ్లీ ప్రొద్దుగూకింది. తలుపు తెఱచుకొని తల్లి గడపలో నిల్చున్నది. చుక్కలవెలుగు తలయెత్తి చూచాడు. "మణిపూసయెక్కడ ! నల్లకలువా, 'వెండి తళుకూ యేది? నువ్వు యెక్కడికి వెళ్లినావు? నాన్నవస్తే నన్ను శిక్షిస్తాడు. ఆయనమాటవినక నేను తలుపుతీసినందుకు." అన్నాడు తల్లిదగ్గరకు వచ్చి. 'ఇదిగో యీతియ్యనిబువ్వ తిను. మూడురోజుల్నించి అన్నంలేదు. తరువాత మాట్లాడదాము' అన్నది. చుక్కలవెలుగు అన్నాడుగదా 'మానాన్న తిరిగివచ్చేవరకూ నేను భోజనముచేయ' నన్నాడు. తల్లి అతనిని వోదారుద్దామని ప్రయత్నించింది. 'నాయనా మానేలకు పోదాం. అక్కడ తమ్ముళ్లూ చెల్లాయీ వున్నారు. రా' అన్నది. చుక్కలవెలు గన్నాడూ 'ఒకసారి నాతండ్రి ఆజ్ఞ దాటాను. ఇంకదాటను. ఇదివరకు దాటినందుకే తగినంతఆపద వచ్చింది. ఆయన నన్ను ఇల్లుకాపాడుతూ వుండమన్నాడు. ఆయన వచ్చేవరకూ నే నిక్కడనుంచి కదలను." అని. తల్లికి చుక్కలవెలుగు సంగతి తెలిసింది. తాను చుక్కలవెలుగు పుట్టినప్పుడే అనుకుంది.'వీడు పుట్టుకు మనలోకానికి వచ్చేవాడుకాదూ' అని. ఉన్ననిజ మేమిటంటే కొత్తలో చుక్కకన్నెకి వేటకాడిమీద ప్రేమ వుండేది ఆప్రేమ ఫలితంగా చుక్కలవెలుగు పుట్టాడు. అతను ముమ్మూర్తులా వేటకాడే. తక్కినపిల్లలు తల్లినిపోలి పుట్టారు.

తల్లీ చుక్కలవెలుగుతో అన్నది. 'రేపు మీతండ్రి వస్తాడు. నేను మానేలకు పోయినా నని చెప్పు. నాచీర దొరికిం దని చెప్పు. చుక్కకన్నెలు వచ్చి నీకలలో తలుపుతీయ మన్నా రని చెప్పు. ఇన్ని సంవత్సరాలూ రహస్యంగా నేను యేడుస్తున్నా నని చెప్పు. ఇఖ రా నని చెప్పు.'

అంతవరకూ తలవంచుకొనివున్న చుక్కలవెలుగు చివరమాటకు తలఎత్తాడు. తల్లి అక్కడ లేదు. కనబడని సాలీడుగూటి నిచ్చెనయెక్కి వెళ్లిపోయింది.

మర్నాడు సాయంత్రం ప్రొద్దుగూకేవేళ తండ్రివచ్చాడు. వచ్చే వేళకు చుక్కలవెలుగు అతనివంకే కళ్లుతిప్పి చూస్తున్నాడు. తండ్రి దగ్గరకు వచ్చినతోడనే "అయ్యో ? తండ్రీ! నేను నీకొడుకునగుటకు తగను. నానిద్రలో ఏవో భూతాలు వచ్చి నాచేత తలుపు తీయించి నవి. బంగారుచీర మాతల్లి తీసుకున్నది. నే నిమ్మంటే ఇవ్వలేదు. ఆరాత్రి మణిపూసను, మఱునాడురాత్రి నల్లగలువనూ, మూడవనాడు రాత్రి వెండితళుకునూ తీసుకుపోయినది. గడచినరాత్రి నన్ను తీసుకు పోవుటకు వచ్చినది. నేను పోలేదు. నీతో నాఅవినయం చెపుదామని మిగిలాను. చుక్కల్లోకాన్నుంచి యేదో తియ్యనిబువ్వ తెచ్చి తినుమం టూ వచ్చింది. నేను తినలేదు. అది తింటే దుఃఖాలన్నీ మరచిపోతా వన్నది. అందుకనే నేను తిన నన్నాను. తండ్రీ! నీవుయిచ్చిన రెండు ఆజ్ఞల్లో ఒకటిదాటాను. తలుపుదెఱచి చీర మాతల్లి కిచ్చాను. రెండవ యాజ్ఞ నీవు ఇల్లుకాపాడుతూ ఉండ మన్నావు. ఇదిగో నీఇల్లునీకప్ప జెప్పాను. నీవు వెళ్లినదిగా నాకు తిండిలేదు.' అని చుక్కలవెలుగు సొమ్మసిలి పడిపోయినాడు.

వేటకాడు, పొంతవాగునుండి నీరుదెచ్చి కొడుకుమీద చిలక రించాడు. ఆఆకులూ యీఆకులూ తెచ్చి రసాలుపిండాడు. కొడుక్కి ప్రాణం రాలేదు.

తెల్లవారేవరకు ఆయింట్లో రెండుశవాలు ఉన్నవి.

ఇప్పటికీ నడిరాత్రివేళ అక్కడికిపోతే సాలీడుగూటి నిచ్చెనల మీదనుంచి, ముగ్గురు స్త్రీలు, ముగ్గురుపిల్లలూ దిగి వస్తూఉంటారు. దిగివచ్చి చెరువులో స్నానముచేసి తామరలూ కలువలూ కోసితెచ్చి చుక్కలవెలుగూ వేటకాడూ ఒకళ్ళమీద ఒకళ్ళుపడి చచ్చిపోయిన చోట నీళ్ళుచల్లి ఈపువ్వులు పరచి కాసేపు ఏడ్చి తెల్లవారేవరకు మాయమైపోతూ ఉంటారు.

దూడగడప నరసింహారావు, బందరు.

సరస్వతీపూజ.

చింతా దీక్షితులు.

"కొయ్యబొమ్మలు మెచ్చుకళ్లకు
కోమలుల సౌరెక్కువా?" — గురజాడ అప్పారావు.

౧

ఆవూరు వెళ్లడం నాకదే ప్రథమం. ఊరంటే మరేమీ ప్రసిద్ధమైనఊరు కాదది, అన్ని ఊళ్లవంటిదే అని మొదట నేను అనుకొన్నాను. కాని రెండురోజులపాటు ఆఊళ్లో ఉండడంతోనే ఆఊరి విశేష మొకటి నాకు బోధపడింది. అదేమిటంటే.—

శాక్తేయమతస్థులూ వామాచారపరాయణులూ, 'రామానుజకూటస్థులూ చాలామంది ఆఊళ్లో ఉన్నారుకాబో లనుకొన్నాను. ఒకశాస్త్రులుగారు మడిబట్టలు కట్టుకొని, రాగిజారీచెంబు చేత్తోపట్టుకొని, మొగంనిండా కుంకుంబొట్టుపెట్టుకొని, కాళ్ళు ఎత్తెత్తివేస్తూ ఆదారిని వెళ్ళుతున్నాడు. నేను ఆయనకు నమస్కారంచేసి కుశలప్రశ్న అడగబోయేకోలేదో "లేలే, దూరంగాఉండు. దూరంగాఉండు. అంతా మాలకూడు తీసుకువచ్చి కలుపుతున్నారు. ఒకనియమం లేదు. ఒక వ్యాకరణం లేదు— ఒకఛందస్సు లేదు... వీళ్లబొంద ......వెళ్ళు దూరంగా వెళ్ళు." అని ఆయనే నన్ను కుశలప్రశ్న చేశాడు. కిక్కురుమనకుండా తలవంచుకొని దూరంగా తొలిగిపోయాను. ఇదేమిశాక్తేయమతం దేవుడా, వ్యాకరమంటాడు, ఛందస్సంటాడు, తిడతాడు" అని ఆశ్చర్యపోయాను.

గండభేరుండంచుపంచ కట్టుకొని నఖశిఖపర్యంతమూ నామాలు ఒత్తుగాపెట్టుకొని ఒకఆచార్యులుగారు తాంబూలం వేసుకుంటూ ఒక వేశ్యకు మంత్రోపదేశం చేస్తున్నాడు. ఏమిటిచెప్మా ఈమంత్రమని

ఆలోచించి రామానుజకూటంలో రహస్యాలుభేదించడానికి సామాన్య మానవులకు దుస్తరమని అనుకొంటూఉండగా "అక్కడ అరసున్న ఏదు; మరిచావా అర్థానుస్వారనిఘంటు వచ్చాడే! పోతోంది! తగుల పడిపోతోంది. ఎంతని మొత్తుకొనేది. కవిత్వానికల్లా శృంగారరసం ప్రధానంగదా, చెప్పితే కవిత్వం వేశ్యే చెప్పాలి అని నేను ఎంత అఘోరించినా, ఏఅరసున్నో ఏబండిరాటో వదిలిపెట్టి కవిత్వాన్ని చంపి వేసున్నావు" అని ఆవిడమీద ఆయన కోప్పడుతున్నాడు. ఆవిడ కవిత్వంలో శృంగారరసం ఉన్నా లేకున్నా ఆప్రాంతమంతామాత్రము శృంగారరసమయమైనది.

ఆఊళ్లో చాలామంది ఈమాదిరిజనం ఉండడం నేను కనిపెట్టేను. నే ననుకొన్నట్టు వాళ్ళు శాస్త్రీయులూ కారు రామానుజ కూటస్థులూ కారు. అయితే మరిఎవరు అని ప్రశ్నవచ్చింది. మరిఎవళ్లో అయితే ఈకంఠంబొట్లేమిటి; ఈఎర్రిబడ్డకట్లేమిటి; ఈపంగనామము లేమిటి; ఈగంధాక్షతల పూత లేమిటి! ఈముడిగట్టుకోడాలేమిటి అని పించింది.

ఆలోచించగా ఆలోచించగా ఒకవిషయం స్ఫురించింది. మత విషయాలలో వామాచారం, రామానుజకూటం బయలుదేరదీసినట్లే, భాషావిషయంలోకూడా తత్తుల్యమైనఒకకూటం బయలుదేర దీశారు కాబోలు ఈఊళ్లో బుద్ధిమంతులు అనుకొన్నాను. చూచినకొద్దీ నాఅభిప్రాయం దృఢపడ్డది. దీనిసంగతిసందర్భాలు తెలుసుకోవలె నని నాకు ఇచ్ఛపుట్టింది. అందుకోసము ఒకశాస్త్రుల్లుగారిస్నేహం చేశాను. ఆయనపేరు కిట్టప్పశాస్త్రుల్లుగారు. ఆయన వ్రాలుచేసేటప్పుడుకూడా కిట్టప్పశాస్త్రుల్లు అనే వ్రాస్తాడు. ఆకారణముచేతనే ఆపేరుమార్చకుండా ఆరీతిగానే వ్రాయవలసివచ్చింది. కిట్టప్పశాస్త్రుల్లుగారు సరసులు. కవిత్వమంటే కొంతమంది చెవికోసుకుంటారు. కవిత్వమంటే కిట్టప్ప శాస్త్రుల్లుగారుమాత్రం చెవేకాకుండా ముక్కూ, కాళ్లూ చేతూలూ

వగైరా అవయవాలు చాలా కోసుకొంటాడు. అందుచేత నేను ఆయ
న్నిపట్టాను. ఆయనతో పరిచయంసంపాదించుకోవడముకోసం ఒక
పద్యంకూడా కష్టపడి సంపాదించేను.

అసలు కిష్టప్పశాస్త్రుల్లుగారు కవిత్వంకోసం మడీమాన్యం అమ్మి
వేశారు. వార్ధక్యంలో ఆయనకి ఆయనకష్టపడి వ్రాసిన కొన్నిపద్యాలు
మాత్రం మిగిలినవి. అవే సంతానముగా, అవే సిరీసంపత్తుగా, అవే
ఆస్తిగా ఆయన చూచుకొంటున్నాడు. ఆపద్యాలను పురస్కరించు
కొని ఆయన భాషకు సంబంధించిన రామానుజకూటంలో ప్రవేశించిన
మాట నేనువిని ఆయనను ఆశ్రయించాను. నేడు కిష్టప్పశాస్త్రుల్లుగారు
ఆకూటానికి మూలవిరాట్టు లైనారు. ఆయన్ని ఆశ్రయిస్తే నాకు
లభ్యంకానిదేమిటి ?

ఒకనాడు ఉదయాన్ని నేను మడికట్టుకొని గంధాక్షతలు వత్తు
గా పెట్టుకొని మెళ్లో పూర్ణానుస్వారాలవంటి తావళాలు వేసుకొని
చేత్తో అప్పకవీయం, బాలవ్యాకరణం, కవికంఠపాశం ఇత్యాదిపుస్త
కాలు పట్టుకొని కిష్టప్పశాస్త్రుల్లుగారింటికి వెళ్ళాను. తోవలో కనిపిం
చిన కత్తిరింపుజుట్టుకుర్రవాళ్లని చూచి దూరంగావెళ్లి 'వాళ్ళను నాలు
గుతిట్టి వాళ్ళచేత నాలుగుపడి కిష్టప్పశాస్త్రుల్లుగారింటికి వచ్చి కాళ్ళు
కడుక్కొని ఆచమనంచేశాను—ఇదంతా కిష్టప్పశాస్త్రుల్లుగారు చూ
స్తూనే ఉన్నారు. కులుకుతూనే ఉన్నారు.

ఇంట్లో ప్రవేశించి ఆయనకు అమాంతంగా సాష్టాంగనమస్కా
రం చేసి సున్నాలపన్నం ఏకరుపెట్టాను. శాస్త్రుల్లుగారు నన్ను కూచో
బెట్టి వళ్లుతడివి దీవించారు. ఇంక నాసంగతిసందర్భాలు నేనుచెప్పక
ముందే ఆయన మొదలుపెట్టేరు— "విన్నారండీ. కలికాలమాహాత్మ్య
ము. రాజన్నవాడు అపరాధులను శిక్షించకపోతే అటువంటివాడు
ఉండిననేమి తాను మరి యూడిననేమి ధరాతలంబునకు. ఏమంటారు?
మాట్లాడ రేం"

"చిత్తంచిత్తం"

"దేశద్రోహమే ద్రోహమా! దొంగతనమూ లంజతనమూ మాత్రమే దోషములా? మాటాడరేం"

"చిత్తం చిత్తం"

"తగలబెట్టేస్తున్నారు భాషని. అరసున్న లక్కరలేదట! ఊ! శకటరేఫలు— ఊ! మాట్లాడరేం"

"చి త్తంచి త్తం"

"విన్నారండీ! నేనే రాజునైతేనా వీళ్ళందరినీ శొరతను వేయించివేద్దును. ఉరిశిక్ష విధించివేద్దును. ద్వీపాంతరవాసశిక్ష— ఊ! మాట్లాడరేం"

"చి త్తంచి త్తం"

"మరి మనలోమనమాట, నేనొక్కప్రశ్న అడుగుతాను చెప్పండి. అందరూ జట్కాబండి జట్కాబండి అంటారుగదా. అది నిజంగా జట్కాబండా?"

"చి త్తంచి త్తం"

"అది నిజంగా జట్కాబండి కాదు. అవునంటారా కాదంటారా?"

"చి త్తంచి త్తం"

"అది నిజంగా చట్కాబండి. సరళాదేశమువల్ల వచ్చినజకారాన్ని పట్టుకుని ...ఊ! మాట్లాడ నేం"

"చి త్తంచి త్తం. పూర్వకవులుకూడా అందులో ముఖ్యంగా కవిత్రయంవారుకూడా అలాగే వాడేరని తోస్తుంది"

"వాడరుటండీ. ఏమిటి మీకు చాదస్తమా ఏమిటి. చట్కాబండిమీద యీవాదమంతా పెట్టి ఒకకావ్యం వ్రాస్తున్నాను. విన్నారా"

"చిత్తంచిత్తం"

"మొన్నను ఈఅల్లరి సజ్జుకుర్రవాళ్లనిగురించి ఒకప్రహసనం వ్రాశాను. చిత్తగించారా"

"చిత్తంచిత్తం"

"వాళ్లంతా తల ఎక్కడో పెట్టుకోవాలన్నమాట— ఏదో కవిత్వంటండీ దానిపేరు నాకు రాకుండాఉంది. దానిబొంద— అది టండీ ఈకాలంలో కవిత్వమనిపించుకుంటోందట"

"చిత్తంచిత్తం"

"మీరుగానీ వాళ్లను మీదరిమానాకు రానివ్వకండిసుమీ"

"చిత్తంచిత్తం. ఎంతమాట సెలవిచ్చారు? వీళ్ళమూలాన్ని నాకు రోజుకు నాలుగైదుమార్లు స్నానం తప్పడంలేదు"

"అవును. ఇప్పుడంతా గెల్లిపిల్లోరి పోతున్నారు. ఈవార్ధక్యం లో స్నానాలుచెయ్యలేక నేను ఈమధ్య యిల్లుకదలడమే లేదు"

"చిత్తంచిత్తం. తమరు ఈమధ్య వ్రాయించనదిగ్విజయయాత్ర బహుఆనందంతో చదివాను"

"ఆలాగటండీ. చెప్పాను కాను. శ్రీపతిదిగ్విజయమునుమండీ అది"

"చిత్తంచిత్తం. ఫణితి బహురమ్యంగా ఉందండి"

"ఆc! అదీ. అదీ. అయితే మీరు మారామానుజకూటంలో ప్రవేశించారా లేదా?"

"తమబోటివారి పరిచర్య కొంతకాలం చేసినతరువాత"

"బాగుబాగు. రోజూ వస్తూఉండండి. సద్గ్రంథకాలక్షేపం చేయవచ్చును"

"చిత్తంచిత్తం. చూచారండీ ఈపద్యం ఎవరో పూర్వకవి వ్రాసింహండి. తమబోటివారికి చూపించి దానిస్వారస్యము గ్రహిద్దామని—"

"ఏది చదవండి చదవండి"

"చిత్తంచిత్తం
కంధరముధరముధరమును
కంధరధరధరముధరము:కచకుచకటివా
క్సింధురమాసింధురమా
సింధురమావైభవంబు చెలికిన్ జూడన్"

"ఓహో ఏమిపద్యమండీ ఏమి తెలుగండీ ఏమికవిత్వమండీ ఏమికవిత్వమండీ!"

"మహా దొడ్డకవిత్వమనే నేను—"

"ఓ హో హో! ఎంతపసదనమున్న కవిత్వమండీ. ఏమి శబ్దసౌష్టవము, ఏమి అర్థగాంభీర్యము, ఏమి జటిలత. ఎక్కడ సంపాదించారో గాని మహాదొడ్డ పద్యమండీ. పోనివ్వకండి. పద్యం భద్రంగా దాచండి"

"చిత్తంచిత్తం"

"ఇటువంటికవిత్వం ఉంటూండగా తగుదునమ్మా అని ఈకాలంలో ఈకుర్రకుంకలంతా— ఊఁ! మాటాడరేం"

"చిత్తంచిత్తం"

"ఇష్టంవచ్చినట్లు తగలేస్తున్నారండీ భాషనంతాను"

"ఎన్నివిపరీతాలేనా పుట్టుకున్నాయండి ఈకలికాలంలో"

"సరే. ఈమారు ఈపద్యంసంగతి చూద్దాం. నిఘంటువులు అటకమీద ఉన్నవిలెండి. అవి తీయించినమీదట..."

"చిత్తంచిత్తం"

"మీరు వెళ్ళి స్నానంచెయ్యండి మరిచిపోక! నేనూ స్నానానికి లేస్తున్నాను. చెప్పరానివాళ్లనిగురించి చాలా మాట్లాడుకొన్నాము. స్నానంచేస్తేనే కాని..."

"చిత్రంచిత్రం"
"చిత్రం"

౨

కిష్టప్ప శాస్త్రుల్లుగారి పరిచయలాభం కలిగినతరువాత క్రమ క్రమంగా కూటస్థులపరిచయంకూడా నాకు కలిగింది. కూటములో ముఖ్యముగా చెప్పదగ్గవారు చిట్టెయ్యగారు. అసలు ఈయన ఈకూటాన్ని స్థాపించారని వదంతి. ఈయనకు డబ్బాలుచేయడమూ వాయించడమూ బాగా తెలుసును. ప్రపంచములో మొట్టమొదట డబ్బాకని పెట్టినమహానుభావు డితడే నని చెప్పుకుంటారు. ఇతడు మొదట తన డబ్బాను వాయించినప్పుడు ఆధ్వనియొక్క మనోహరత్వము గ్రహించి మిగిలినవాళ్లందరూ డబ్బాలు వాయించడము నేర్చుకొన్నారు. ఈడబ్బా భాషతోనే మాట్లాడుకోవడంకూడా నేర్చుకుంటున్నారు.

ఇంతేకాకుండా ఈయన ముచ్చిబొమ్మలు చేయగల నేర్పుకల వాడు కూడాను. ఈయనచేసిన బొమ్మలలో ముఖ్యముగా ఎన్నుకో దగ్గది సరస్వతి విగ్రహము. ఆవిగ్రహము చాలా సొగసైనదని పండితులు చెప్పుకుంటారు. చూద్దామంటే ఆవిగ్రహం ఆకారం కనబడదు. ముస్తాబు— దుస్తులు, అలంకారాలు, రంగులు— విస్తారంగా ఉండడంమూలాన అసలువిగ్రహం ఎలువంటిదో ఎవరూ ఇంతవరకు చూచియుండలేదు. ముస్తాబుచూచినవారే అందరూను. ఆవిగ్రహము జీవకళలతో ఉట్టిపడుతూ ఉన్నదని మొదటచెప్పి తరువాత అది నిజముగా సజీవమైనసరస్వతే అని నిర్ణయించినారు వారిశిష్యులు. ఈకూటమునకు చిట్టయ్యే మూలపురుషుడు. కాబట్టి అందరూ ఆయన్ని పూజిస్తూ ఉంటారు.

తరువాత కూటకార్యములు సరిగ్గా నడిపించడానికి శ్రీరాములు మేస్త్రీ ఒకాయ నున్నాడు. శ్రీరాములుమేస్త్రీ చాలా గడుసువాడు. పిల్లిమీద ఎలకనీ ఎలకమీదపిల్లినీ ఎక్కించి సర్కసుచేయించ గల నేర్పుగలవాడు. లాభంలేనివ్యవహారం చేసినవాడుకాడు ఎన్న

మాను: చాలాకాలంనుంచి మేస్త్రీగా తరిఫీతయినమనిషి. డబ్బాలు వాయింపించడములోనూ, ముచ్చిబొమ్మలు చేయించడములోనూ, ముచ్చిబొమ్మలికి మొక్కుబళ్ళు చెల్లింపించడములోనూ, శ్రీరాములు మేస్త్రీకి మించినవెయ్యి లేదు. శ్రీరాములుమేస్త్రీ ఆమధ్య డబ్బావాయించడం నేర్చుకోడానికి ప్రయత్నంచేశాడు కాని అతనికి ఆపని చేతనైనదికాదు. సరస్వతీవిగ్రహాలు చేయించడంకోసమని అతను అక్కడో ఎముకా అక్కడో ఎముకా సంపాదిస్తూ చిట్టెయ్యశిష్యులకు ఇస్తూ ఉంటాడు. వాళ్ళు ఆ ఎముకలను కూర్చి ఒకవిగ్రహంగా ఏర్పాటుచేసి దానిని పూజించుకుంటూ ఉండేటట్లు ఆయన చేస్తూఉంటాడు. శ్రీరాములుమేస్త్రీ పలుకుబడికలవాడు. మాటకారి. ఆశ్రయింపు ఉన్నది. ఏదో ఒకమిషపెట్టి రెండురాళ్ళు సంపాదించుకొంటున్నాడు పాపం పిల్లాజెల్లా ఆట్టే లేక పోయినా! ఆశ్రయించినవాళ్లకి రెండురాళ్లు ఎవరిచేతనైన పుట్టజెప్పిస్తూ ఉంటాడుకూడాను.

ఆయనగాక పురోహితుడైన వెంకటావధాను లొకాయన ఉన్నాడు కూటములో. వెంకటావధానులు చాలా ఆచారవంతుడు. అసలు పుట్టడంలోనే మడిగా పుట్టాడామహానుభావుడు. మడిగా బతుకొంటూ వస్తున్నాడు. మడిగా ముసిలితనం గడుపుతున్నాడు. ప్రపంచములో మడిగట్టుకొన్నవాళ్లు ఎవళ్ళైనా ఉన్నారా అంటే, వెంకటావధానులుగా రున్నారని వేలుమడిచి చెప్పుకోదగ్గమనిషి ఆయన. వెంకటావధానులు చాలా తెలిసినవాడని ఆయన్నిగురించి చాలామంది చెప్పుకొంటారు. నలపాకభీమపాకాలని మించిఉంటుందట ఆయన కవిత్వ మేమటోకాని! పబ్లిగ్గా ఆయన చాలా మడికట్టుకొన్నట్లు అగుపించినా, క్రియకు చాలామార్లు ఆయన మడిగట్టుకోనివాళ్ళు చేసే పనులు చేసినాడని నిదర్శనాలు కలవు. మడిమాట ఒకమూలబెట్టి మాట్లాడితే మొత్తంమీద వెంకటావధానులు చాలా సరసుడని చెప్పుకోవచ్చును.

ఈయనగాక ప్రతిసభలోనూ అగ్రతాంబూలం స్వీకరించే సుబ్బయ్యగారొకాయన ఉన్నాడు. సుబ్బయ్య చిట్టెయ్యశిష్యుడు. చిట్టెయ్య డబ్బానుచూచి ఆపంపిణీమార్చి ఒకమోస్తరు కొత్తడబ్బా చేయించి దాన్ని వాయిస్తూ ఉంటాడీయన. డబ్బాభావతోనే దేవుణ్ణి కొలవాలనీ, అలాగ చేస్తేనే దేవుడు ప్రత్యక్షమౌతాడనీ ఆయన ఆశయము. ఇతరభావాలు దేవుడికి ప్రీతికరములు గావు. సుబ్బయ్య మంచిభక్తుడు. అందుచేతనే అగ్రతాంబూలాలు పుచ్చుకోవడం.

కూటస్థులలో ప్రధానపురుషులలో ఒక్కరైన లక్ష్మీనర్సుగారి సంగతి ఇక చెప్పవలసిఉన్నది. లక్ష్మీనర్సుగారు లెక్కలేనన్ని పూర్వ జన్మాలెత్తినవారు. అన్నిజన్మలలోనూ ఆయన అత్తగారైపుట్టి అధికారం చెలాయించిచెలాయించి ఈజన్మలో లచ్చప్పగారై అవతరించి పూర్వవాసన ఏమాత్రం పోనివ్వకుండా కాపాడుకుంటూ కోడరికం చేస్తూఉంటారు. ఈయన ప్రపంచాన్నంత తనకోడలిగా భావించి, ఆకోడలికి తానే అత్తగారుగా భావించుకొని, ఆకోడలిని ఎప్పుడూ అత్తగారిసాధింపులు సాధిస్తూఉంటారు. చేటలతో చెరిగి దుమ్మెత్తిపోయగల నేర్పు ఈయనకు బాగాకద్దు. ఈయనకు వచ్చినతిట్లకూ శాపనార్థాలకూ మితీమేరా లేదు. ఈయననాలుక నాలుక కాదు— కొరడా! కొత్తసరుకుతెచ్చి దానిమీద పాతసరుకని ముద్రవేసి చెలామణీచేయించడములో ఈయన అందరినిమించినచెయ్యి!

వీరుగాక వీరి ఆశ్రితులు వర్గైరాజనం చాలామంది ఈకూటములో ఉన్నారు. వారందరితోనూ నేను పరిచయం కలగచేసుకొన్నాను. చేసుకొని వారిమందిరముకు వెళ్లడమూ రావడమూ జరుగుతూ ఉండేవాడిని.

3

కూటంవారు సమావేశమయ్యే మందిరములో ఒకచీకటికొట్టు ఉన్నది; ఆకొట్టులో ఉంది సరస్వతిబొమ్మ. ఈబొమ్మను పూజచెయ్యడానికీ కంచుకోత్సవంవంటి ఉత్సవాలు జరపడానికీ కూటస్థులందరూ

మందిరంలో సమావేశ మవుతూఉంటారు. ఎప్పుడు వెళ్ళిచూచినా మందిరంలో ఎవరోకొందరు కూటస్థులు ఏదోఒకపని చేస్తూనే ఉంటారు. కొందరు చిత్రాచార్యశిష్యులను ఆశ్రయించి ముచ్చిబొమ్మలు చెయ్యడం నేర్చుకుంటూ ఉంటారు చీకటికొట్టులో బొమ్మను పూజించడమే కాకుండా వీరు ఎవరివిగ్రహం వారు చేసుకుని ఎవరిడబ్బా వారువాయిస్తూ పూజచేసుకొంటారు. పార్థివలింగపూజచేసేవాళ్ళు ఏరోజులింగం ఆరోజు చేసుకున్నట్లే వీరిలో కొందరు ఏరోజుబొమ్మ ఆరోజు చేసుకొంటూఉంటారుకూడాను.

మరికొందరు ఎప్పుడూ ప్రాయశ్చిత్తం చేయించుకుంటూ మందిరంలో ఉండడం మనము చూడవచ్చును. వర్ణసంకరులతో సహవాసం చేసినందుకూ, వాగ్దోషము వచ్చినందుకూ—అనగా పేజీకి వెయ్యవలసినన్ని అర్ధానుస్వారములు శకటరేఫలు వగైరా వెయ్యనందుకూ—వీరు ప్రాయశ్చిత్తం చేయించుకొంటూ ఉంటారు. అందుకోసమై కూటమువారు రెండుమూడు ఆవులనుకూడా పెంచుతున్నారు. మరికొందరు మేస్త్రీనాశ్రయించి ఎముకలకొరకూ రాళ్ళకొరకూ దేవుళ్లాడుతూ ఉంటారు. మరికొందరు స్నానాలు చేస్తూనో మడిగట్టుకుంటూనో పుండ్రములు ధరించుకొంటూనో ఉంటారు.

ఒకమాటు చీకటి గదిలో బొమ్మను చూడాలని బుద్ధిపుట్టి కిట్టప్పశాస్తుల్లుగారితో ఆసంగతి ప్రశంసించేను.

"ఆఁ! తప్పుతప్పు— విగ్రహంచూస్తే చాలా దోషము. కళ్లు పోతవి. మనపని ఎంతసేపూ పూజచెయ్యడమే కాని లోపలేముంది బయటేముంది అని తర్కం ప్రారంభించకూడదు— ఏమంటావు?

"చిత్తంచిత్తం"

"చెప్పలేదూ భగవద్గీతలలో; ఎంతసేపూ మనధర్మం మనము నిర్వర్తిస్తూ ఉండవలెను ఫలము కోరకూడదు. హేతువాదములు పెట్టుకొనుటవల్ల ఏమీ లాభంలేదు. మాట్లాడవేం. అవునా కాదా"

"చిత్తంచిత్తం"

"మేలిముసుగులో ఏముందో అనీ, చీకటిగదిలో ఏముందో అనీ, మనము కాలము వ్యర్థము చేసుకోకూడదు. అదంతా చిదంబర రహస్యముగా చూచుకోవాలి? అవునా కాదా?"

"చిత్తంచిత్తం"

"విన్నావూ! చట్కాబండికావ్యం సగం అయిందిసుమా..." ఈరీతిగా ఆయనధోరణిలోకి దిగేడు. ఇంక వీళ్లనిఅడిగితే లాభం లేదనుకొని బాల్యచాపలం జయించలేక రహస్య భేదనము చేద్దామని ఊహించేను. ఎవరూ లేకుండా చూచి, ఒకనాడు గదిలో ప్రవేశించి దీపం వెలిగించి చూచాను. ఆకొట్టులో చాలావిగ్రహాలు ఉన్నవి. విగ్రహాలంటే విగ్రహాలు కావు. విగ్రహాకారముతో ఉన్న రంగురంగుల చీరలూ ముచ్చిబంగారూతో చేసిన ఆభరణములూను.

ఆవిగ్రహాలన్నిటికన్నా ఒకపెద్దవిగ్రహం ఒకపీఠంమీద ఉన్నది. అదే చిట్టెయ్య చేసిన విగ్రహం అని తోచింది. దక్షిణాదిచీరలు దిట్టంగా కట్టబెట్టేరు దానికి. పాతసరుకు కరిగించి చేసినకొన్నినగలు కూడా ఉన్నివిదానికి. పైవేషము మాట కేమి? అసలువిగ్రహం ఎంత అందంగా ఉన్నదో చూద్దామని పరీక్షించాను. అసలు విగ్రహం లేదు. పదకొండోశతాబ్దము మొదలుకొని నేటివరకూ దొరికినఎముకలూ చేతఎముకలూ మాత్ర మున్నవి. ముక్కూ చెవులూ ఉన్నవో లేవో దానికి! కళ్ళు అసలే లేవు. ఈవిగ్రహానికి వాహనము శకటరేఫాకారముగా ఉన్నది. కిరీటము సున్నలతోనూ అరసున్నలతోనూ రమ్యముగా చేసినారు.

మిగిలిన విగ్రహాలు అన్నీ దీనిపుత్రికలే. తేడామాత్రం కొంచెమున్నది. సంపాదించిన, లేక స్వయముగాచేసిన ఎముకలలో పాతకొత్తలతేడా ఒకటీ, కిరీటాకారాలలో తేడా ఒకటి. అదిగాక చీరలలో తేడా బాగా కనిపిస్తోంది. కొందరు దక్షిణాదిచీరలు తమవిగ్రహాలకి కట్టేరు. కొందరు ఈకాలపు ఉప్పాడచీరలు చుట్టబెట్టారు. కొందరు నెల్లూరుపుట్టములు కట్టినారు. కొందరు చిత్తూరు ఖద్దరుబట్టలు చుట్టబెట్టారు. కొందరు తూట్లుపడ్డ పూర్వకాలపుబట్టలు కప్పారు!

ఆగదిలోనే పూజాద్రవ్యములుకూడా ఉన్నవి. చేతపువ్వులూ, కాకితాలతో చేసిన పత్రీవగైరా ఏమేమో ఉన్నవి.

చిదంబర రహస్యము తెలిసినది. ప్రపంచములో ఎటువంటివింతలైనా ఉంటవి. ఎంతటిబుద్ధిమంతులైనా ఉంటారు అని నేను ఆశ్చర్యపోయాను. కూటం సంగతిసందర్భములు తెలిసినవిగదా యిక ఆవూరు విడిచి వెళ్ళవలె నని ఊహించినాను. కాని కూటముయొక్క సాంవత్సరికోత్సవము నేడో రేపో జరగపోతున్న దని విని ఆవింతకూడా చూద్దా మని ఆగిపోయాను.

౪

వార్షికోత్సవము సమీపించిం దనగానే కూటస్థులందరూ ఒక్కమారు ప్రాయశ్చిత్తం చేయించుకొన్నారు. పొరుగింటివారికి పాచి చేసుకోవడానికి కాస్త గోమయమైనా దొరకలేదు ఆరోజుల్లో. ప్రాయశ్చిత్తమైపోయినతరువాత కొందరు చిట్టెయ్యనాశ్రయించి కొత్తకొత్తడబ్బాలూ డప్పులూ సంపాదించుకొన్నారు. శ్రీరాములుమేస్త్రి భాజాభజంత్రీలను సిద్ధముచేశాడు. ఆనాటికని కొత్తకొత్తగా సంపాదించిన ఎముకలతో కొత్తకొత్తబొమ్మలు తయారుచేశారు. అనాచారవంతుల నందరినీ నోటికివచ్చినట్లు తిట్టడానికి లక్ష్మీనరసింహని నియమించారు. అందుకోస మని లక్ష్మీనరసు కత్తులూ కటార్లూ సిద్ధముచేస్తున్నాడు. గ్రామ్యులందరికీ చిల్లంగిపెట్టి ప్రయోగము చేస్తానని కిష్టప్పశాస్త్రుల్లుగారు పూనుకొన్నారు అందుకోసమని ఆయన కొంతకాలము వణుకూ చట్రాకావ్యరచన కట్టిపెట్టినాడు. శ్రీరాములుమేస్త్రి అంతా పైహంగు చేస్తున్నాడు. ఈమూలకంగా రెండురాళ్లు కొట్టుకుందా మని బతుకుతెలిసినవాళ్లు శ్రీరాములుమేస్త్రిని ఆశ్రయించారు. కొత్తకొత్తవాళ్లని కూటములో చేర్చుకొనుటకు చాలాప్రయత్నాలు జరిగినవి. కిష్టప్పశాస్త్రుల్లు నన్ను కూటములో చేర మని చాలా బలవంతపెట్టారు. గాని "ఇంకా తమవంటివారి వద్ద శుశ్రూష కొంతకాలము చేస్తేనే గాని అంతపదవికి నేను తగనని సమాధానం చెప్పాను. నేను కూట

ములో చేరితే నాకు కోశాధ్యక్షపదవి ఇప్పిస్తాననీ నాచేత పుస్తకాలు వ్రాయించి టెక్స్టుబుక్కులుగా పెట్టించి లాభము వచ్చేటట్లు చేయిస్తాననీ శ్రీరాములుమేస్త్రీ చాలాచాలా చెప్పాడు. కాని నాకు ప్రాప్తముండవద్దూ!

నాటకస్థులలో ప్రసిద్ధులూ నాటకమువిూద సానుభూతిగల తత్త్వజ్ఞులూ అనాడు వ్యాసములు చదువుటకు వచ్చుకొన్నారు. కొందరీ వ్యాసములు సంస్కృతభాషలోను, కొందరు పద్యరూపకముగాను, కొందరందులో గద్యచిత్రబంధకవిత్వములతోనూ కొందరు శ్లేషయమకాదులతోనూ బహుచక్కగా భారతమంతేసి గ్రంథములు వ్రాసి మేస్త్రికిచ్చారు మేస్త్రీ వాటినన్నింటినీ పరీక్షించి చూచి ఆంధ్రదేశం వాఙ్మయవిషయంలో వెనకంజవెయ్యడం లేదుగదా అని సంతోషించాడు. వ్యాసవిషయము లేమనగా ౧ గ్రాంథికకృతకవాణీకూటప్రాశస్త్యము. ౨ తొమ్మిదవశతాబ్దమున ఎముక లున్నవా? ౩ చిట్టెయ్యజన్మస్థానమునకు సంబంధించిన కంపునదీచరిత్ర ౩ కుసుమలుపండుటకు ఎట్టిఎరువు ఉపయోగించవలెను. ౪ అర్ధచంద్రాకృతి గలఅర్ధానుస్వారధారిణి యగుఆంధ్రభాషాయోష చంద్రముఖికాదా? ౫ ఆంధ్రమందు కృతకభాషాపమును నేల అవలంబింపరాదు? ౬ చచ్చుమొశబ్దసాధుత్వానాధుత్వములు ౭ దోమకు కన్ను లున్నవా? ౮ ప్రపంచభాషలయం దాంధ్రమున కెట్టిస్థానము లభ్యముకాగలదో కిట్టప్పగారి కావ్యములను బట్టి నిర్ణయించుట ఇత్యాది.

ఈవ్యాసములను చదువువారు ప్రౌఢకవిభయంకరులూ కవినామాంకులూ, సాహిత్యాంబుధులూ వగైరా! నాటకమువారే ఉభయఖర్చులు పెట్టుకొని వీరందరినీ పిలిపించారు.

వస్తుంది వస్తుంది అనుకొన్న వార్షికదినము వచ్చింది. తద్దినమున ఎల్లవారిని వారందరికీ పిండివంటలతో భోజనాలు పెట్టినారు. ఆంధ్రదేశములో భాషాభిమానులైన సంపన్నులకు లోటులేదు గదా, ఇంక సంతర్పణాలకు లోటు వస్తుందా! రోజుకు రెండుమూడుమార్లు

ఫలహారాలు వగైరా లాంఛనాలన్నీ జరిగినవి. ఈభోజనవుత్తొందరలో వ్యాసములసంగతంతా మరిచిపోయారు. అందరికీ భోజనాలు బలహారము చెయ్యడంవల్ల అందుకోసమని అక్కడ ఏర్పాటుకాబడ్డ అవసర ఆంధ్రభిషగ్వైద్యశాలకు కావలసినంతపని తగిలింది

చదవకపోతే ఏమిలెండి తరవాత అచ్చువేసుకోవచ్చును గదా అన్నాడు శ్రీరాములు మేస్త్రీ.

ఏది జరిగినా, ఏది జరగకపోయినా, సరస్వతీపూజమాత్రం ఆనాడు చాలా బాగా జరిగింది. ఎవరివిగ్రహాన్ని వారు పూజించుకొన్నతరవాత, అందరూ కలిసి నృత్యంచేస్తూ చిట్టెయ్యవిగ్రహాన్ని పూజించారు. కిష్టప్పశాస్తుర్లు మంత్రాలు చదువుతున్నాడు. వెంకటావధానులు పౌరోహిత్యం వహించాడు. సుబ్బయ్య అగ్రతాంబూలం కోసం తంటాలుపడుతున్నాడు. లక్ష్మీనరుసు బూతులు తిడుతున్నాడు.

"వాయించవోయి మేస్త్రి డబ్బాలు వాయించు" "ఏయి, బాజాభజంత్రీలు వాయించండి బాగా వాయించండి" "కట్నాలు పుచ్చుకోండి, తెండి ఇలాతెండి" "వెయ్యండి అడుగు బాగా వెయ్యండి" ఇత్యాది కోలాహలముతో సరస్వతీపూజ బహుచక్కగా జరిగింది. ఆగందరగోళములో కూటస్థులందరికీ ఒళ్లు గరిపొడిచింది కొందరికి ఒళ్లు తెలియలేదు. కొందరు ఆవేశంవల్ల మూర్ఛపోయారు.

చివర అందరూ సరస్వతీమంత్రమును చదివారు. ఎవరిమట్టుకు వారు మంత్రమును చదువుకొనే సాంప్రదాయం లేదక్కడ. కూటస్థులందరూ కలిసి గ్రాంథికవాణీస్తోత్రమహామంత్రము పారాయణ చేశారు. ఆమంత్రము నేను విని జ్ఞాపకం ఉంచుకొన్నంతవరకు ఈక్రింద ఇస్తున్నాను.

"గ్రాంథికవాణీస్తోత్రమహామంత్రము."

అస్య శ్రీగ్రాంథికవాణీస్తోత్రమహామంత్రస్య
చిన్నయసూరీ ఋషిః
అప్పకవీయం ఛందః

గ్రాంధికకృతకవాణీ దేవతా
కవిరాక్షసీయం బీజం
సంస్కృతపండితవాదః శక్తిః
ధనార్జనం కీలకం
మమ గ్రాంధికవాణీసేవనద్వారా
మహారాజప్రసాదసిద్ధ్యర్థే జపే వినియోగః.
నచ్చుముచోచ్చుమురూపిణీం
అంగుష్ఠాభ్యాం నమః
మీరుచేసిరిమయీం
తర్జనీభ్యాం నమః
పూర్ణార్థబిందుస్వరూపిణీం
మధ్యమాభ్యాం నమః
కూతురునకుబొంగాయినకుపోషిణీం
అనామికాభ్యాం నమః
శకటరేఫసమాశ్రయాం
కనిష్ఠికాభ్యాం నమః
నావుడనవుడుపదశరణ్యాం
కరతలకరపృష్ఠాభ్యాం సమః
ఏవం హృదయాదిన్యాసః
కవిత్రయనామ్నా గ్రామ్యవాదినాం వాగ్బంధః

ధ్యానం—గ్రాంధవాణీం కీర్తిదాత్రీం
శబ్దాలంకారశోభితామ్
వ్యావహారికశబ్దానాం
ఖండనీమ్ పండితావనీమ్.

తరవాత మంత్రం చెప్పారు. అంగన్యాసకరన్యాసములలో ఇమిడిఉన్న బీజాక్షరాలే కాబట్టి వేరేమంత్రం వ్రాయలేదు. అందరూ ఈమంత్రం నూరు మార్లు జపించారు. తరవాత ఫలశ్రుతి.

గ్రంథవాణ్యా ఇదం స్తోత్రం
యః పఠే ద్రాజసన్నిధౌ,

సిద్ధ్యంతి సర్వకార్యాణి
పండితైః కథ్యతే ధ్రువం.

ఇదయింతరవాత అందరూ సొమ్మసిల్లి పడిపోయారు.

*   *   *

అప్పుడు జరిగింది ఒక గొప్పవింత.

అందరూ సొమ్మసిల్లి పడిపోయినతరువాత మందిరమంతా చాలా నిశ్శబ్దముగా ఉన్నది. అప్పుడు వీరున్న తావుకు ఒక దివ్యసుందరవిగ్రహము వచ్చింది. ఆవిడను వర్ణించడం నాబోటివాడికి వశంకాదు. ఆచూపులు, ఆనడకలు ఆనవ్వులు ఆఒయ్యారము—భయమూ, భక్తి,వాత్సల్యమూ,అనురాగమూ కలిగిస్తున్నవి. ఆవిడ అందరిహృదయాలనూ ఆకర్షించగల శక్తిఉన్న దివ్యస్త్రీ. అందరూ ఆవిడను చూచి తమహృదయాల నావిడకు అప్పజెప్పారు. అందరిహృదయాలకూ శాంతి కలిగింది. ఉత్సాహం కలిగింది. ఆనందం కలిగింది, సృష్టికర్తా సృష్టీ ఆవిడే!

ఆమె ధరించినవి పువ్వులూ చిగుళ్లూ.
ఆవిడ స్నేహితులు పిల్లలు.
ఆమెపలుకుచున్నవి చిలకపలుకులు.
ఆవిడకంఠము కోకిల.
ఆవిడకన్నులు తేటనీటిబుగ్గలు.
ఆవిడపై టవిసురు మందమారుతము.
ఆవిడకిరీటము ఆకాశము.
కిరీటములో మణులు చుక్కలు.
ఆవిడ సరస్వతి.

సొమ్మసిల్లిపోయినజనమంతా లేచి నిలుచున్నారు. "ఎవరు నువ్వు? కూటస్థుల రహస్యమందిరములోకి ఎందుకు వచ్చావు" అని ఆవిడను వారంతా గద్దించారు.

ఆవిడ నవ్వింది. ఆవిడ కళ్లు జవాబుచెప్పినవి "నేను సరస్వతిని" అని. వాళ్లంతా ఒకమారు ఆవిడకేసి చూచారు. ఒకమారు

చిట్టెయ్యవిగ్రహంకేసి చూచారు. అన్నారు అందరూను "ఆఁ! ఆఁ! ఏమిటి! ఏమిటి! నీవు సరస్వతివైతే ఈవిగ్రహం ఏమి కావలసినది. కలికాలంలో ఎంతటివాళ్ళైనా ఉంటారు." శ్రీరాములుమేస్త్రీ కిష్టప్పశాస్తుల్లుకేసి చూచాడు. కిష్టప్పశాస్తుల్లు లక్ష్మీనరుస్సుని పరామర్శ చేశాడు. లక్ష్మీనరుస్సు శ్రీరాములుమేస్త్రీకి సైగచేశాడు. శ్రీరాములు మేస్త్రీ అన్నాడు "చూస్తారేమి? ఇంకా!"

అందరూకలిసి డబ్బాలు వాయించేరు. కొందరు కఱ్ఱలు తీసుకువచ్చారు. ఆవిడను జడిపించారు.

ఆవిడ అదృశ్యమైనది. నాటినుండి నేటివరకూ లక్ష్మీనరుస్సు కిష్టప్పశాస్తుల్లూ ఆవిడను అష్టమైన బూతులు తిట్టుతూనే ఉన్నారు.

కాని ఆవిడ ఆఊళ్లో పిల్లలతో ఎప్పుడూ ఆడుకుంటూ ఉంటుందనీ వాళ్లకి కావలసిన ఆటవస్తువులు ఇస్తూఉంటుందనీ వినికిడి.

ప.రా.—నేనువ్రాసిన గ్రాంధికకృతిక వాణీస్తోత్రమహామంత్రము నేనుకల్పించినదనీ, అటువంటి మంత్రము కుటస్థులు చదవడము అసంభవ మనీ కిష్టప్పశాస్తుల్లు నాపై ఒకకావ్యం వ్రాస్తున్నారని తెలిసింది. నేను ఈమంత్రమును ప్రకటించబోతున్నానని ఆయనికి ఎవరో చెప్పారట.

నాకూ కిష్టప్పశాస్తుల్లుగారికీ ఈమధ్య అభిప్రాయభేదం కలిగిందిలెండి. కిష్టప్పశాస్తుల్లుగారితో అభిప్రాయభేదం అంటే ప్రబలశత్రుత్వ మన్నమాట!

చింతా దీక్షితులు.

* నిఘంటురచనా పరామర్శము.

[పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, మదరాసు.]

సంస్కృతనిఘంటువులు.

౧.

ప్రపంచమునందలి ఆయా దేశజాతికులాచారవ్యవహారాదుల ఆనుపూర్విని శాశ్వతముగా తరతరములవారికి ఉన్నదాని నున్నట్లుగా ప్రదర్శించుటకు శబ్దజ్యోతిని విచ్చలవిడిగా ప్రకాశింపజేయునట్టి కవులయొక్క గ్రంథములును రచనములును ఎట్లు అమూల్యములగు సాధనములో, అట్లే ఆయాదేశములయందలి కవిజనులయొక్కయును గ్రంథకర్తలయొక్కయును వాఙ్మయప్రపంచముయొక్క స్వరూపస్వభావాదులను కలయూపునట్లు ప్రదర్శించుటకును గూడ వ్యాకరణములు ఉపమాదులు నిఘంటువులు ఆప్రజనులయొక్క పరంపరాగతములగు వాక్యప్రయోగసరణులు వ్యవహారసందర్భములు మున్నగునవి యన్నియును, అమూల్యములును అసాధారణములును నగుసాధనములనుట పెద్దలెల్లరును నిర్వివాదముగా నంగీకరించిన విషయమే. అనగా నాయాదేశములందలి కవులును గ్రంథకర్తలు ఆదినుండి నేటివఱకు తమతమ రచనలలో వాడుకజేయుచు వచ్చిన నాయాక్రియములయొక్క స్వరూపస్వభావములను అందలిక్రమపరిణామమును కనిపెట్టవలయునన్నచో నందులకు ఆయావాఙ్మయములందు అప్పుడప్పుడు నిర్మింపబడుచు వచ్చినట్టి వ్యాకరణగ్రంథములను ఉపమానాది (సాదృశ్యబోధకములను) పరికరములను, నిఘంటువులను పరంపరాగతములగు ఆప్రజవాక్యములను లోకసంవ్యవహారాదులను పరీక్షించినచో యథామతసిద్ధి కాగలదని తాత్పర్యము కనుక నే— సంస్కృ

*ఈపేరుతో నేను చిరకాలముక్రిందట నొకచిన్నగ్రంథమును వ్రాసియుంచితిని. అందు అప్పుడు ఆంధ్రవాఙ్మయమునం దింతవఱకును గలనిఘంటువులనుగూర్చిమాత్రమే చర్చింపఁబడెను, రానురాను ఆంధ్రవాఙ్మయమునకు మూలభూతములగు సంస్కృతప్రాకృతవాఙ్మయములలోని నిఘంటువులను గూర్చికూడ చర్చింపనిచో, అయ్యది అసమగ్రమగునను తలంపు కలుగుటచేత, ఇప్పుడు దానిని మఱల సరిచేసి ఇందు ప్రకటింపఁబూనితిని. ఈవ్యాసములకు ఆధారములు అయినవానిని ఆయాసందర్భములలోనే వెల్లడించియుంటిని. కాన నాయా రచయితలకు ఇచ్చట కృతజ్ఞతాభివందనములను సమర్పించెదను. చదువరులు శ్రమయనుకొనక యొకమారు సాంతముగాఁ జిత్తగింపఁ బ్రార్థితులు.

[పం-ఆ-శా.]

తవాఙ్మయమునందు ఫలానిశబ్దము ఏయర్థమునందు వాడఁబడుచున్నది? దానిని ఆయర్థమునందే యెందులకై వాడవలయును? అట్లు వాడవలయు ననుటకు ఏమి ఆధారము!" అను మొదలయిన జిజ్ఞాసకలిగినచో సద్దానిని (అనఁగా నీశబ్దమున కీయర్థము ఇట్టివాడుక ఈవిధమైన స్వభావమును వెల్లడించుశక్తి గలదు—అనుమున్నగురీతిని శక్తిగ్రహణము చేయుటను) వ్యాకరణోపమానకోశాప్తవాక్యవ్యవహారములను బట్టియే నిర్ణయించుకొనఁ దగును— [శక్తిగ్రహం వ్యాకరణోపమాన కోశాప్తవాక్యవ్యవహారతశ్చ] అని పెద్దలు తీర్పుచెప్పియున్నారు. ఇత్యాది ఏవాడు వ్యవస్థచేయఁబడినదోగాని అనాదినుండి నేటిదనుక యట్లే చెల్లుచువచ్చుచున్నది. ఎవ్వఁడైనను ఒకవేళ నేటికాలమున ప్రజ్ఞానిధులై పరంపరాగతమగు వాడుక నవ్వలద్రోసి, క్రొత్తవాడుక చేయుదమన్నను సాగునది కాదు. అశ్వమును బోధించు 'గుఱ్ఱ' మనుమాటను పరంపరగా వచ్చుచున్నవాడుకనుండి తప్పించి, నేము 'గోడ' అనునర్థమునకు వాడుక జేయింపఁగల్గుట యెవ్వరికిని సాధ్యము కాదు గదా! కాబట్టి ఎంతటి శేముషీధురీణు లయ్యును అనాదియగు వాడుకనుండి యొకశబ్దమును తప్పింప లేరనుట నిక్కము.

సాధారణముగా వ్యాకరణము లనినను నిఘంటువు లనినను మనలో జాలమందికి అయ్యవి భాషాభివృద్ధికి ప్రతిబంధములను కల్పించునట్టి సామగ్రియనెడి దురభిప్రాయము పొడముచుండుట కలదు. ఇయ్యది లోతుపాతులను విచారింపకయే గతానుగతికన్యాయమున గల్గుచుండెడి యపోహ మాత్రమే కాని నిజము కాదు. ఏమనగా ఏవ్యాకరణమైనను గాని, లేదా ఏనిఘంటువైనను గాని, చారిత్రికవాఙ్మయమువలె అంతదనుక జరుగుచువచ్చినమార్పులను కూర్పులను పరిణామక్రమమును బోధించవలసినట్టిదే గాని, ఇక ముమ్ముందు సంతతిలో రాఁగల శబ్దప్రపంచమునంతను బంధించి, వానికి ముమ్మొదుగా ఎన్నఁడోపుట్టఁబోవువానికి పేరుపెట్టినట్టులూ, జాతకమును వ్రాసినట్టులూ) అర్థమును నిర్ణయించి వీనిని ఈయర్థములందే ఈరూపమునసే వాడవలయు నని శాసించునట్టిశాసనములు (లా) ఎంతమాత్రమును కావనుట నిశ్చయము. ఈయభిప్రాయమును సూచించుచునే మనపూర్వీకులు వానికి వ్యాకరణము లనియును, కోశము లనియును నిఘంటువులనియును సార్థకములగు పేరులను నిర్ణయించియున్నారు. వ్యాకరణ మన్నమాటకు (వ్యాక్రియతేఽనేనేతి వ్యాకరణం) అంతదనుకగల శబ్దములకుగల స్వరూపస్వభావాదులను, ఆనుపూర్విగా వాడుకజేయుచువచ్చిన క్రమపరిణామములను దెల్పుగ్రంథమని మనవారు వ్యుత్పత్తిని నిర్ణయించియున్నారు. మహాభాష్యమునందు కూడ అథశబ్దానుశాసనం — అని యనుటలోనే 'కేషాం శబ్దానాం' అనునిత్యాదిప్రశ్నలను కల్పించి, చివరకు (అంతదనుక) సిద్ధములయినట్టి సమస్తశబ్దములకును [లౌకిక వైదికశబ్దములకును అన్నింటికిని] అనుశాసనము చేయుటయేకాని ముందు రాఁగలశబ్దములకై ఈయనుశాసన మెంతమాత్రము కాదనిచెప్పియున్నారు. ఇట్లే నిఘంటువులు కూడ అనాదినుండి (తమనాటివఱకు) వచ్చియున్నశబ్దశక్తులసంప్రదాయమును నిర్ణయించుటయందే చరితార్థములగుచున్న వే

కాని ఎన్నడో భవిష్యత్కాలపు వాడుకలనుగూడ నేడే బంధించి ముద్రవైచుట కెంత మాత్రము శక్తికలవి కాఁజాలవు. వ్యాకరణకర్తలేమి నిఘంటురచయితలేమి తమతమ యుద్దిష్టములగు భాషలకు ప్రచారము హెచ్చుకొలందిని, ఆభాషలను తాముజనులు తమతమవ్యవహారములకై విరివిగా శబ్దార్థములనుపేర్చి కూర్చి వ్యవహరించుకొలఁదిని, ఆయావ్యవహారములం దాను పూర్విగా వారు వాడుకకు తెచ్చుకొనుచున్న వాడుకలు హెచ్చుకొలఁదని వానినన్నింటిని శిథిలములై పోనీయకుండ ఎప్పటివానినప్పుడు గ్రంథస్థము జేసి ముమ్ముందు రాగలసంతతివారికై చరిత్రలను సేకరించి యిచ్చెడిమహనీయుల వలెనే, నిఘంటురూపమున వీరును శబ్దార్థముల వాడుకలను అనశ్వరములుగా జేసి, సారస్వతసౌధములకు పునాదులు వేయుచువచ్చుచున్నా రనియును, నిఘంటువులు పెఱుగుకొలఁది ఆభాషకూడ విస్తరించుచున్నదనియును (అనగా దినదినప్రవర్ధమానమై క్రొత్తక్రొత్తశబ్దార్థములను వాడుకకై అన్వేషించుచున్నదనియును) మనము అర్థము చేసికొనవలయునే గాని, భాషయొక్క వపకమునకు ముప్పు గల్గించుచున్నా రని మనము తలంపరాదు. కాఁబట్టియే దినదినమును పరివర్తనమునకు (మార్పునకు) గుఱియగుచున్న - దేశజాతికుల సంఘాద్యాచారవ్యవహారాదులయొక్క భూతకాలికచరిత్రను తెల్పుటచేత భవిష్యత్కాలికులగు ప్రజలజీవితమును సుస్థితికిని సమున్నతమగు సుత్సాహమునకును గతియగునట్లు చేయుందలంచెడి చరిత్రకారులవలెనే, అనాదినుండి వచ్చుచున్న భాషావేత్తలగు గ్రంథకర్తలయొక్క రచనములకుసంబంధించినశబ్దార్థముల స్వరూపస్వభావాదులను వాడుకలను మనకు గోచరింపజేయుచు భవిష్యత్కాలికులగు గ్రంథకర్తల రచనలకు సుస్థితిని ఔన్నత్యమును గల్గించునవేయగుటంజేసి ప్రాచీనములగు నిఘంటువులును వ్యాకరణాదులును మనకు అవశ్యము ఆదరణీయము లగునే కావి అన్యథా కాఁజాలవు. ఇంతదనుకొ చేసినచర్చవలన నిఘంటువులుమొదలగునవి భాషాసాంప్రదాయవేత్తలగు వారి కవశ్యము పఠింపఁదగినవనియును, పర్యాయపదబాహుళ్యత మున్నగునవి దోషములని చెప్పెడివారిమాటలు నిఘంటువులకు అవనతిని గల్గించుటకు మారుగా [వివిధ ప్రదేశములందలి వివిధ తరగతులవారి వాడుకలను తెల్పుపరికరము లయినందున] గుణోత్కర్షమునే వెల్లడించుననియు చెప్పినట్లైనది. ఇక ప్రస్తుతమునకు పోదము; కావున దీని నొకింత నిల్పుచున్నాను.

ప్రకృతము ఈవ్యాసమునకు ఆంధ్రవాఙ్మయమునందు గలనిఘంటువుల గూర్చిన చర్చమాత్రమే ఆదర్శముగా గ్రహింపబడియున్నను, ఆంధ్రవాఙ్మయము ఇంతదనుక తెలుచు సంస్కృతవాఙ్మయముల నీడలలోనే చాలమట్టునకు పెఱుగుచు వచ్చుచున్నది కావున ప్రకృతవాఙ్మయమునకు మూలభూతము లగుసంస్కృతప్రాకృతవాఙ్మయములలోగల నిఘంటువులయొక్క రచనను గురించికూడ మనము ఒకింత పరామర్శింపవలసియే యున్నది. అట్లుచేయునియెడల పునాదిలేని మేడవలె చేసినపరిశ్రమము నిర్మూలమై

కూలవలసివచ్చును కదా! కనుక మన మిటుపైని మున్ముందు సంస్కృతవాఙ్మయము నందుగల నిఘంటువులయొక్క రచనాదికములను గుఱించి పరామర్శించుకొందము

సంస్కృతవాఙ్మయము—ఎన్నెన్నియో యుగములనుండి అనేకరీతులపాటు గాని వేళ్ళువారి సుస్థిరమై శాఖోపశాఖలతో ననంతముఖముల విశ్వవ్యాప్తినిగాంచిన బ్రహ్మమువలె, అద్వైతముల స్వైరపరాయణంబటి వైశాల్యము గాంచినది దానికి— సమస్తములగు వేదములు వేదాంగములు శాస్త్రములు పురాణములు ఉపపురాణములు ధర్మశాస్త్రములు అర్థశాస్త్రములు కామశాస్త్రములు వార్తాశాస్త్రములు ఆఖ్యాయికాప్రబంధములు ఛందోవిచితులు కల్పసూత్రములు శ్రౌతసూత్రములు గృహ్యసూత్రములు ఉపవేదములు స్మృతులు నిబంధగ్రంథములు-ఇవి యవి యననేల? సమస్తవిశ్వమును లక్ష్యము నొందియే యున్నది. కాని ఎన్నో వేలయుగములనుండి ప్రచారపథమున నుండుచు అనంతములగుశాఖోపశాఖలుగా విస్తరించినట్టి సంస్కృతవాఙ్మయమునందే నేటిదినమున మనము ఎన్ని నిఘంటువులు కలవో విచారింపబూనుకొన్నచో, పేరునకు నూరునూటయేబదినిఘంటువులకంటె నెక్కుడుగ కనుగొనజాలకయుందుము. అందునను గూడ, నేటికాలమునకు నామావశిష్టములై పోయినవి పోగా, దేవాలయములు గ్రంథభాండాగారములు మున్నగు ప్రాచీనసంస్థలందు ఎంతో ప్రయత్నపూర్వకముగా రక్షించుకొనుచురాగల్గినట్టినిఘంటువులు అన్నిటిని కలిపినను గూడ, ముప్పది నలువది నిఘంటువులకంటెను మించి యధికముగ మనము కనుగొనజాలము. వానిలో గూడ ప్రకృతము ముద్రణసౌకర్యములు విశేషించి లభించినట్టి పుణ్యపరిపాలన మనుకొనెడి యీబ్రిటీషుపాలనమునందు ముద్రణదశను పొందినవి దాదాపు ఇరువదినిఘంటువులకంటెను మించి కన్పట్టకున్నవి. కాని ఇంగ్లండు మున్నగు విదేశములలోని స్థితిమాత్ర మిట్లు కాదంట. అచ్చటగల నిఘంటువులయాధిక్యమును గుఱించి పండిత రామావతారశర్మ పాండేయ యను మైథిలీపండితులు (వీరు కలకత్తాలోని రాజకీయసంస్కృతకళాశాలలో నుపాధ్యాయులుగా నున్నారు.) ఇట్లు వ్రాయుచున్నారు.

“సంస్కృతవాఙ్మయము చాలవిస్తారమైనది. ఈభాషయందుగల ముద్రితగ్రంథములయొక్క సూచీపత్రములు (కేటలాగ్సు) అనేకము ఉన్నవి. వానిలో కొన్నికొన్ని 500 పేజీలు గలకేటలాగులు కొన్నియున్నవి. లండను బ్రిటీషు మ్యూజియమునకుచెందినఇండియాఆఫీసునందుగల సంస్కృతగ్రంథముల సూచీపత్రము చాలపెద్దది. భరతవర్షము యూరపులోగల కొన్నిగ్రంథాలయముల యొక్క ముద్రితసూచీపత్రములు వేలకొలది పుటలుగలవిగా నుండును. ఇవి గాక తక్కినపబ్లికులైబ్రరీలయొక్క, ప్రభుత్వపు గ్రన్థాలయములయొక్క, కాశ్మీరము నేపాళము రాజపుటానా మున్నగుసంస్థానములలోని గ్రంథాలయములకు, సంబంధించిన పుస్తకముల తాలూకు ముద్రితములగు రిపోర్టులును అనేకము గలవు. ప్రాచ్యవిద్యలను (ఓరియంటల్ కల్చరును) ప్రేమించువారు వీనిని

ఒక్కటొక్కటైనను చదువవలసియుండును. ఏమనగా ఇదియొక సవిశేషమగు విషయము. ఇట్టిదానినే శుష్కజ్ఞాన మందురు. ఇట్లు ఇంతటి వైశాల్యమును పొందియున్న సంస్కృతసాహిత్యములోని ఒక అంగముమాత్రమే నిఘంటువులు. పురుషోత్తమదేవుడు (ప్రాచీనసంస్కృతకవి) రచించిన త్రికాండశేషము—అను సంస్కృతనిఘంటువునకు సింహళభాషలో నొకవ్యాఖ్యానము గలదు. దానియందు దాదాపురెండువందలకుపైగా సంస్కృతనిఘంటువులరచించిన గ్రంథకర్తలయొక్క పేర్లు ఉల్లేఖింపబడినవి. చెట్టులేనిచోట ఆముదపుచెట్టు మహావృక్షమన్నట్టుల మనకు ఈపేర్లను చూచినంతనే తబ్బిబ్బైపోవుట గలదు. కాని, యూరపునందలి పెద్దపెద్దక్యాటలాగ్సును మనముచూచితిమేని దాదాపుఒకవేయికి తక్కువగాకుండ నిఘంటుగ్రంథకర్తలపేర్లను మనముకనుగొనవచ్చును. కాని, ప్రస్తుతము ప్రచారములోనున్న సంస్కృతవాఙ్మయములోగల నిఘంటువులనన్నింటిని చిన్నవిపెద్దవికలిపికొన్నను నూటికిమించి మననిఘంటువులు ఉండజాలవు. అందునునుకూడ భాష నభ్యసించువారికి ఉపయోగపడదగినవిగాను, విశేషించి అధికమగు విజ్ఞానమును ఈయగలవిగాను, ఉన్నట్టివి ముప్పదికంటె నెక్కుడుగ నిఘంటువులు సంస్కృతమునందు లేవు.”

పండిత రామావతారశర్మ పాండేయగారు వ్రాసినయీమాటలలో, కొంతవఱకును సత్యము లేకపోలేదు. ప్రస్తుతము ఒక్కనిఘంటువిషయములో మాత్రమేగాక, తక్కినసారస్వతవిషయము లన్నింటిలోగూడను మనకంటెను పాశ్చాత్త్యదేశీయులు నేడు ఎరితరియా ముందంజ వేసియున్నారు. ఎంత మహోత్తమమగు అభివృద్ధిగాగన్పట్టినను వారిలక్ష్యము ప్రతిదానియందును సంఖ్యాబలమును ప్రదర్శించికొనుటతో సరిపోవుచుండును. మనకన్ననో అట్లుగాక, అనాదినుండి నేటివఱకుగూడ — నిక్కమైన మంచినీల మొక్కటిచాలు, తళుకుబెళుకురాలు తట్టెడేల?— అని వేమన్న చెప్పినట్లే సారవద్వస్తుపరిగణనముపై ఆధారపడుట తటస్థించుచున్నది. మనకున్న పరిస్థితులను పట్టియును సంప్రదాయమును బట్టియును ఇట్టిపరికరములే (అనగానిస్సారమగు సంఖ్యాబలముకంటె సారతమములగు అల్పపరిమాణకోశములే) చాలియున్నవి. ఇట్లనుటచేత అభివృద్ధి వలదని యర్థము కాదు. సార్వపథీనమును ప్రకృత్యనుగుణము నగునభివృద్ధి వాంఛనీయమనియే భావము.

ఇఁక ప్రస్తుతమున మనభరతఖండమునందలి గ్రంథాలయములందు ముద్రితములైకాని, లేక ముద్రితములు కాకగాని, యున్నసంస్కృతనిఘంటువులలో, ప్రకృతము లభించునట్టినిఘంటువులు ఇరువదికంటెను లేవని పైఁదెల్పియున్నాము కదా! ఆయిరువదివిధములగు నిఘంటువులలో గూడను బొత్తుగా నప్రసిద్ధిని గడించినవియును, అసంపూర్ణములగు శరీరములతో నామరూపాదు లేర్పడనివి— మున్నగువానినిత్రోసివేసి, నిక్కచ్చిగా లెక్కను తాలిసవెన్నిగలవో చూడఁబోయిన మనము భగ్నాశులము కాకతప్పదు.

అయినను 'చల్లకు వచ్చి ముంత దాచుకొన్నట్లు' గాక, చెప్పదలచినదేదియో చెప్పక తప్పదు; గనుక పైని చేర్కొన్న నిఘంటువులలో నుండి ఈకాలమున మనకు లభించెడి సంస్కృతనిఘంటువులయొక్క పట్టికను ఈక్రింద నిచ్చుచున్నాను.

౧ వైదికనిఘంటువు. అనగా వేదమునందుపఠింపబడిన సంస్కృతశబ్దములను వాక్యరూపమున (అనగా గద్యగ్రంథముగా) నీగ్రంథము వివరించుచుండును. దీనిని రచించిన దెవ్వరో తెలియదు గాని, శిష్టసంప్రదాయమునందు దీనికి నిరుక్త మని పేరు గలదు. వ్రాతప్రతులలో సమామ్నాయము అనియుండుటచేత కాబోలును దీనికి ముద్రాపకులు సమామ్నాయము అనియే పేరునువాడినారు. ఈసమామ్నాయమను వైదికనిఘంటువుపై యాస్కాచార్యులు ఒక వ్యాఖ్యానమును వ్రాసియున్నారు. యాస్కాచార్యులు వైదికవాఙ్మయమున ప్రశస్తిని గాంచియున్నవాడు. ఈయనవ్యాఖ్యానమునకు నిరుక్త మనిపేరు. బహుశః ఈనిరుక్తమనువ్యాఖ్యానమును బట్టియే కాబోలు అసలు మూలగ్రంథమగు సమామ్నాయమునకుసైతము నిరుక్త మని వాడుక గల్గినది. ఇయ్యది బెంగాలులోని ఏషియాటిక్ సొసైటీవారు యాస్కాచార్యులయొక్క నిరుక్తమనెడివ్యాఖ్యతోను, దేవరాజకృతమగు మఱొకటీకతోను ముద్రించియున్నారు. కాని ప్రకృతము క్రయమునకు లభింపదు.

సాధారణముగా నిఘంటువులు గాని, లేదా వ్యాకరణాదులుగాని, తొలుదొల్త త్వరగా నుపస్థితికి దెచ్చుకొనుటకై (అనగా వల్లించి, ఎప్పుడువలయునన్న నప్పుడు ఉదాహరించుటకై అనుకూలపడులాగున) చిన్నచిన్న అనుష్టుప్శ్లోకరూపముననో, లేదా ఇంకను మిక్కిలి ప్రాచీనసంప్రదాయము ననుసరించి చిన్నచిన్నసూత్రరూపములుగానో, రచించుట మనభారతీయులకు వాడుకయై యున్నది. అట్లయినను సంస్కృతవాఙ్మయమునందు గల నిఘంటువులలో నెల్ల (అనగా ప్రకృతము లభించెడివానిలో నెల్ల] ప్రధానమును ప్రాచీనమునగు నీవైదికనిఘంటువు అట్లు (అనుష్టుభాదివృత్తములలో గాని యిటు సూత్రరూపముననుగాని వ్రాయబడక) కేవలము గద్యరూపమున నుండుట కేమి హేతువో నిశ్చయింప వీలులేక యున్నది. గద్యగానున్నను సూత్రములుగా పరిగణించుట కూడదా?— యని యనుకొన్నను, తక్కినసూత్రవాఙ్మయప్రపోషకదకంటెను దీనియందు విలక్షణమైనసరళి గనిపించుచు చదువరులకు శంకకొంకింత తావు నొసంగుచున్నది.

మఱియు నీవైదికనిఘంటువునందు ప్రాయశః అన్నివేదములలోనున్న పదజాలమును సమానముగా స్వీకరించి అర్థనిర్వచనము చేయవలసి యున్నను, వేదమునందలి సంహితాభాగములలోని శబ్దములకంటెను మిక్కిలిగా [అనగా ఎక్కుడుభాగము ఋగ్వేదములలోని శబ్దములకే యర్థమును నిర్వచించుటయందు విశేషభాగము] పర్యవసన్నమగుచున్నది. అందుచేతను ఋగ్వేదమున ప్రశంసింపబడుచుండెడి దేవతావాచకములు మున్నగుశబ్దబృందమును ప్రత్యేకముగా నిది వివరించుచున్నది.

నిరుక్తమని సాధారణముగా వ్యవహరింపబడుచుండెడి ఈసమామ్నాయ వైదికనిఘంటువునకు రచయిత (కర్త) ఎవ్వరైనదియును తెలిసికొనుటకు ఏవిధమైన యుక్తి కాశమును లేకున్నది. ఇందులకు ముఖ్యకారణము ఒకటి కల దని కొందరుచెప్పెదరు. ఏమనఁగా— నిరుక్తమనునది—శ్లో. శిక్షా వ్యాకరణం ఛందో నిరుక్తం జ్యోతిషం తథా, కల్పశ్చేతి షడంగాని వేదస్యాహు ర్మనీషిణః—అన్న *నిగదవచనమునందు చెప్పఁబడిన వేదాంగములగు నారింటిలోఁ జేరిన దనియును, వేదములవలెనే వేదాంగము కూడను పరమేశ్వర వినిశ్శ్వసితము అయినందున నపౌరుషేయము లగుటంజేసి దీనికి లౌకికగ్రంథములకువలె కర్తగా నెవ్వడును నిర్దేశింపబడలే దనియును అందురు; కాని మఱి కొందఱు, వేదాంగములందు పేర్కొనబడిననిరుక్తము మఱొకటి వేఱుగా గలదనియును, యాస్కాచార్యుఁడే స్వయముగా తనగ్రంథమందు అద్దానిని పేర్కొనియున్నాఁడనియు నందురు.

ఇకను ఈవైదికనిఘంటువునకు నిరుక్తమను వ్యాఖ్యానమును వ్రాసిన యాస్కాచార్యుని కాలమును నిర్ణయించుసందర్భములోఁ గూడ చాల వివాదములు గలవు. కొందఱు ఈతనిని బుద్ధునికంటెను పూర్వుఁడనియును, మఱికొందఱు 'యస్కాదిభ్యో గోత్రే' (1-4-6)—అనుసూత్రముచేత పాణినియాస్కశబ్దమును నిర్వచించి యుండుటచేత, నితఁడు పాణినికంటెఁ బ్రాచీనుడై మాత్ర ముండక తప్పదనియు, నింకకొందఱు యాస్క లన్నపేరు గలవారు పలువురుండుటవలన నీయుక్తి సరియైనది కాదనియు వివదించుచు నిప్పటికిని నిదమిత్థమని తేల్పజాలక గ్రుక్కిళ్లు మ్రింగుచున్నారు. సమామ్నాయమునకు పైని చెప్పిన టీకగాక వేఱొకవ్యాఖ్యానముగూడ నున్నది- ఇదిచాల నవీనమని యందురు. కాని వైదికసంప్రదాయము అవిచ్ఛిన్నముగా వ్యాప్తిలోనున్న కాలమునాటి యాస్కాచార్యుని వ్యాఖ్యకన్నను, లోపించిపోవుస్థితికి వచ్చుచున్న మధ్య కాలపుటీకకంటెను నుతరాం తత్సంప్రదాయమే లేనియట్టికాలమునాటికి ఈచివఱ వ్యాఖ్యా సంజీవనీప్రాయముగా నున్నది.

౨. నామలింగానుశాసనము:—ఇయ్యది అమరసింహకృతము. ప్రస్తుతమియ్యది రామాశ్రమీయుభాటీకలతోఁ బొంగైవారును, సర్వానందక్షీరస్వామి పండితులవ్యాఖ్యలతోదక్షిణప్రాంతములవారును (అనగామహారాష్ట్రులు, ద్రవిడులును) లింగాభట్టీయముతోఁ నాంధ్రులును ముద్రించి యున్నారు.

సంస్కృతభాషయందు యాస్కుని నిరుక్తముతరువాత నంతటిసుప్రసిద్ధిని గడించిన దీనామలింగానుశాసనము. దీని రచించినఅమరసింహుడు సుప్రసిద్ధవైయాకరణియును, అసదృశప్రామాణికుఁ డనుపేర్గాంచినవాఁడునై యున్నాడు. అమరసింహుడు, ధన్వంతరిక్షపణకామరసింహ—యన్నశ్లోకమును ఆధారముగాగొని, విక్రమునిసమకా

ఇది నామలింగానుశాసనమునందును గలదు. నామలింగానుశాసనకర్త పైనిగద వచనమును సంగ్రహించి యుండు నని తలంచెదను.

లీనుడని కొందఱును, విక్రమునితర్వాత ౫-౬ శతాబ్దు లిటీవలివాఁ డని కొందఱు పేర్మిత కాలనిర్ణయవిషయమున పండితులు ఇప్పటికిని వివరించుచునే యున్నారు. కవికాలమును గూర్చిన వివాదముల నటుంచి, ఈనిఘంటువు సంస్కృతసాహిత్యమున కెంతటి యుపకరించు నని విచారణ చేయుదుమేని, దీనితోఁదుల్యమైనది మఱొక్కటి ఇంతవఱకును లే దనవచ్చును.

అమరకవి నామలింగానుశాసనము వ్రాయునప్పటికి కేవలము నిఘంటువులవ్యాప్తి అట్టె లేదని యన వీలులేదు. వ్యాడి వరరుచి మొదలగువారియొక్క త్రికాండి ఉత్పలిని మున్నగుటీకలను వ్యాఖ్యానములను సంక్షేపించి- అనగా అసంబద్ధాప్రయుక్తాదులనువానిని, దగ్గించియును, అవశ్యము ప్రచారమునకు గొనిరాఁదగిన తర్కమీమాంసా న్యాయ వేదాంతాది శాస్త్రములకు జెందినపరిభాషలను గమనించి కూర్చియును చాల జాగ్రత్తతో ఆయాశాస్త్రమర్యాదలకు హానికల్గనిరీతిని చక్కనివ్యవస్థతోను, నియమముతోను కట్టుదిట్టముగా నిఘంటుకర్మను సాగించినాడు. మొత్తముమీఁద ఈయన ఆకాలమునకు ఉత్పన్నస్థితికి వచ్చుచున్న సమస్తగ్రంథములనుండియు సమబుద్ధితో సప్రమాణముగా సాంప్రదాయికములు పారిభాషికములు అగుశబ్దముల నన్నిటిని సంగ్రహించెను. ఒక్క అమరమునందు ఇప్పుడు (అనగా అధికపాఠములనికొన్ని, అర్థములేనివనికొన్ని ముద్రాపకులు మొదలయినవారు తొలగించినవిపోగా, మిగత) దాదాపు 1000 శబ్దములు వివిధవిషయములకు సంబంధించినవిగలవు. నామలింగానుశాసనము బయటబడినతోడనే స్వాభావికమగుదానితేజస్సునెదుట నంతవఱకు ప్రచారమున నున్న నిఘంటువులన్నియును మూలబడుట సంభవించినది. సంస్కృతసాహిత్యమున స్థిరప్రతిష్ఠను గాంచియున్న రససిద్ధులగు సుబంధుభామహమాఘబాణభవభూతిరత్నాకర రాజశేఖరాదులు తమతమ కావ్యజాలమునందు వివిధశాస్త్రములందలి పారిభాషలను విచ్చలవిడిగా వాడఁజొచ్చిరి. అట్టిపదములను సాంతముగా నెఱుంగుటకు అమరము ఆకాలమునుండి నేటివఱకు అమూల్య మగుసాయము నొనర్చుచునే యున్నది. అమరము తర్వాత, నంతటి సర్వాంగపూర్ణమగు నిఘంటువు అంతటివ్యవస్థతో మఱియొకటి యింతవఱకు ప్రచురింపబడలేదు. ఒక్క అమరుని నామలింగశాసనమును గూర్చియే ఎంతో చెప్పవలసి యున్నను సంగ్రహబుద్ధిని ఇంతతో దీనిని వదలిపెట్టుచున్నాను.

సంస్కృతవాఙ్మయమునందు అమర నామధేయము గల గ్రంథకర్తలు ఇద్దరు మాగ్గురకుఁ బైగా నున్నారు. వారిలో నామలింగానుశాసనకర్త అమరసింహుఁడేకాని అమరదైవతమాత్రమును కాదు. కావ్యకల్పలత యనెడి పిష్టగ్రంథమునకు కర్తయైనయతఁడు అమరచంద్రు డగునే గాని అమరసింహుఁడు కాదందురు. బాలభారతగ్రంథకర్తకూడను. నామలింగానుశాసనమును రచించినయమరసింహుఁడు వైయాకరణుఁడని [శాబ్దికుఁడని] పేర్కొనంబడిన ఎన్మండ్రుగురిలో నొక్కడు మాత్రమే. పాణినీయవ్యాకరణముయొక్క టీకలో నీయెన్మండుగురువైయాకరణులయొక్క పేరులు గలవు.

రాష్ట్రీయకప్పములు.

చావలి వేంకట హనుమంతరావు గారు, బి, ఏ.
హిందూహైస్కూలు, బందరు.

రాజకీయసంస్కరణముల అనంతరము దేశమునందు బయల్వెడలిన సమస్యలలో రాష్ట్రములు భారతప్రభుత్వమునకు చెల్లించవలసిన కప్పముల (ప్రావిన్షియల్ కంట్రిబ్యూషన్) సమస్య ఒకటి. ఈసమస్య ప్రతిసంవత్సరమును తప్పక పైకివచ్చుచు చర్చలకు సావకాశ మిచ్చుట ఆచారమైనది. ఈరాష్ట్రకప్పములు సంస్కరణముల అనంతరమే ఆచరణలోనికి వచ్చినవి. అంతకుపూర్వము హిందూదేశమునందు రాష్ట్రములు భారతప్రభుత్వమునకు కప్పములు చెల్లించవలసిన ఆవశ్యకత లేకుండెను. సంస్కరణములు ప్రవేశపెట్టబడకముందు భారతప్రభుత్వమే అన్నిపన్నులను విధించుటకును, వాటిని రాష్ట్రములవారికి పంచిపెట్టుటకును అధికారముండెను. రాష్ట్రప్రభుత్వములకు స్వతంత్రించి పన్నులను విధించుటకును, ఆపన్నులను తమ ఇష్టమువచ్చినట్లు ఖర్చుపెట్టుకొనుటకును అధికారములేదు. అట్టి విధానమువల్ల, రాష్ట్రములు తమఖర్చులకొరకును భారతప్రభుత్వముపై ఆధారపడి యుండుటయు, వాటికి తమంత స్వతంత్రముగాని ఏపనిచేయుటకును తగినంత అవకాశముగాని లేకుండెను. కాని అప్పుడు రాష్ట్రములలో ప్రభుత్వవశమగుచు ప్రజావశమైన శాఖలవిభజన లేకపోవుటవల్లను, అన్ని పరిపాలన శాఖలును ఒకేవ్యక్తులలోనేచేరియుండుటవల్లను, రాష్ట్రకేంద్రఆర్థికవిషయములందు విభజనచేయుటకుకూడ అవసరము లేకుండెను. ప్రభుత్వమువారు, ముఖ్యముగా భారతప్రభుత్వమువారు ఆర్థికవిషయములపై సంపూర్ణాధికారము తమచేతులయందే ఉంచుకొనుటకు మాత్రము చాలకాలమునుండి ప్రయత్నములు చేయుచుండిరి.

1919 సం॥లో సంస్కరణములు దేశములో ప్రవేశపెట్టబడి, భారతప్రభుత్వశాఖలు రాష్ట్రీయప్రభుత్వశాఖలు అధికారములు విడదీయబడి, రాష్ట్రములలో ముఖ్యముగా ప్రజోపయోగములుగానుండు విద్య, వ్యవసాయము, ఆరోగ్యము మొదలగు శాఖలు మంత్రులవశము చేయబడినపిమ్మట, రాష్ట్రములలో ఈవిషయములపై తగినంత డబ్బు ఖర్చుపెట్టుటఆవశ్యకమైనప్పుడు రాష్ట్రీయశాసనసభలకును, మంత్రులకును కొంతధనమును సమకూర్చుటకును ఖర్చుపెట్టుటకును వీలగునట్లు మార్గముల నన్వేషించుట తప్పనిసరి యాయెను. కాని సంస్కరణవిధానము తయారుచేయబడుకాలములో, మాంటేగ్యూ ఛెమ్సుఫర్డుగార్లు తమసంస్కరణ రిపోర్టులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వఆదాయమార్గములను వేరుచేయవలె ననియు, అదివఱకు రెండుప్రభుత్వములును కలసి విధించుచున్న భూమిపన్ను, నీటిపన్ను, త్రాగుడు, స్టాంపుపన్నులను సంపూర్ణముగ రాష్ట్రీయప్రభుత్వములకు ఇచ్చివేయవలెననియు, కేంద్రప్రభుత్వమునకు అదివరకున్న సుంకములు రైల్వే,ఉప్పు,నల్లమందుపన్నులు గాక, ఆదాయపుపన్ను కూడ ఈయబడవలె ననియు సూచించియుండిరి.

ఇట్లు విభజనచేయుటవల్ల కేంద్ర ప్రభుత్వపు ఆదాయములో లోటువచ్చునట్లు కన్పించుటచే, ఆలోటును పూర్తిచేయుటకు రాష్ట్రములు తమకు క్రొత్తగా చేకూరిన ఆదాయములలోనుండి కొంతధనమును కేంద్రప్రభుత్వమునకు చందా(కంట్రిబ్యూషన్)గా ఈయవలెనని కూడ, మాంటాగూఛెమ్సుఫర్డురిపోర్టులో సూచింపబడెను. కేంద్రప్రభుత్వపు 1917-18 ఆదాయ వ్యయపట్టీని బట్టి, అట్టిలోటు 13 కోట్ల 63 లక్షలుండునని అంచనా వేయబడి, ఆలోటు రాష్ట్రములపై విభజించుటకును రాష్ట్రములు తమమొత్తము ఆదాయములలో నూరింట 87 పాళ్లు కేంద్రప్రభుత్వమున కిచ్చునట్లును నిశ్చయింపబడెను. అప్పుడే రాష్ట్రములకు స్వతంత్రముగా పన్నులు విధించుటకును డబ్బును తమబాధ్యతమీద అప్పుచేయుటకునుకూడ అధికారమిచ్చుటకు తీర్మానము చేయబడెను.

మాంటాగూరిపోర్టునందు చేయబడినపైసూచనలుకొన్ని రాష్ట్రములు ఆమోదన బడయకుండుటచేత, పార్లమెంటరీజాయింటుకమిటీ వారిసలహాపై హిందూదేశమంత్రి రాష్ట్రీయకప్పములు, వాటికి సంబంధించినవిషయములనుగూర్చి ఆలోచించి, తగుసూచలను చేయుటకు మెస్టన్ప్రభువు అధ్యక్షతక్రింద ఒక కమిటీని ఏర్పాటుజేసెను. ఆకమిటీవారు రాష్ట్రప్రభుత్వములయొక్కయు భారతప్రభుత్వము యొక్కయు ఇంకా ఇతరఆర్థికపండితులయొక్కయు సాక్ష్యమును పుచ్చుకొని, తమ సూచనలను రిపోర్టుగా ప్రచురించిరి. 1918 సంవత్సరము లోను, అనంతరమును భారతప్రభుత్వమువారు కొంతఖర్చు తగ్గించుకొనుట వల్లను, ఇతరకారణములవల్లను, వారిబడ్జెటులో లోటు 13 కోట్ల 63 లక్షలనుండి 6 కోట్లకు తగ్గెను; కాని సామాన్యస్టాంపుల వల్లవచ్చు ఆదాయము రాష్ట్రములకుమార్చి, మెస్టన్ కమిటీవారీలోటును10 కోట్లక్రింద మార్చిరి. వారుచేసిన ముఖ్యమార్పులలో మొదటిది పైన చెప్పినట్లుగా సామాన్యస్టాంపులపై పన్నును రాష్ట్రములకు జమచేయుట; రెండవది కేంద్రప్రభుత్వపు 10 కోట్లరూపాయులలోటును పూర్తిచేయుటకు ఏయే రాష్ట్ర మెంత కప్పము మొదట ఈయవలసినదియు నిశ్చయించుట. మెస్టన్కమిటీవారు తమరిపోర్టులో రాష్ట్రీయకప్పములను నిర్ణయించుసమస్య అనేకకష్టములతో కూడుకొన్నట్టిదనియు, భారతప్రభుత్వమువారు వీలైనంతత్వరలో రాష్ట్ర కప్పములను తగ్గించుటకును చివఱకు తొలగించుటకును తగుప్రయత్నములు చేసి తమ ఆర్థికవిధానమును అట్లు మార్చుకొనవలెననియు స్పష్టముగా వ్రాసిరి. వారు తమ విచారణ జరిగించు కాలములో రాష్ట్రము లన్నియు తమతమకష్టములను నివేదించు కొన్నను, వారువాటికి తగిన సదుపాయములు చేయలేనట్టి పరిస్థితులలో నుంటిమని వ్రాసిరి. అనేకవిధానములను విచారించి చివరకు రాష్ట్రములు క్రొత్తసంస్కరణములక్రింద ప్రజోపయోగములగు కార్యములు చేయుటకు తగినంత ధనము నుంచుకొన్న తరువాత, పైగా మిగిలిన సొమ్మును బట్టి, రాష్ట్రకప్పముల మొత్తములను నిర్ణ

యించుటకు నిశ్చయించిరి. ఈక్రింది పట్టికలో ఏయేరాష్ట్రమునకు ఎంత ఎక్కువ ఆదాయము వచ్చునో, దానిలో కప్పము ఎంత మొత్తము కట్టవలెనో సూచింపబడినది.

రాష్ట్రము.	క్రొత్తగా ఆర్థికవిధానవల్ల రాష్ట్రములకు ఎక్కువవచ్చు ఆదాయం	కప్పపుమొత్తము	రాష్ట్రములకు మిగిలినది.
చెన్నపట్టణము	576 లక్షలు	343 లక్షలు	223 లక్షలు.
బొంబాయి	93 ,,	56 ,,	37 ,,
బెంగాలు	104 ,,	63 ,,	41 ,,
సంయుక్తరాష్ట్రములు	397 ,,	240 ,,	157 ,,
పంజాబు	289 ,,	175 ,,	114 ,,
బర్మా	246 ,,	64 ,,	182 ,,
బీహారు-ఒరిస్సా	51 ,,		51 ,,
మధ్యరాష్ట్రములు	52 ,,	22 ,,	30 ,,
ఆసాము	42 ,,	15 ,,	27 ,,

మెస్టన్ కమిటీ వారి రిపోర్టు అనంతరము సంస్కారణముల సమయములో ఏర్పర్పబడిన ఫైనాన్షియల్ రలేషన్ కమిటీవారు మెస్టన్ విధానమును భారతప్రభుత్వము అమలునందుంచవలయు నని సూచించుచు, ఏరాష్ట్రములోగాని సంస్కారణముల క్రొత్తిలో ఆదాయవ్యయపట్టికలందు లోటుతో ప్రారంభించరాదనియు, ఏరాష్ట్రముగాని క్రొత్తపన్నులను విధించుఅవసరము కల్గియుండకూడదనియు ముఖ్య సూత్రము నొకదానిని ప్రతిపాదించి ఆసూత్రము ననుసరించియే ఆర్థికవిధానవిభజనవల్ల (Financial decentralisation and adjustment) ఎక్కువలాభము పొంది ఎక్కుడు ఆదాయముగల మద్రాసు, పాంచాలము, సంయుక్తపరగణాలు మొదలగురాష్ట్రములు కప్పములలో ఎక్కువమొత్తములను చెల్లించవలెనని నిర్ణయించిరి. ఇతరరాష్ట్రములకన్న ముఖ్యముగా బొంబాయి

కన్న ఎక్కువ ఆదాయముకలరాష్ట్రము కాకపోయినప్పటికిని, ఇతరరాష్ట్రములలోకన్న ఆరాష్ట్రములో ఖర్చు ఎక్కువైనప్పటికిన్నీ, తాము 348 లక్షలు కప్పమును చెల్లించవలె ననుట అన్యాయమని మద్రాసురాష్ట్రప్రభుత్వమువారును ప్రజలును తెలియపర్చిరి. బొంబాయిరాష్ట్రమువారు ఆదాయపుపన్నును కేంద్రప్రభుత్వమువారు తీసుకొనుటవల్ల తమ బొక్కసమునకు చాలనష్టము కల్గుననియు, అరాష్ట్రములో ఖర్చులో హెచ్చుతగ్గులను పూడ్చుకొనుటకు తమకు ఆదాయపుపన్నువల్ల వచ్చు సొమ్మే మూలాధార మనియు, దానిని తీసికొనిపోవుట చాల అన్యాయమనియు చెప్పదొడంగిరి. ఇతరరాష్ట్రములవారు కూడ ఇట్లే అసమ్మతిని తెలియజేయుచు, భారతప్రభుత్వమువారిని వెంటనే తమకు కప్పములను తగ్గించవలెనని కోరపెట్టుకొనజొచ్చిరి; కాని యుద్ధానంతరము భారతబడ్జెట్‌లో ఆదాయవ్యయములను సరిపెట్టుట చాల కష్టముగా నుండుట చేతను, ఖర్చు చాల ఎక్కువగుట వల్లను నాలుగు సంవత్సరములు భారతప్రభుత్వము వారు రాష్ట్రీయకప్పములను తగ్గించుటకు అవకాశములు లేకుండపోయెను. కాని 1924-25 సంవత్సరపు ఆదాయవ్యయపట్టీయందు భారతఆర్థికసభ్యుడు సర్ బేసిల్ బ్లాకెట్ 3 కోట్ల 36 లక్షలు మిగులు కనపర్చినప్పుడు శాసనసభయందురాష్ట్రములకప్పములుతగ్గించుసమస్య మఱల తలయెత్తెను. శాసనసభ్యులు ఈమిగులును ఉప్పుపన్నుతగ్గించుటకు ఉపయోగించి తరువాత రాష్ట్రీకప్పములను తగ్గించుటకు కూడ ప్రయత్నములు చేయవలెనని ప్రభుత్వము వారికి సూచించిరి. కాని ప్రభుత్వమువా రుప్పుపన్నునకును రాష్ట్రీకప్పములకును ముడివేసి, ఒకటి తగ్గిన ఒకటి తగ్గదని హెచ్చరించుటచే చివఱకు రాష్ట్రీకప్పములే తగ్గించుటకు ప్రజాప్రతినిధులు ఒప్పుకొని, అట్లు తగ్గించిన రాష్ట్రీకప్పముల వల్ల మిగిలినధనమును రాష్ట్రప్రభుత్వము వారు ప్రజాయత్తశాఖలకై వినియోగింపవలె ననుసూచనను చేసిరి. ఆసంవత్సరమే 836 లక్షలలోనూ 150లక్షలు రాష్ట్రములకప్పములను తగ్గించుటకు బ్లాకెట్ గారు ఏర్పాటు చేసిరి. ఆసంవత్సరమునుండియు

భారత ఆర్థికపట్టికలో మిగులు కన్పించుట మొదలు పెట్టుటచే అప్పటినుండియు కొంతకొంతభాగము రాష్ట్రకప్పములలో తగ్గుదల చేయబడుచునేయుండెను. భారతప్రభుత్వమువారు మెస్టన్‌కమిటీవారీవిషయములో చేసిన సూచనననుసరించి, తమ ఆర్థికస్థితి బాగుపడుట మొదలుపెట్టినతరువాత, నిల్వయున్నసొమ్మునుండి రాష్ట్రకప్పములను తగ్గించువిధానమును ఆచరణలో నుంచుచుండిరి. 1927-28 సంవత్సరం ఆదాయవ్యయపట్టీలో చాల మిగులువచ్చుటచే సర్ బాసిల్ బ్లాకెట్ గారు రాష్ట్రీయ కప్పములు సంపూర్ణముగ తీసివేయబడెననియు, అట్లు కప్పములు తీసివేయుట వల్ల రాష్ట్రములకుచేతిలోనికి వచ్చిన ధనమువల్ల రాష్ట్రప్రభుత్వములు ప్రజోపయుక్త విధులందు ఆధనమును ఖర్చు పెట్టి ప్రజలస్థితి బాగుచేయుటకు తగిన అవకాశము కల్గిన దనియు తెలియజేసిరి. ఆసమయమందు ప్రజాప్రతినిధులు భారతఆర్థికసభ్యునిప్రకటనకు సంతోషమును వెలిబుచ్చుచు ఇకముందు రాష్ట్రీయ కప్పములే సంపూర్ణముగ తొలగింపబడుటకవకాశములు కలవనియు, రాష్ట్రములు ఈప్రకటనవల్ల సంతృప్తి పొందుననియు చెప్పిరి. భారతప్రభుత్వమువారు ఇచ్చినసొమ్మును వీలయినంతవరకు ప్రజాయత్తశాఖలకై ఖర్చుపెట్టవలెనననూహానందరును వెలిబుచ్చిరి. మద్రాసురాజధానికి 348 లక్షలు క్రొత్త ఆదాయము వచ్చుటచే దానితో విద్యావిధానములు, రాష్ట్రమందు జబ్బులు తగ్గించుట, ఆస్పత్రుల నేర్పరచుట, వ్యవసాయవిషయములందు ఎక్కువ పనిచేయుట మొదలగు పనులందు దానిని వుపయోగించునట్లు శాసనసభ్యులు చూడవలసియున్నది. ఈరాష్ట్రకప్పము లిట్లు సంపూర్ణముగ తగ్గించివేయబడినప్పటికిని, బొంబాయివారు తమ ఆదాయపు పన్నును భారతప్రభుత్వమువారు తీసుకొనుటవల్ల వచ్చిన నష్టము పూర్తికాలేదనియు, ఆపన్నును సగముభాగమునైనను తమకు తిరిగి ఇప్పించవలెననియు ప్రభుత్వమువారికి విన్నప మంపుకొనిరి. వంగరాష్ట్రము మొదటినుండియు రాష్ట్రకప్పము చెల్లింపకపోయినప్పటికిని

తనకుచాల లోటుగా నున్నదనియు, జనవనారపై విధించుపన్నులు నూటికి 40 పాళ్లు తమకు భారత ప్రభుత్వమువారు వదలివేయవలె ననియు విన్నపము పంపుకొనిరి. భారత ప్రభుత్వమువారు డివల్యూషన్ రూల్సు ప్రకారము వీలయినప్పుడు తమకును రాష్ట్రములకు వున్నసంబంధములను మార్చి తగినమార్పులను చేయవచ్చును. కాని ప్రభుత్వమువారు ఇప్పుడు బొంబాయి వంగరాష్ట్రములు కోరినట్లు పన్నులను వారికి వదలివేయుట కిష్టములేక, రాష్ట్రీయకప్పముల విధానము పునర్విచారణచేయుసమయ మేతెంచినదనియు, రాబోవు సంస్కరణవిచారణసంఘము ఈవిషయమై సంపూర్ణముగ ఆలోచించుననియు, అందువల్ల ఈలోగా పైకోరబడినమార్పులుచేయుటవల్ల లాభము లేదనియు తమ యభిప్రాయమును వెలిబుచ్చిరి.

ఇకముందు విధానమేమి యని ఆలోచించిన తేలున దేమనగా భారతప్రభుత్వము ముందుముందు తన ఆదాయములోనే తనఖర్చును సరిపెట్టుకొనుటకు ప్రయత్నముచేసి, రాష్ట్రకప్పములను సంపూర్ణముగ తొలగించవలెను. ఇప్పుడు రాష్ట్రములకుగల భూమిపన్ను, త్రాగుడు, స్టాంపులు,నీటితీర్వ మొదలగుపన్నులు రాష్ట్రములకే వుండునట్లు చూడవలెను. భారతప్రభుత్వమువారు తమలోటుదయిన వున్నయెడల దిగుమతి సుంకములవల్లను ఆదాయపుపన్ను వల్లను దానిని పూర్తిచేసుకోవలెను. రాష్ట్రములకు సంపూర్ణస్వాతంత్ర్యము రాజకీయముగా ఈయబడినపుడు ఆర్థికవిషయములందుకూడ వారికి సంపూర్ణస్వాతంత్ర్యముండితీరవలెను. రాయల్ కమీషనువారీవిషయమై చర్చించునప్పుడు రాష్ట్ర ప్రభుత్వములు డబ్బులేక, చాల కష్టములు పడుచున్నవనియు వాటికి భారతప్రభుత్వముమీాద ఆధారపడియుండకుండ స్వతంత్రముగ చేయుట ముఖ్యమను సూత్రమును ప్రతిపాదించుట అవసరమనియు గ్రహించవలసియున్నది. రాష్ట్రముల కిచ్చిన క్రొత్తశాఖలవల్ల ఎక్కువ ఆదాయము రాకపోగా, వారు భారతప్రభుత్వమునకు కప్పములను చెల్లించుట విధియాయెను. వారు ఖర్చుచేసికొనుటకు మిగుల్చు

కొన్నతరువాత వున్న ధనమునుండి కప్పములను చెల్లింపవచ్చును-అను హొస్టనుకమిటీవారిసూచన మంచి దైనప్పటికిన్ని రాష్ట్రములకు నిజముగా కావలసిన ఖర్చు చేసికొనుటకే ధనము చేతిలోనికిరాకుండ పోయెను. భారతప్రభుత్వము వారికున్న ఇంకంటాక్సు కష్టమ్సువన్నులు మొదలగునవి ఎప్పటికప్పుడు వృద్ధి చేసికొనుటకు వీలుకల్గినట్టి వగుటవల్ల, వారు వాటిపై ఎక్కువ ఆదాయమును రాబట్టుకొనుటకు చాల మంచి అవకాశములున్నవి. రాష్ట్రము రాష్ట్రము మధ్య ప్రబలు ద్వేషములను తగ్గించుటకును, రాష్ట్రములకును దేశమునకును ప్రజలకును వుపయుక్తములుగానుండునట్టి పనులు చేయుటకు వీలు కలుగునట్లు చేయుటకును పైనచెప్పినట్లుగా కప్పములను తీసివేయుట ముఖ్యము.

చావలి వేంకట హనుమంతరావు.

వృక్షముల హృదయము.

[తుప్పల లక్ష్మణరావుగారు. ఎమ్. ఏ; డి. ఎస్‌సి (జర్మనీ)]

౧

చెట్లు తమయాహారమును భూమినుండి వ్రేళ్లగుండా పీల్చుచున్నవని మనకందరకును తెలియును. ఈపదార్థములను తమ యాకులతో పీల్చుకొని, అక్కడ సూర్యకిరణముల శక్తిని వినియోగపరిచి యీ పదార్థములనుండి భుజించుటకు వీలుగానుండు వస్తువులను తయారు చేయుచున్నవి. చెట్లు భూమిలోనుండు లవణములనేగాక నీటినిగూడా విస్తారముగా గ్రహించుచున్న వనికూడ మనకు తెలియును. నీరు అవసరములగు ఆహారపదార్థములలో నొకటి యగుటయేగాక యితరపదార్థములగూడ వృక్షజాతికి ఉపయోగపడుచున్నది. భూమియందున్న లవణ పదార్థములను తనలో కరిగించి ద్రవణరూపముగ మార్చి వ్రేళ్ళు పీల్చుటకు ఉపయోగపడుచున్నది. ఈముడుసు పదార్థములను చెట్లు తమ దేహములలో ఆహారములను తయారుచేయు స్థలములకు పంపుటకును, తయారైన ఆహారమును వివిధాంగములకు సరఫరా చేయుటకును, నీటి ప్రవాహము అవసరము. ఈద్రవము వ్రేళ్లయందు ప్రవేశించిన తరువాత చెట్లదేహములగుండా యెట్లు ప్రవహించుచున్నది? చిగుళ్లకును, మొగ్గలకును సహితము అందునట్లు యీప్రవాహము యెట్లు పైకి లేచుచున్నది? యీద్రవమును అనేకవందల అడుగుల యెత్తువరకును ప్రవహింప జేయు యద్భుతశక్తి చెట్లకెట్లు కలుగుచున్నది? ఈరహస్యమును బయలుపరచుటకు శాస్త్రిజ్ఞులు అనేకశతాబ్దములనుండి ప్రయత్నించుచున్నారు. అనేకు లనేకవిధముల సిద్ధాంతములను చేసియున్నారు. అందు ముఖ్యమైన వాటినిగూర్చి క్లుప్తముగ ప్రసంగించి అవి యెంతవరకు నిజమో చూచెదము.

వసంతకాలమున భూదేవి పచ్చని దుస్తులను ధరించి, వృక్షముల యొక్కయు పక్షుల యొక్కయు సంగీతములతో నాట్యమాడుట మన కవులు వర్ణించియున్నారు. ఈకాలమందు చెట్లు వేనవేలు చిగుళ్లను ధరించి యాచిగుళ్ళు విడి పిల్లయాకులగును. ఎండి సన్నగిలి రెమ్మ లన్నియు పుష్టిగల్గి ఆరోగ్యమును సూచించు పచ్చనిరంగును పొందును. తమలో యిట్టిమార్పును కల్పించుకొనుటకు చెట్లు యెంతేని పాటు పడవలసి యుండును. విస్తారము నీటిని పీల్చి యానీటిప్రవాహము గుండా తినుబడివస్తువులను పిల్లయాకులకు అందజేయవలెను. చైత్ర వైశాఖములలో కొబ్బరి తాటి యీతచెట్లను గీసి తీయుకల్లు యీరసప్ర వాహమే. ఆకులు చిగుర్చుటకును, పూవులు పూయుటకును ఉపయోగ పడు యీప్రవాహమును గమ్యస్థానము చేరనీయకుండజేసి మనము సంగ్రహించుచున్నాము. ఈవిధముగ కొబ్బరిజాతులు రోజుకు రెండు మూడు శేర్ల రసమును ప్రవాహవేగముతో వ్రేళ్లనుండి ప్రకాండముల ద్వారా తమశిఖరములకు పంపించుచున్నవి. రోజుకు పది పదిహేను శేర్ల రసము తోడు చెట్లుకూడా కలవు. ఇట్లు తోడగల్గుటకు కార ణము తెలుసుకొనవలసియున్నది. నేలయందు చొచ్చుకొనియుండు వ్రేళ్ల కొనలు అచ్చటయుండు నీటి బొట్లచే ఆవరింపబడి యుండును. యిట్టి నీటిసంపర్కమువలన వ్రేళ్లయొక్క జీవ కణములలో నీరు ప్రవేశించి వాటిని నీటితో నింపుటయే గాక మరింత హెచ్చునీరు వాటిలోనికి పోయి, కణములను పొంగు నట్లు చేయును. హెచ్చునీటిని తమలోపలినుండి తరిమి వేయుటకు కణ ముల చర్మములు బలముతో ముడుచుకొనును. ఇట్లు ముడుచుకొనుట వలన కొంత ఒత్తిడి పుట్టును. ఈఒత్తిడి మూలమున హెచ్చునీరు కణము లనుండి పైకిపోవును. యీపైకిపోయిన నీరు చుట్టుప్రక్కల యందుండు కణములలో ప్రవేశించి, అక్కడకూడ ఒత్తిడిని కల్గించును. ఈవిధము గా వ్రేళ్లయందుండు కణములన్నియు నీటిని పైకి లేవనెత్తి ప్రకాండముల యందు నీటిని ప్రవహింపచేయును. దీనికి 'వ్రేళ్ళఒత్తిడి' యని శాస్త్రజ్ఞులు

పేరిడియున్నారు. ఈఒత్తిడియే చెట్లయందుండు ప్రవాహామునకు కారణభూత మనుసిద్ధాంతమును కొంతవరకు విమర్శించ వలసియున్నది. ఈఒత్తిడియొక్క పరిమితి ౧౪ (ఒకటిన్నర) వాయుభారములకంటె హెచ్చులేదు. అనగా నీటిని ౫౦ అడుగులకంటె హెచ్చుయెత్తుకు పంపలేదు. అట్లైనప్పుడు 300 అడుగులకంటె ఎత్తుగా పెరుగు యుకలిప్టస్ చెట్లయొక్క శిఖరములవరకు యీనీరెట్లు ప్రవహించగలుగుచున్నది? ఆముద్వపుచెట్టు నందు ఉత్పత్తియగు వ్రేళ్ళఒత్తిడి వాయుభారము కంటె సగముకంటె తక్కువగనే యున్నది. అనగా నీటిని ఒకఅడుగు కంటె హెచ్చు ఎత్తుకు పంప లేదు. ఇట్లుండగా, ఈఒత్తిడి వసంత కాలమునందే హెచ్చు పరిమితి కలిగియుండును. మిగిలినకాలములందు ఒత్తిడి యుండనే యుండదు. కొన్ని వృక్షములయందు అసలే ఒత్తిడి యుండదు. చెట్లయందు మాత్రము ఒత్తిడి యున్నను లేకపోయి నను నీరుమాత్రము ప్రవహించవలసినదే. మండువేసవిదినమున చెట్టు నొకదానిని నరికినయెడల దానినుండి రసము పైకి ప్రవహించుటకు మారుగ నరికిన స్థలమందు నీరుంచిన యెడల ఆనీటిని చెట్టు లోపునకు పీల్చుకొనును. ఈకారణములవలన నీటిని ప్రవహింపచేయునది ఈవ్రేళ్ల ఒత్తిడి కాదని స్పష్ట మగుచున్నది.

పైసిద్ధాంతము సరియైనది కాదని తెలిసినతరువాత శాస్త్రజ్ఞులు వృక్షములయందుం డీయద్భుతశక్తిని అనేకవిధముల విశదపరచుటకు ప్రయత్నించుచున్నారు. వాతావరణమందున్నా వేడిమికి చెట్లుయందున్నా నీరు ఆకులద్వారా ఆవిరి రూపమున పోవుచున్న సంగతి తెలిసిన విషయమే. మండువేసవియందు వేడిమికి చెట్లుతమయందుండు నీటిని కోల్పోయి సొమ్మసిల్లి వెలవెల బోవుట మనమందరము చూచుచునే యున్నాము. చెట్లీలాగు వాడిపోయినను అవి కోల్పోయిన నీటికి బదులుగ తిరిగి నీరు పోసిన అవి మునుపటివలెనే తలయెత్తి ధృడముగ నుండుట కూడ మనము చూచుచునే యున్నాము. దీనివల్ల శిఖరమున

నున్న యాకులకును, భూమియందుండు వ్రేళ్లకును నీరుపారు నాళములు గలవని తెలియుచున్నది. ఆవిరి రూపముగ పోవునీటి నష్టమును సరి పుచ్చుకొనుటకు ఆకులు ఈగొట్టములద్వారా భూమినుండి నీటిని పీల్చును. ఆకు లిట్లు నిరంతరము పీల్చుట వలననే నీటిప్రవాహము వ్రేళ్లనుండి చెట్లశిఖరముల వరకును లేచుచున్నదని శాస్త్రజ్ఞులు సిద్ధాంతీకరించుచున్నారు. ఈసిద్ధాంతము సబబుగ నున్నదో లేదో ఈదిగువ యుదాహరించిన చిన్నప్రయోగమువలన స్పష్టమగును. ఈ పీల్చుమహాశక్తి ఆకులయందు సదా యున్నదనుచున్నారు. ఈయా కులను తెగనరకినయెడల నీటిని పీల్చలేక ఈశక్తి నాశనము కావలె నుకదా. ఒకచెట్టుయొక్క కాడను తెచ్చి, అందున్నయాకుల నన్నిం టిని తీసివైచి కాడనుండి ఆవిరిపైకి పోకుండ కాడయంతను మైనముతో పూసి కాడను నీటియందుంచి చూతము. ఆకులు నీటిని పీల్చుట వలననే నీరు పైకి లేచుచున్నయెడల మనము ప్రయోగమందు వాడిన ప్ర కారము నీటిని పీల్చలేక త్వరలో చనిపోవలయును. నిజముగా అట్లు జరుగుట లేదు. ఆకులు లేకపోయినను ఈశక్తిని కోలుపోక ప్రకాండము నీటిని పైకితోడుచునే యుండును.

ఈసిద్ధాంతమును నిరాకరించవలసివచ్చిన తరువాత వృక్షశాస్త్ర వేత్తలు వృక్షములయందుండు నీయద్భుతశక్తిని పదార్థవిజ్ఞానశాస్త్రసూ త్రముల సాహాయ్యమున తేటపరచుటకు ప్రయత్నించిరి. ఇంకను ప్రయ త్నించుచునే యున్నారు. కొందఱు ఈశక్తికి కారణము నీటికి కలుగు సంశ్లేషమనియు (కొహీషను), కొందరు నీటిప్రవాహము 'కెపిల్లారిటీ' చే లేచుచున్నదనియు వివిధములుగ చెప్పుచున్నారు. కొన్ని సిద్ధాంత ములు ప్రయోగముల వల్ల అసంభవము లనియు, మరికొన్ని ప్రకృతి శాస్త్రధర్మములకే విరుద్ధములనియు ఖండింపబడుచున్నవి. ఏది యెట్లున్నను, పాశ్చాత్య వృక్షశాస్త్రవేత్త లీయద్భుతములను విశదము చేయలేకున్నారని మాత్రము తేటతెల్లమయినది.

౨

మనుష్యునకు క్లోరఫారముగాని యీధరుగాని వాసన చూపించిన మతి తప్పి యింద్రియముల శక్తిని కోల్పోవుచున్నాడు. ఈవిష పదార్థములను ఆతనిదరినుండి తీసివైచినతరువాత క్రమముగా స్పృహజేరి యెప్పటివలె తన యింద్రియములను యథేచ్ఛగా వాడుకొనగల శక్తిని పొందుచున్నాడు. ఈప్రకారముగానే మనము చెట్లకు క్లోరఫారము ఈధరు ఆల్కహోలు యిట్టి మత్తు పదార్థములను పట్టినయెడల వాటికికూడ స్పృహ తప్పి వాటికి సహజములగు చలనములను కోల్పోవును. ఇట్లు నశించు సహజకృత్యములలో నీటిప్రవాహమొక్కటి. విషపదార్థములను వాటి కిచ్చుట మానినవెంటనే స్పృహచేరి వెనకటియట్లు వ్రేళ్లనుండి ఆకులవరకును నీరు ప్రవహించుట ప్రారంభించును. ఈప్రయోగము మిక్కిలి సులభమైనదయ్యును దీని విలువ చెప్పనలవి కాదు. ఈ చిన్నప్రయోగము వలననే పాశ్చాత్యవృక్షశాస్త్రి మంతయు తలక్రిందు లయ్యెను. భూమిమట్టమునుండి, రెండుమూడువందల అడుగులవరకును చెట్లదేహములయందు నీరు ప్రవహించుట కేవలము ప్రకృతిశాస్త్రి సిద్ధాంతముల ననుసరించి పనిజేయు నీరుతోడు యంత్రముల పనియేయైనయెడల స్పృహతప్పిన వెంటనే ఈనీటిప్రవాహమేల యాగిపోవలెను? స్పృహ కల్గిన వెంటనే నీటిప్రవాహ మేల యేర్పడవలెను? ఈప్రవాహము వృత్తియంత్రబలమువలనకాక మనుష్యులతోపాటు వృక్షములకును సహజమగు జీవము యొక్కయద్భుత శక్తియే యని యేలయనరాదు?

ఇట్టి దృక్పథమును కల్గి వృక్షముల జీవ రహస్యములను కనిపెట్ట సాహసించిన స్వప్రసిద్ధశాస్త్రిజ్ఞుడు మనస్వదేశీయుడగు జగదీశచంద్రబోసుగారే. ఈయన వృక్షశాస్త్రిమందు చేసిన పరిశోధనలు, వృక్షజీవితమునుండి బయల్పరచిన రహస్యమును గూర్చిచదివిన యింద్రజాల మహేంద్రజాలముల వలె గన్పట్టి మనఃపూర్వోలి. పురాణములందు వ్రాసినవిషయములు నిజములే యని తోపక మానదు. వృ

క్షముల శరీరములయందుండు నీటి ప్రవాహమును గూర్చి ప్రకృతి శాస్త్రములనే యాధారముగ గైకొని పాశ్చాత్య వృక్షశాస్త్రవేత్తలు చేసిన వాదములు విఫలములుకాగా, మానవునియందేమి జంతువుల యందేమి క్రిమికీటకాదులందేమి వృక్షములయందేమి సృష్టి యెన్ని రూపముల ధరించినను ప్రాణమొక్కటియేయను వేదాంతసూత్రము నాధారముగ గైకొని బోసు మహాశయుడు చేసిన సిద్ధాంతము జయమొంది ప్రపంచమందున్న పండితోత్తముల యామోదమును బడయుటయం దాశ్చర్య మెద్దియునులేదు. బోసుగారి సిద్ధాంతము క్లుప్తముగా చెప్పదలచిన యిట్లుండును:—మనుష్యుని శరీరమందు హృదయము నిరంతరము లయప్రకార మెట్లు కొట్టుకొనుచు రక్తమును నాళముల గుండా ప్రవహింప జేయుచున్నదో, యట్లే వృక్షముల శరీరములందు కూడా నిరంతరము లయప్రకారము కొట్టుకొను హృదయ మొకటుండి, అదియే నీటిని ఆహారరసమును నాళములగుండా ప్రవహింప జేయుచున్నది.

వేళ్ళనుండి శిఖరములనున్న యాకులవరకును నీటిని పైకెత్తి ప్రవహింపజేయు శక్తికిని నీటినాళముల నంటియుండు నాళకిరణముల జీవకణములకును యేదోయొక సంబంధ ముండక తప్పదని నలుబదియేండ్లక్రిందట వెస్టర్ మైయర్, గాడ్లెవ్‌స్కీ, యాన్సే యను జర్మను పండితులు వాదించి యుండిరి. కాని తమ వాదనయొక్క నిజమును నిరూపించుటకును చెట్లశరీరములందు జరుగు వివరములను బహిరంగపరచుటకును వలయు సూక్ష్మయంత్రము లాకాలమందు లేకపోవుటచే వారి వాదన లప్పటివారెవ్వరును సరకుజేయలేదు. బోసుగారు తమ యద్భుతమగు యంత్రనిర్మాణ కౌశలముచే "క్రెస్కోగ్రాఫు" అను యంత్రమును కనిపెట్టి తద్ద్వారా చెట్ల శరీరములయందు జరుగు అద్భుత కార్యములను ప్రతివారికంటికిని కన్పట్టునట్లు నిరూపించగలుగుచున్నారు.

మనదేహమందు హృదయము పనిచేయునపుడెల్లను కొంత విద్యుత్ ప్రవాహ ముత్పత్తియగుచుండును. వృక్షములయొక్క హృద

యము పనిచేయునపుడు కూడా కొంత విద్యుత్ ప్రవాహ ముత్పత్తి యగుచున్నది. బోసుగారిచే చెట్లహృదయమును నిరూపించుటకును, వాటిదేహములందు నీరెట్లు ప్రవహించుచున్న దను సమస్యను పూర్తి చేయుటకును నిర్మించిన యంత్రమందు అత్యంతసూక్ష్మమగు ప్లాటినముసూది ఒకటియున్నది. ఈసూది ఒకస్ప్రింగుకొనకు అతకబడి యుండును. ఈప్లాటినముసూదితో సంబంధము కలిగిన, మిక్కిలి సున్నితమగు యొకగాల్వనామీటరుండును. ఈ యంత్రమునకు బోసుగారు "విద్యుత్ హృదయశోధిని" యని పేరిడి యున్నారు. ఈయంత్రమందుండు ప్లాటినపుసూదిక్రింద చెట్టుయొక్క ప్రకాండమునుంచి మరను మెల్లగా త్రిప్పిన ఆసూది క్రమక్రమముగా కాడలోనికి లోతుగా ప్రవేశించును. అట్లు ప్రవేశించినపుడు చర్మము క్రిందనుండు వివిధములగు కణసంహతులను (టిష్యూస్) స్పర్శించును. మొదట సూది బహిశ్చర్మమును స్పర్శించును. తరువాత మెత్తని గుజురువంటి కండరమును దానితరువాత అంతకంటె లోతుగనున్న అంతశ్చర్మమును, దానితరువాత యింకను లోతుననుండు వివిధములగు నరములను, నీటినాళములను స్పర్శించును. ఇంతవరకు గాల్వనామీటరునందు యేట్టిమార్పును కలుగదు. యంత్రమందుండు ముల్లు కదలక శాంతస్థితియందుండును. తరువాత ప్లాటినముశోధిని నరములను నాళములను దాటి వాటిక్రిందనుండు హృదయ కణములను స్పర్శించును. ప్రాణశక్తిని కల్గి నిరంతరము ముడుచుకొనుచును తెరచుకొనుచును యుండే కణములను శోధిని తాకినవెంటనే గాల్వనామీటరందుండు ముల్లు అద్భుతమగు చలనమును చూపును. లయప్రకారము ముందుకును వెనుకకున ఆముల్లు తిరుగాడుచుండును. జీవము లేని కణములందు విద్యుచ్ఛక్తి పుట్టదు. సజీవములైన హృదయ కణములే విద్యుచ్ఛక్తిని పుట్టించగల్గును. హృదయసమానమగు అంగము వృక్షములందు గూడ గలదనియు, మనలో హృదయ మెట్లు రక్తము త్రోయుచున్నదో, వృక్షముల హృదయము కూడ నట్లె లెఖ్ఖప్రకా

రము లయనవలంబించి నీటిని ఆహారరసమును తోడుచున్నదని ఈ హృదయశోధినియంత్రమువలన మనకు తెలియు చున్నది. ఈగాల్వానామీటరుయందుండు ముల్లుపై సన్నని వెల్తురు కిరణమును ప్రసరింపజేసి ఆకిరణమును ఒక తెరపై పరావర్తనము చేసినయెడల బింబము తెరపై పడి చలనము కోటింతలు వృద్ధినొంది ముందునకును వెనుకకును తాండవమాడుచు చూపరుల కత్యాశ్చర్యము కలుగ చేయును.

ఈ యంత్రముయొక్క సహాయమువలన వృక్ష దేహముల యందు జరుగు అద్భుతములన్నియును పండు విప్పినట్లు తేటతెల్లమగు చున్నవి. ఇదివరకు వీలుకానటువంటివిన్ని, కనివిని యెరుగనటువంటివిన్ని ప్రయోగముల నెన్నిటినో చేసి, హృదయముయొక్క చలనములు, పరిస్థితులు మార్పువలన హృదయచలనములందు కలుగుమార్పులు, హృదయ కణముల ధర్మములు ఇత్యాదివిషయములను లెక్కలు కట్టి నిరూపించుటకు కూడ బోసుగారు వీలును కల్పించియున్నారు. వృక్షముల హృదయకణములలో నీరు ప్రవేశించుచున్నకొలది హృదయము పొంగి పెద్దదగును. నీటితో పొంగి, హృదయ మొక్కసారి ముడుచుకొనును. ఇట్లు ముడుచుకొనగానే కణములలోన నుండు నీరంతయు నాళముల ద్వారా ప్రవహించును. నీరంతయు పూర్తిగ పోయినతరువాత తిరిగి నీరు చేరి హృదయము పొంగును. ఇట్లు పొంగినప్పుడు పైనుదాహరించిన ప్రయోగమునందుండు, వెల్తురుబింబము తెరపై ముందుకు నడచును. నీరు పోయిహృదయము ముడుచుకొనునపుడు బింబము వెనుకకు నడచును. ఇట్లు ౧౪(పదునాల్గు) సెకెండ్లకొకసారి హృదయము పొంగుటయు ముడుచుకొనుటయు సంభవించును. ఈ హృదయకణములు నీరుప్రవహించు నాళములను చుట్టియుండును. క్రమప్రకారము హృదయము ముడుచుకొనుట పొంగుటయును నిలయకు— మానుషశరీరశాస్త్రి సూత్రముల ననుసరించియే—వృక్షహృదయముల యొక్క 'నాడి'యని బోసుగారు చెప్పియున్నారు. ఉష్ణముచేసిన మననాడి యొక్క వేగమెట్లు అధికమగునో, వాతముచేసిన వేగమెట్లు తగ్గునో, అట్లే చెట్లనాడి కూడ

ఉష్ణమువలన వేగముగను, చల్లదనమువలన మందముగను కొట్టకొనును. అదికాక మితమైనను మద్యపానమువలన మననాడి యెట్లు వేగముగా కొట్టుకొనునో, ఆప్రకారమే చెట్లకుకూడ మద్యపానమువలన నాడి వేగమగును. విషప్రయోగమువలన మనుష్యుని హృదయము యెట్లు ఆగి పోవునో అట్లే చెట్లహృదయములు కూడ ఆగిపోవును. ఈప్రయోగము లన్నియు బోసుగారు ౧౯౨౪ సంవత్సరములో జర్మనీ యందును ౧౯౨౬ ఆగస్టునందు లండనులో రాయల్ సొసాయటీ వారియెదుటను ప్రదర్శించి తమసిద్ధాంతములు నిజము లని నిరూపింప గలిగిరి.

ఈసిద్ధాంతములు పాశ్చాత్య వృక్షశాస్త్రమును తలక్రిందులుగ జేసెననుటలో అతిశయోక్తి యేమియు లేదు. కేవలము ప్రకృతి శాస్త్రములనే ఆధారములుగ జేసికొని పరిశోధనలుచేసి నంతకాలము పాశ్చాత్య శాస్త్రజ్ఞులకు ప్రాణముయొక్క రహస్యము గోచరించుట దుర్లభమయ్యెను. మనవేదములు ఉపనిషత్తులు శాస్త్రములు యివన్ని యు ప్రాణము రూపభేదమును పొందుచున్నను ప్రాణమొకటియే యని యుగములనుండియు ఘోషించుచున్నవి. మనఋషుల వాక్యము లనే ఆధారముగ గైకొని బోసుగారు మనుష్యునకు వృక్షమునకును రూమునందు భేదమున్నను, శరీరరాంతర నిర్మాణమందు మాత్రము భేదములేదనియు రెంటియందును ప్రాణమొక్కటియే యనియు తమ మేధాశక్తివలనను, యంత్ర ప్రయోగమువలనను నిరూపించుచున్నారు.

బరంపురము. తిప్పల లక్ష్మణరావు.

రేడియో.

పాతూరి పట్టాభిరామయ్యగారు, ఎం, ఏ.

(నోబిల్ కళాశాల, బందరు.)

విద్యుచ్ఛక్తిమూలమున తీగెలసహాయముతో దూరాన్ని జయించిన తర్వాత తీగెలు లేకుండా వార్తలను పంపగలిగితే చాలా చిక్కులు వదలుతవని గ్రహించినారు. ఎందుకంటే ఒకచోటినుంచి మరియొకచోటికి తీగెలు వేయవలెనంటే దానికి స్తంభాలు, స్తంభాల నెత్తిన ఇన్సులేటర్లు, వాటిపైన తీగెను సాచివేయడం ఇవన్నీ తప్పడమే కాకుండా నేలమీదగాక సముద్రంలో తీగెలువేయాలంటే చాలా కష్టాలు ఉన్నవి. అట్లాంటిక్ మహాసముద్రంలో తీగెను వేయటానికి అష్టకష్టాలు పడ్డారు. సముద్రపునీటిగుండా విద్యుచ్ఛక్తి ప్రవహిస్తుంది. అందుచేత తీగెచుట్టూ సముద్రపునీరు తగిలినా చెడని ఇన్సులేట సుపూత వేయవలసి వచ్చింది. ఇట్లా పూతవేస్తే ప్రవాహానికి నిరోధం యెక్కువ. అతివిస్తారమైన ప్రవాహాన్ని పంపవలసి వస్తుంది. అట్లా పంపక పోతే దూరమున వున్నస్థానంలో పనిముట్లు పనిచేయవు. అందు చేత ఈతీగెలబాధ తప్పితే బాగుండునని తీగెలు లేకుండా చేయడానికి ప్రయత్నంచేశారు.

వెనుక విద్యుచ్ఛక్తిప్రవాహం ముందుకుపోవడానికి తీగెనున్నా, తిరిగిరావడానికి భూమినే తీగెగాను వాడినారని తెలుసుకున్నాము. ఆ నమోనాప్రకారం రెండవతీగెకు బదులుకూడా భూమినే వాడడానికి మొట్టమొదట ప్రయత్నంచేశారు కాని అది సాగిందికాదు. తర్వాత నదులు అడ్డమువచ్చినప్పుడు నదులమీద వంతెనలులేనప్పుడు తీగెలు సాచడం ఇబ్బందిగనుక నదీజలాన్ని, పంపేతీగె తిరిగివచ్చేతీగెకు బదులుగా వాడడానికి ప్రయత్నంచేశారు. అందులో మళ్లీ మన 'మార్స్'

ప్రథముడు. 1842 సంవత్సరంలో ఒకకాలువకు ఇద్దరిన అద్దరిన టెల్లి గ్రాపంపేస్థానం అందుకునేస్థానం పెట్టినాడు.

[విద్యుచ్ఛక్తిప్రవాహమానం బాటరీచిత్రమును చూడుడు.]

కొంతప్రయాస పడినతర్వాత ఇద్దరిన "కీ" నొక్కితే అద్దరి ప్రవాహమానంలో కాస్త కదిలిక కలిగింది. ఈవిధంగా ప్రవాహజలాన్ని కొంత తీగెక్రింద వాడినాడు. దీనిన్నే మరికొందరు వృద్ధిచేయగా ఒక మైలు వెడల్పుగలప్రవాహము నతిక్రమించడానికి వీలయింది.

ఈవిధానంలోకి నూతనభావం ఒకదాన్ని 'ట్రాబ్రిడ్జి' అనే పండితుడు ప్రవేశపెట్టినాడు. అదేమిటంటే ఇదివరకువలె ఎతతెగనిశక్తి ప్రవాహానికి బదులు బహుత్వరితముగా ఆపబడిన ప్రవాహాన్ని, ప్రవాహమానానికి బదులు టెల్లిఫోనును పెట్టితే సూచనలు బాగా స్పష్టంగా తెలుస్తవనిచెప్పినాడు. అందుమీద 'మార్సు' పద్ధతికి ఉన్నఆక్షేపణలు చాలా పోయినవి. ఈఆలోచన మన'బెల్లు'కు బాగా నచ్చింది. అంతట ఈమార్గాన్ని అవలంబించి మైలుంబాతికదూరాన్ని తేలికగా తీగలేకుండా ఆక్రమించాడు. కాని దీనికిన్నీ ఇప్పటి మనరేడియోతరంగాలు పంపడానికిన్నీ ఏమీసంబంధం లేదు. కాని రేడియోతరంగాలు పంపడానికికూడా 'అవిచ్ఛిన్నవిద్యుచ్ఛక్తిప్రవాహం' గాక 'విచ్ఛిన్నప్రవాహ'మె పనికివస్తుంది. 'విచ్ఛిన్న ప్రవాహాన్ని' (రాపిడ్లీ ఆల్టర్నేటింగుకరెంటు) వాడ లేకపోవడంచేతనే రేడియో అభివృద్ధికూడా కొంతకాలం ఆగిపోయింది. ప్రవాహాన్నీ భూమినీ, రెండోతీగెగా వాడడంవల్ల అట్టేదూరాన్ని జయించలేకపోయినారు.

ఈస్థితిలో వుండగా వెలుతురు యొక్కప్రసరణాన్ని గురించిన అనేకసిద్ధాంతాలను భౌతికశాస్త్రిజ్ఞులు విచారిస్తూ ఉండిరి. ప్రతి సిద్ధాంతానికి యేదో ఒక బలవత్తరమయిన పూర్వపక్షం వస్తూనే ఉండినది. ఇట్టి సందర్భంలో ఎడింబరోపర్వకళాపరిషత్తునందు భౌతికశాస్త్రి (ఫిజిక్సు) ఆచార్యులుగానుండిన 'జేమ్సు క్లార్కు

మాక్స్వెల్' అనునాయన 1865 వ సంవత్సరంలో ఎలెక్ట్రో మాగ్నెటిక్ లేక రేడియో తరంగాలు ఉండి తీరవలె నని కేవల ము గణితశాస్త్రపద్ధతులవలన కనిపెట్టినాడు. ఈపరిశోధనలే మన రేడియోకు సరియైన మాతృక. ఆయన సిద్ధాంతమిది. ఇంద్రియ గోచర ము కాని పదార్థము ఆకాశమున్నది. ఎలెక్ట్రిక్ సర్క్యూట్ లో అనగా సరీ గా కండక్టర్లతో కలిపిన పనిముట్ల సమూహములో ఊపులు కలగచేస్తే చుట్టును ఉన్న ఆకాశంలో తరంగాలు బయలుదేరుతవి ఈతరంగాలు వెలుతురు ప్రసరించే వేగంతో ప్రసరిస్తవి అని. ఈసిద్ధాంతం భేషయినది. వెలుగు ప్రసరణానికినిరభ్యంతరమైన సిద్ధాంతాన్ని కల్పించడమే కాకుం డా వెలుతురు వేడి రేడియో ఎక్సుకిరణాలు (ఎక్సురేస్) ఇవన్నియు ఒ క్కతరంగపుపొడవు (వేవ్ లెంగ్తు) నందు తప్ప, మిగతా విషయములం దుఒకటే గుణము కలవని ఏర్పడడానికి వీలు కలుగచేసింది. 'మాక్స్వెల్' సిద్ధాంతీకరించిన రేడియో తరంగాలే, నేడు మనకు వార్తాహరణము నకు తీగెలేని నూతనపరికరములను అందజేసినవి.

తరువాత కొన్ని సంవత్సరములకు అనగా 1838 వ సంవత్సరంలో జర్మనీ దేశంలో 'కారల్సూ' పట్టణమున 'హెర్ట్జ' పండితుడు, 'మాక్స్వెల్' గణితముమూలమున ఊహించినతరంగములను ప్రయోగమూలమున (ఎక్స్పెరిమెంటు) రుజువుచేసినాడు. అటుపిమ్మట 'బాన్' పట్టణమున అనేకములగు పరిశోధనలనుజరిపి, 'హెర్ట్జ' పండితుడు ప్రపంచమునందు పేరుగాంచెను. ఆయన రేడియో తరంగములను పుట్టించి, ప్రసరింపజేయు డమే గాక, ప్రసరిస్తున్న తరంగములను గుర్తింపగలిగెను. క్రొత్తబొమ్మ దొరకినప్పుడు పిల్లవాడాడుకొనునట్లు ఈ తరంగములతో నాడ జొచ్చెను; కాని వార్తాహరణమునకు నూతనమగు శాస్త్రము యొక్క పునాదులను వేయుచున్నటు గమనింపలేదు. తనపరిశోధనాగారములో ఈతరంగములను వెనుకకు ముందుకు నడపి వాటిని వంచి, ప్రతిబింబించి వెలుతురుకు చేయుతగిన ప్రతిప్రయోగములు వాని కొనగూర్చెను.

తరంగములను గుర్తించుటకు రెండుచిన్నగుండ్లు చివరలనుగల గుండ్రముగావంచినతీగెను వాడెను. ఈపరికరము చివరలకు నెత్తిన ఉండు మీనముల ఆకారమున నుండుటచే 'అంటెన్నా' అని దానికి పేరిడెను. 'హెర్ట్జ' ఉపయోగించినతరంగములను 'హెర్ట్జియన్' తరంగములని వాడుచున్నారు. ఈతరంగములను వాడి వార్తలను పంపుటకు చాలాప్రయత్నములను చాలామందిచేసినారు గాని వీరంతా సరిగా నడపగల యంత్రమును జేయలేకపోయిరి.

ఆగౌరవము ఇటలీదేశస్థుడగు 'మార్కోని' కే సిద్ధించినది. ఈయనకు మిగతవారికి ఉన్నభేదము ముఖ్యముగా అతిత్వరితముగా 'విచ్ఛిన్నమగు విద్యుచ్ఛక్తిప్రవాహము'ను వాడుటయే. మొట్టమొదట ఈయన చేసినయంత్రము సున్నితము కాకపోయినను తప్పక పనిచేసినది. అదియే దానిగొప్ప. తరంగములను గుర్తించుటకు వాడిన పనిముట్టుకు 'కోహియరర్' అనిపేరు. ఒకగాజుగొట్టములో ఆకురాతిలో రాచిన లోహపుపొడిని వదులుగా నింపి, దానికిరుప్రక్కలను రెండులోహపు పొట్టిఖడ్డీలను దోపిరి. ఈ'కోహియరర్' గుండా విద్యుచ్ఛక్తి ప్రవాహము పోయినప్పుడు లోహపుపొడి అంటుకొని ప్రవాహనిర్బంధమును తగ్గించును. అట్లా నిర్బంధం తగ్గితే ఈ'కోహియరర్' వున్న సర్కీటులో ప్రవాహము హెచ్చగును. ఇట్లు హెచ్చు తగ్గు ప్రవాహము గల సర్కీటులో టెలిఫోను ఉన్నయెడల దానిలో శబ్దము కలుగు నని మనకిదివరకే తెలునును. ప్రవాహం లేనప్పుడు అతుకుకొనిపోయిన పొడి పొరలరాలిపోక తిప్పలుపెట్టజొచ్చెను. 'కోహియరర్'ను తన్ని రాలగొట్టుటకొక పనిముట్టు నుపయోగించవలసివచ్చింది. దానిని, 'డి-కోహియరర్' అన్నాడు. ఈరెండు ఉండుటచేత అతని పనిముట్టు బాగాపనిచేసింది. ఇదంతా 1896వ సంవత్సరంలోచేసినాడు. తరువాతిరెండేండ్లు నిద్రాహారములులేక ఎడతెగని పరిశోధనలను జరిపి, ఇంగ్లాండులో టపాలా టెల్లిగ్రాముల అధికారియగు 'సర్ విలియంప్రీసు'గారికి తన ప్లానులను చూపించినాడు. ఆయన వెంటనే 'మార్కోనీ' పనిముట్టుయొక్క ఉత్కృ

ష్టత కనిపెట్టి అతనికి సహకారిగానుండుట కంగీకరించెను. అంత జెనరల్ పోస్టాఫీసులో నొకగదిలో నీయంత్రమునుంచి నూరుగజముల దూరమున నున్న మరియొకచోట గుర్తించే యంత్రమునుంచి వార్తల నంపి గుర్తించ గలిగిరి. తరువాత కొంతకాలమునకు ఎనిమిదిన్నర మైళ్ల దూరమున నున్న స్థానముతో సంభాషించగలిగిరి. ఈపరిశోధనలలో వార్త పంపుటకు వినుటకు కావలసిన గాలిలో వ్రేలాడు తీగెనముదాయమును గాలిపడగలతో నిలిపిరి. ఇప్పుడో వందల అడుగుల ఎత్తుగల స్తంభములను కట్టడములను నిల్పి వానికి 'ఏయిారియోల్సు'ను వ్రేలాడగట్టుదురు.

1908 వ సంవత్సరము వచ్చునప్పటికి పడవల పందెములను గురించి వార్తల నంపుటకు వీలగు యంత్రములను కట్టిరి. ఆయంత్రములు ఇరవై మైళ్ళదూరము నాక్రమించ గలిగినవి గాని 'మార్కోని' మాత్రము ఎక్కువదూరమునకు కూడ పనిచేయగల యంత్రములను కట్టవచ్చునని గుర్తెరిగి యుండెను. ఆకాశము లోనికి తను పంపగల శక్తిపరిమాణమును బట్టియే దూరము నిర్ణయింప బడునని అతడు తెలుసుకొని యుండెను.

1901 వ సంవత్సరమున అట్లాంటిక్ మహాసముద్రము మీద ప్రథమవార్తలు పంపిరి. ఈవార్త 'యస్' అనేఅక్షరముయొక్క సంకేతమై యుండెను గాని 1800 ల మైళ్ళదూరము వినబడెను. వార్త పంపుటకుపయోగించినపరికరములు ప్రయోగమునకు తగినవేగాని వర్తకసరిన వార్తలు పంపడానికి పనికివచ్చేవిగావు, కాని దూరమును మాత్రము జయింపవచ్చునని తేటపడెను. 1908 వ సంవత్సరమున 'మార్కోని' తన యంత్రమును అట్లాంటిక్ మహాసముద్రమును తరించి వార్తల నందించుదానినిగా నొనర్చి వర్తకసరి వార్తాహరణమున కనుకూలముగా నొనర్చెను. కాని ఈయంత్రము కూడా అవిచ్ఛిన్నముగా పనిచేయ జాలక పోయెను. కాని ఎలెక్ట్రికు తుపానులు లేనప్పుడు మాత్రము వార్తలు సరిగావచ్చుచునే యుండెను. తుపాను గలిగిన

ప్పుడు మాత్రము వ్యవహార మసంభవ మయ్యెను వర్తకసరిన వాడుక కుపయోగపడునని 'మార్కోని' దారిజూపగానే వందలకొలది పరిశోధకులు ఆవిషయమును వెన్నంటి చాల క్రొత్తవిషయములను కనిపెట్టజొచ్చిరి. పంపేయంత్రముల శక్తిని వృద్ధిచేసి, వినేయంత్రములను సున్నితముగా జేసిరి. ఎట్టిబలహీనమైన తరంగానైనా గుర్తించగల యంత్రాలను కనిపెట్టినారు.

1912 వసంవత్సరం వచ్చేటప్పటికి అన్నిజాతులవారు పరిశోధనలోకి దిగి ఒకరుపంపేతరంగాలతో ఇంకొకరు పంపేతరంగాలు డీకొని రెండు నాశమవడం మొదలైన చిక్కులు బయలుదేరుటచేత అంతర్జాతీయ సమ్మేళనము చేసి నిబంధనలు ఏర్పాటుచేయవలసివచ్చింది. దీనిపరిణామంగానే ప్రతిపెద్దపడవకు ఒకరేడియోయంత్రము ఆయంత్రము నుపయోగించుట కొకశిక్షనొందిన అధికారీ ఉండవలెనని నిర్ణయించిరి. దీనిమూలమున సముద్రముమీద ప్రయాణముచేసే ఓడలు ఒకదానికొకటి సహాయంచేయడానికి వీలవుతుంది.

1914 వసంవత్సరంలో అట్లాంటిక్ మహాసముద్రమును తరించు రేడియో యంత్రాలు అనేకము బయలుదేరినవి. వార్తలను ధారాళంగా పంపారు. అంతేగాక మానవ వాక్కును అయిదువేలమైళ్లదూరాన వినబడేటట్టు పంపించారు.

1921 వ సంవత్సరంలో ప్రపంచములో కల్లా గొప్పదగు రేడియోసంస్థను కట్టారు. దానిమూలమున అమెరికాలో అనేకదేశముల నుండి ఒకేమారు వార్తలను తెలుసుకోవడమూ అనేకదేశములకు వార్తలను పంపడమూ కలుగుచున్నది.

అన్ని పరిశోధనల కన్నను రేడియో పరిశోధన బహుత్వరలో విశేషములను కనిపెట్టి వృద్ధిపొంద కలిగెను. ఒకనూతనవిశేషము ప్రపంచమున నందరికిని ఉపయోగడునట్లు చేయుటకు 30 సంవత్సరము

లేపాటి! వర్తమానకాలము చాలా గొప్పది. ఈకాలమున నూతన విషయమేదయినను కనిపెట్టబడిన వెంటనే దానికి ధనసహాయమొనర్చి విజ్ఞానమును పెంపొందించుటకు బద్ధకంకణు లున్నారు. పూర్వమువలె పరిశోధకులను పరిహసించడమూ, హింసించడమూ లేదు. కాబట్టి శాస్త్రములు దినదినాభివృద్ధిని పొందుతున్నవి!

ఈవ్యాసమున వార్తాహరణచరిత్ర ముగిసినది. పైవ్యాసము విద్యుచ్ఛక్తి తరంగముల నుత్పత్తిజేయు విధానములను పరికరములను గూర్చి వ్రాస్తాము.

బందరు. పాతూరి పట్టాభిరామయ్య.

ప్రజాస్వామ్యము విఫలమైనదా?

డాక్టరు వంగల శివరామ్ గారు
ఎం, ఏ; పి, హెచ్, డి; (హార్వర్డు) ఎఫ్, ఆర్, హెచ్, ఎస్.
(రాజనీతిపండితులు, లక్నో విశ్వవిద్యాలయము.)

[శ్రీ శివరామ్ గారు ఆంగ్లములో వ్రాసి 'జయంతి'కి ఇచ్చినవ్యాసమును తెలుగులోకి అనువదించి ప్రకటిస్తున్నాము. వారి భావాలు సరిగా బోధపడేటట్టు సులభశైలిలో వ్రాయడానికి ప్రయత్నించాము. మాప్రయత్నము ఎంతవరకు సఫలమైనదో చదువరులే చెప్పగలరు. ఇందులోని భావాలు ప్రశస్తములు. కాబట్టి ఆకీర్తి డాక్టరుగారిదే. వాటిని స్పష్టముగా తెలియజేయలేకపోతే ఆలోపము అనువాదకులమైన మాదే. రాజకీయసమస్యలను గూర్చి స్వతంత్రముగా ఆలోచించి సమర్థతతో వ్రాయగల ధీశాలురు మనలో చాలా కొద్దిమందిమాత్రమే. ఇట్టివిషయములను ఆంధ్రదేశానికి ప్రకటించే అవకాశము మాకిచ్చినందుకు డాక్టరుగారికి కృతజ్ఞులము. కో॥ రా॥]

"మనుష్యుడు జన్మచేత స్వతంత్రుడే!
కాని, సర్వత్రా సంకెళ్ళలో చిక్కుకున్నాడు" 'రూసో.'

ప్రజాస్వామ్యధర్మము ప్రతిపక్షులవల్లనూ కొంతవరకు అభిమానులవల్లనూ కూడా నిందలపాలయినది. ప్రతిపక్షులు అది కోరతగనిదనో లేక అసాధ్యమనో అంటారు. అభిమానస్థులు ఇదివరకే అది సిద్ధించినదనో లేక ఎప్పటికైనా సిద్ధింపక తీరగనో వాదిస్తారు. ఇప్పుడు భరతఖండములో ప్రజాస్వామికప్రభుత్వము కావలెనని మనము కోరుతున్నాము. కాబట్టి మనము దానిని అవలంబించేముందు యూరపు అమెరికా ఖండాలలో ఆచరణయందు అది ఎట్లా పరిణమించినదో, అందలి లాభనష్టాలేవో యెంచి గమనించడము చాలామంచిది. మన

దేశములో ప్రజాస్వామిక ప్రభుత్వము ఏర్పడవలెనంటే, ముందుగా ఏయేపరిస్థితులు అవసరమో, ఈవ్యాసములో నేను చర్చింప తలుచుకో లేదు. కాని, ఇతరదేశాలలో ఆవిధానము విఫలమగుటకు గాని, సఫలీకృత మగుటకు గాని, తోడ్పడిన ముఖ్యకారణాలను మాత్రము ఇక్కడ వివరిస్తాను. వాటిని ఇకముందు మనరాజ్యాంగమును నిర్మించుకునేటప్పుడు, ఉపయోగించుకోవచ్చును.

ఏజాతిలోనూ, రాజకీయ పారిశ్రామిక సంస్థలలో అసలైనప్రజాస్వామికవిధానము ఇంతవరకు లేనేలేదు. బ్రిటను, ఫ్రాన్సు, అమెరికా సంయుక్తరాష్ట్రములు మొదలైన దేశాలలో రాజకీయముగా మాత్రము స్వపరిపాలనాసంస్థలు ఉంటున్నవి. వాటిస్థితిగతులనుబట్టి అవి ఒకచోట ఎక్కువ జయప్రదముగానూ, వేరొకచోట తక్కువ జయప్రదముగానూ సాగుతున్నవి. కాని, నిజానికి ప్రజాశక్తి నిరాటంకముగా ఎక్కడాకూడా ఈసంస్థలద్వారా విజృంభించడము లేదు. ప్రజాపరిపాలనలో ప్రజాభిప్రాయము కొంతవరకైనా పనిచేస్తున్న మాట నిజమే. అయినప్పటికీ ఎక్కడచూసినా, ఎవరోకొందరు అధికారమూ పలుకుబడీ గలవ్యక్తులు గాని, స్వలాభమే చూసుకునే సంఘములు గాని రాజకీయకక్షలపేరుకోనూ, దేశభక్తిఅనే నెపము మీదనూ తమమాటను సాగించుకుంటున్నారు. అమెరికాసంయుక్త రాష్ట్రములలో మొన్నమొన్నటివరకుకూడా ప్రజాస్వామ్యమనుపేరిట గొప్పవర్తకులు ప్రభుత్వచక్రమును నడిపించారు. ఇప్పుడుకూడా ఆ దేశములో అతినీచమైన పారిశ్రామిక నిరంకుశత్వము ప్రబలిఉన్నది. ఇది రాజ్యాంగవిషయములలో అనేకదుస్తంత్రములకు మూలమై, అరిష్టదాయకముగా ఉన్నది. ఇంతవరకు ప్రజాస్వామికపద్ధతులన్నీ చాలా వరకు నిష్ప్రయోజనము కావడము చూసి ప్రతిపక్షులు ప్రజాస్వామ్యము ఎన్నటికీ సిద్ధించదని అక్షంతలు వేస్తున్నారు.

ప్రజాస్వామికవిధానము రాజకీయములోనూ, మతములోనూ, సాంఘికవిషయాలలోనూ, పారిశ్రామికశ్రేణులలోనూ కూడా ఉండ

వచ్చును. వీటిలో ఒకదానితో ఇంకొకదానికి సంబంధముంటూ, ఒకదానివల్ల ఇంకొకదానికి బలము కలుగుతూ ఉంటుంది. కాని రాజకీయముగా ప్రజాస్వామ్యము సాధింపబడుతున్నా, సాంఘికముగానూ పారిశ్రామికవిషయాలలోనూ, పూర్వపునిరంకుశత్వము నిలిచి ఉండడమువల్ల ప్రజాస్వామ్యానికి కొంతఆటంకము కలుగుతూ ఉండవచ్చును. ఇందుకు సాంఘికముగా భరతఖండమున్నూ, పారిశ్రామికముగా అమెరికాసంయుక్తరాష్ట్రములూ బ్రిటనున్నూ, ఉదాహరణాలు. ఒక్కొక్కప్పుడు సంఘములో ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన స్థితిగతులు ఉంటున్నా, రాజకీయముగా ప్రజాస్వామికవిధానము సిద్ధింపవచ్చును. బిరుదులున్నవారిని గౌరవించే బ్రిటనులోనూ, కుబేరులను పూజించే అమెరికాలోనూ ప్రజాస్వామ్యము ఏర్పడిఉండడమే ఇందుకు తార్కాణము. ఈదేశాలలో ప్రజలకు ఏకొందరినో చూస్తే ఉండే మోజువల్లనూ, పలుకుబడీ అధికారమూ గలకొందరు సబబూసందర్భమూ లేకుండానే విధించిన అభిప్రాయముల బలమువల్లనూ, నేరస్థులైన బిరుదాంకితులూ విద్యావంతులూ ఒక్కొక్కప్పుడు శిక్షపడకుండా తప్పించుకుంటున్నారు. ఇట్లా తప్పించుకోవడము ప్రజాస్వామ్యానికంతా మూలాధారమైన "ధర్మదృష్టిలో సర్వజనులూ సమానులే" అనే సూత్రానికే భంగకరము. కాని ఇక్కడ ఒకసందర్భము గమనించవలసి ఉంటుంది. ప్రజాస్వామ్యాదర్శాలను బట్టి, ధీశాలురకూ సమర్థులకూ ఏవిధమైనప్రాముఖ్యతా ఉండకూడదనీ, ఆచరణలో వారికెక్కువగౌరవము చూపించకూడదనీ, సామాన్యముగా అనుకుంటారు. కాని అట్టి భావము అసలు ప్రజాస్వామికవిధానములో లేదు. మహాత్మాగాంధీగారివంటి మహాపురుషులను ప్రజాస్వామికరాష్ట్రాలవారు పూజిస్తూనే ఉన్నారు. కులమూ సంపదా బాహుబలములవల్ల ఏర్పడిన భేదా- మాత్రమే పాటించకూడనివని ప్రజాస్వామ్యవాది అంటాడు. "ప్రజాస్వామ్యమంటే అందరూ సమానులని అనుకునేపద్ధతి" అని కొందరు చేసిన నిర్వచనము బాగానే ఉన్నది. సంఘములో అందరికంటే

ఎవరు ఉత్తమోత్తములో నిర్ణయించడానికి ఈసూత్రము ఉపయోగి స్తుంది. అందరికీ సమానమైన అవకాశాలు ఇచ్చినప్పుడే ధీశక్తియందూ సామర్థ్యమునందూ ఉన్నభేదాలు బయటపడుతవి. అట్టిప్రజాస్వామిక సంఘమునందే "ఆబ్రహాములింకను"వంటి సామాన్యగృహస్థులు ఉన్నతపదవికి వచ్చి, దేశానికి మహోపకారము చేయడానికి అవ కాశము ఉంటుంది. సంఘము మొత్తముమీద అందరికీ క్షేమకరములైన పనులు చేయవలెనని అభిలాష ప్రజాస్వామికములో బలీయమై ఉండ డమువల్ల ఏకొద్దిమందిమాత్రమో ఉండే మహామేధావంతులవల్ల కలుగ తగినప్రయోజనము కలుగకపోవడము ఒకప్పుడు సంభవించవచ్చును. అందువల్లనే నూటికి నూరుపాళ్లూ ప్రజాస్వామికమే అని గర్వించే అమెరికాలో గడచిన నూటయాభైసంవత్సరాలలోనూ గొప్ప శిల్పులుగాని గాయకులుగాని విద్వాంసులుగాని బయలుదేరలేదు. అమెరికాకంటె హీనస్థితిలోనే ఉండి, అసలైన ప్రజాస్వామికరాష్ట్రాలు కానేకావని అపహాసింపబడిన యూరపుఖండదేశాలలోనే అంతకంటె చాలా ఘనులైనవారు పుట్టినారు.

ప్రజాస్వామ్యములో 'మెయిను' అన్నట్లు "ఏవిధమైన ఘనతా లేని అతిసామాన్యమైన అభిప్రాయాలే శాసనానికీ ధర్మానికీకూడా మూలసూత్రాలు అవుతూఉంటవి." "ప్రజాస్వామ్యములో అసమర్థు లైన నాయకులు ఎన్నుకోబడుతారు. ముఖ్యముగా అందుకనే ప్రజా స్వామ్యము పనికిరాదని", మెయిను పాసెట్టుగార్ల వాదము. రాజకీయ ములో ప్రజాస్వామ్యమంటే అధికసంఖ్యాకులపరిపాలన—జనబాహు ళ్యానికి వోట్లఅధికారము- ప్రజలదే రాజ్యము- శాసనాలనుబట్టి పరి పాలన. మొత్తానికి ప్రజాస్వామ్యములో స్వపరిపాలనా, స్వాతంత్ర్యా నికి భంగముకాని ప్రభుత్వపద్ధతీ, ముఖ్యసూత్రాలు- సామ్రాజ్యపద్ధ తిలో స్వపరిపాలనకు తావులేదు. కాబట్టి విదేశీయులచే పాలింపబడే పరాధీనదేశములో ప్రజాస్వామ్యము ఉండదు. ఉండడానికి అవకాశమూ లేదు. అందుకనే "ప్రజాస్వామిక సామ్రాజ్యపద్ధతి" అనేమాటలో

అర్థము లేదు."ప్రజాప్రభుత్వము"(Popular sovereignty) వంటిమాటలు ఒకపరమావధినిసూచింపవు. అవన్నీ ప్రజాస్వామ్యము సఫలము కావడానికి మార్గాలుమాత్రమే. ప్రజాప్రభుత్వమంటే సంఘములోని స్త్రీపురుషులసమూహానికి, అప్పటికిఅమలులోఉండే ప్రభుత్వమే సేవకులన్నమాట. జనబాహుళ్యానికి వోటులంటే, వయసువచ్చి చిత్తభ్రమణములేనట్టి ప్రతివ్యక్తీ తనతెలివితేటలూ అనుభవమూ సంఘానికి వినియోగించవచ్చునన్నమాట. అధికసంఖ్యాకుల ఇష్టానుసారముగా ప్రభుత్వమన్నంత మాత్రాన వారే ఎక్కువ బలము కలవాళ్లనిగాని, మేధావంతులనిగాని అభిప్రాయము కాదు. నిజానికి ఎల్లప్పుడూ అట్లా సంభవించకపోవచ్చును. కాని, మొత్తముమీద మానవజీవితానికి సంబంధించిన ప్రధానవిషయాలలో, ఎక్కువమంది అభిప్రాయప్రకారము నడుచుకుంటే, ఎక్కువ క్షేమకరమని నమ్మడానికి అవకాశమున్నది. దీనికి వ్యతిరేకముగా ఒకటి చెప్పుతారు. ప్రజాస్వామ్యసంఘములో స్వల్పసంఖ్యాకుల హక్కులకు సంరక్షణ లేదని వాదిస్తారు. అయితే 'బర్కు' అన్నట్లు స్వల్పసంఖ్యాకులు ఎన్నటికైనా అధికసంఖ్యాకులను తమవైపుకు త్రిప్పుకునేహక్కు ఉన్నది. అది వారివిధికూడాను. అట్లా త్రిప్పుకునేవరకూ అధికసంఖ్యాకులకు లోబడవలసినదే. ఈపద్ధతి కాకపోతే ఇప్పటి ఉత్తమసంఘాలతో న్యాయబద్ధమైన పరిపాలన సాగనే సాగదు. ఇటీవల జర్మనీలో ఏర్పడినరాజ్యాంగవిధానములో సంఖ్యాపరిమితినిబట్టి ప్రాతినిధ్యము (Proportional representation) ఇవ్వబడినది. రాష్ట్రములోని స్వల్పసంఖ్యాకులైన సంఘస్థులందరికీ తగినప్రాతినిధ్యము కలగడమే దీనిఉద్దేశ్యము. ఎక్కువ జనబాహుళ్యముమీద ఈపద్ధతి అవలంబిస్తే సఫలమవుతుందో లేదో ఇంకా చూడవలసి ఉన్నది.

ప్రాచీనకాలములో గ్రీసుదేశపు నగరరాష్ట్రములవంటి ప్రజాస్వామ్యములలో, రాష్ట్రవైశాల్యము తక్కువకావడమువల్లనూ, ప్రజలందరికీ అనేకవిషయాలలో సమానాభిప్రాయాలు ఉండడమువల్లనూ

తరుచుగా వ్యవహారాలు ఏకగ్రీవముగా తీర్మానించేవారు. ఇంగ్లండులో కూడా ఎనిమిదవహెన్రీకాలమువరకూ ప్రజాప్రతినిధిసభలో ఏకగ్రీవముగా తీర్మానిస్తేనేకాని, శాస్త్రీయములు కానట్టు ఎంచబడే కొన్ని వ్యవహారాలున్నట్లు అప్పటి రిపోర్టులను పట్టి తెలుస్తున్నది. 15 వ శతాబ్ది చివరవరకూ, మామూలు అధికసంఖ్యావోట్లు వచ్చినా, లేక మూడింట రెండువంతుల అధికసంఖ్య ఉన్నా, తక్కువసంఖ్యవారిని ఆతీర్మానాలు బాధింపచాలవని ఎంచుకునేవారు. ఈ కాలపురాష్ట్రాలలో, అనగా అతి క్లిష్టమైన ఆర్థిక సాంఘిక పారిశ్రామిక సమస్యలు కలవాటిలో, కేవలము సామాన్యపు అధికసంఖ్యవల్ల (Simple majority) తప్ప వేరువిధముగా పరిపాలనచేయడానికి వీలులేదు. ప్రాచీనసంఘాలలో ఏకగ్రీవముగా తీర్మానించలేకపోతే, వెంటనే బుర్రలు ఎగరగొట్టుకునేవారు. ఇప్పుడు ఆవిధముగా తలలు పగలకొట్టుకోడానికి బదులు తలలు లెక్కపెట్టి సభవారి నిశ్చితాభిప్రాయమును కనుక్కునేపద్ధతి పెట్టుకున్నారు. గ్రీకు రాజనీతిజ్ఞుడైనప్లేటో, "ధర్మప్రభువు" (Philosopher-King) ఒక్కడుండిపరిపాలిస్తే అత్యుత్తమమన్నాడు. అందుకు సందేహము లేదు. అట్టిధర్మమూర్తి దొరికితే అధికసంఖ్యాకుల ఇష్టానుసారముగా పరిపాలించేపద్ధతికంటే చాలాబాగానే ఉండవచ్చును. ప్లేటోకు ముఖ్యముగా ఒక్కసంగతి తోచింది. వ్యక్తిస్వాతంత్ర్యమును మరీ దూరము పోనిస్తే అరిష్టము కలుగుతుంది. అందువల్ల ప్రతివ్యక్తీ రాష్ట్రమనే ఉత్తమసంస్థకు లొంగేటట్టు చేయడము అవసరము. అంతేకాకుండా, కుటుంబమూ పారిశ్రామికశ్రేణీ మతసంఘమూ (చర్చి) మొదలైన ఇతర సంస్థలమీద పౌరుడికి ప్రత్యేకాభిమానము పెరుగకుండా చేయవలెను. ఇది ప్లేటోసూత్రము. ఈకాలపు ప్రజాస్వామికరాష్ట్రాలు చేయలేక పోయినది సరిగా ఈపనే. అయితే ప్లేటో చెప్పిన (ధర్మమూర్తియొక్క) పరిపాలనానిరంకుశత్వము మాత్రము కొందరు సాంఘికవాదులకూ సమష్టివాదులకూ బాగా నచ్చింది. ప్లేటోఅభిప్రాయాలనే ఈకాలపు స్థితిగతులకు తగినట్లు ఆచరించడానికి వారు యత్నిస్తున్నారు. ఈప్రయ

త్మాలఫలితమే ఒకవైపు ఇటలీలోని 'ముసొలొనీ' ప్రభుత్వము. ఇంకొక వైపు, రష్యాలోని "లెనిన్" "ట్రాట్స్కీ"ల ప్రభుత్వము. కాని ప్లేటోగారి "ధర్మమూర్తి"వలెనే, నీషీగారి "మానవోత్తము"నికూడా ఇప్పటి సంఘుస్థితిలో వెతికి కనిపెట్టడము కష్టము. కనిపెట్టినా, ఎల్లప్పుడూ అతనిప్రభుత్వమే సాగేటట్టుచేయడమూ కష్టమే.

ప్రజాబాహుళ్యముయొక్క కూడికయే ఆధునిక ప్రజాస్వామ్య రాష్ట్రమని చెప్పవచ్చును. తరుచుగా రాష్ట్రములో ఏకొద్దిమంది ఉద్యోగస్థులో, లేక అధికారము హస్తగతముచేసుకున్న సంపన్నులో, కూటముగా ఏర్పడి నడిపించేసంస్థగా మారిపోవడముకూడా కద్దు. హిందూదేశములో ప్రస్తుతపరిపాలన ఇట్టిఉద్యోగస్థులదే. వీరొక వైపునా జనసామాన్యమింకొకవైపునా ఉండడమూ,వీరు వారిమీద అధి కారమువహించడమూ సంభవిస్తుంటుంది. కాని రాజకీయమైన ప్రజాస్వా మ్యములో యావన్మందిపౌరులకూ సంబంధించిన సంస్థయే రాష్ట్రము కాగలదు. పౌరులందరూ కలిసి తాముచేసుకున్న శాసనాలకే బద్ధులు కాని వేరువిధముగా ఇతరులకు లొంగిపోకూడదు.

1867 సం॥ నకుపిమ్మట ఇంగ్లండుదేశములో వోట్లఅధికా రము కలవారిసంఖ్య అపారమై పోయినది.1867 సం॥లో ఈవిషయమై 'డిజ్రయెలీ' ప్రధాని ఏర్పరచినసామాన్యచట్టమే "కళ్లుమూసుకుని చీకట్లో దూరినవిధ"మని అతను వర్ణించాడు (ఈమార్పువల్ల ఉత్తరో త్తరా ఏమి జరుగబోతుందో అతనికే సరిగా తెలియడంలేదని దీని భావము.) 1867 సం॥ లో జనసామాన్యానికీయబడ్డ పరిమితమైన వోట్ల అధికారముచూస్తేనే, అప్పటి పరిపాలకవంశాలవారికి భయము వేసింది. ఇప్పటికి వారికి కొంత సంగతిసందర్భాలు తెలిసివచ్చినవి. అందు వల్లనే ఇటీవల 1918 సం॥ లో సర్వసామాన్యముగా వయసువచ్చిన ప్రతివ్యక్తికీ వోటుఅధికారము కలుగచేసే పద్ధతికి కూడా పార్లమెంటు వారు ఒప్పుకోవడము తటస్థించింది. పరిపాలక తరగతులలోనివారికి అను భవమువల్ల ఒక్కసంగతి బోధపడ్డది. రాజకీయములలో కార్మికుల

(కూలివాళ్లు) ఉద్యమము కేవలము గొర్రెలమంద వ్యవహారముగా ఉన్నంతవరకూ దానివల్ల తమకేమీ ప్రమాదములేదని తెలిసింది. అందు కనే రాజకీయకక్షుల కట్టుబాట్లూ వాటిహంగూ పత్రికలూ ఉపన్యాస వేదికలూ ఇవన్నీ. గొర్రెలమందతత్త్వమును పురికొల్పి స్థిరపరచడానికే పరిపాలకవర్గమువారు యత్నిస్తున్నారు. గ్రుడ్డితనమూ ఉద్వేగమూ అస్థిరత్వమూ హ్రస్వదృష్టీ ఎవరేదిచెప్పినా నమ్మడమూ వివేచనా శూన్యతా ఈతత్త్వములో ప్రధానవిషయాలు. ప్రజానాయకు లనిపించు కునేవాళ్లు ఏవిధముగా ఇంగ్లాండు అమెరికాదేశాలలో ఈతత్వాన్ని తమ ఇచ్ఛానుసారముగా ఉపయోగించుకుంటారో ఎన్నికలు జరిగే రోజులలో ఉండి చూస్తే, ఆగంతుకులైన విదేశస్థులకుకూడా తెలుస్తుంది.

ఎన్నికలూ పార్లమెంటులో ప్రాతినిధ్యమూ శాసననిర్మాణమూ ఇవన్నీ నామమాత్రాలని ఎంతవాదించినా, మన మొకముఖ్య విషయమును గమనించాలి. ఆధునికరాష్ట్రాలలో పరిపాలనాతంతు పెరిగిపోయినకొద్దీ అసలు పరిపాలనాధికారము అంతకంతకు "సిడ్నీ వెబ్బు" అన్నట్లు ఆయా ఉద్యోగస్థుల హస్తగత మవుతున్నది. పార్ల మెంటులో అన్నివిషయాలనూ సంపూర్ణముగా చర్చించడానికి సావ కాశము లేకపోబట్టి, ఇప్పటిశాసనాలలో చాలాభాగము కేవలము పై ఆకారమును మాత్రమే నిర్ణయిస్తున్నవి. అందులో చేర్చవలసిన ముఖ్యవిషయాలన్నీ ఆచరణలోకి రావడానికి రాజుగారి ఆలోచనా సంఘముగాని, ఆయాశాఖల ప్రధానోద్యోగులుగాని ఏవో ఉత్తరు వులు అప్పటప్పటికి ఇస్తూ ఉండవలసినదే. ఇందువల్లనే హిందూదేశ ములో శాశ్వతోద్యోగులైన సర్కారుకార్యదర్శులూ (సెక్రెటరీలు) ఇతర ఉద్యోగులూ తెరచాటునుండి తంతు నడిపించడమూ, శాసన సభలూ అనుభవముచాలనిమంత్రులూ వారి వలలోనుంచి తప్పించుకో లేకపోవడమూ, మనము చూస్తున్నాము. అమెరికా సంయుక్తరాష్ట్ర ములూ స్విట్జర్లాండూ కొన్నినూతనపద్ధతులను అవలంబిస్తున్నవి. శాసనసభలు ఉంటుండగానే ప్రజలు తమంతటతామే ప్రత్యక్షముగా

శాసనాలు చేయడమూ (initiative); శాసనసభలో తీర్మానింపబడ్డ శాసనాలనే మళ్లీ ప్రజలవోటుకు పెట్టి వారికి అంగీకారమో అనంగీకారమో తెలుసుకోవడమూ (referendum); శాసనసభలో తమ ప్రతినిధిచేసేపనులు తమకు అయిష్టమైతే వోటర్లు అట్టిప్రతినిధినిలో పని నుండి తొలగించడమూ (recall); మొదలైనవి ఎన్నతగ్గవి. ఇంత చేసినా, ప్రజాభిప్రాయము సంపూర్ణముగా ఆదేశాలరాజ్యాంగములో వ్యక్త మవుతున్నదని చెప్పడానికి వీలులేదు. ఎన్నికదార్లు (వోటర్లు) తగినంత విద్యావంతులు కాకపోవడమూ, తమఅభిప్రాయము చెప్పవలసిందని అడిగిన విషయాలలో వారికి తగిన శ్రద్ధా ఆసక్తీ లేకపోవడమూ ఇట్టిస్థితికి ముఖ్యకారణాలు. కాని ఇట్టినూతనపద్ధతులవల్ల కొంతమట్టుకైనా లాభము కలిగింది. ప్రత్యక్షముగా ప్రజలే శాసనాధికారము చెలాయించడానికి అవకాశము కల్పించడమువల్ల శాసనసభ్యులూ, కార్యనిర్వాహకులైన అధికారులూ, అక్రమముగా ప్రవర్తించకుండా కాపాడవచ్చును. ప్రజాస్వామ్యపరిపాలనాపద్ధతిలో గల లోటుపాటులన్నీ సవరించడానికి ఇవే సిద్ధౌషధాలని కొందరుచేసినవాదము మాత్రము నిరాధారమని తేలింది.

కాబట్టి ప్రజాస్వామ్యము సఫలముకావడానికి మొట్టమొదట కావలసినది ఇంకాదివ్యమైన పవిత్రమైన విద్యయే. దీనినే సర్ ఫలియం మారిస్ "మనయజమానులకు (అనగా వోటర్లకు) చదువు చెప్పడము" అన్నాడు. పశ్చిమయూరపు ఖండములోనూ అమెరికాలోనూ ప్రజాస్వామ్యము విఫలమవడానికి అన్నిటికంటే ఈవిద్యావిహీనతయే కారణము. విద్య లేనందువల్లనే వేర్వేరు తరగతులవారికీ కులాలవారికీ భేదాలు ఏర్పడడమూ, వారు ఎల్లప్పుడూ దెబ్బలాడుకోవడమూ, సంభవించింది. మనదేశములో పుట్టుకవల్లనే ఏర్పడ్డ కులభేదాలున్న సంగతి మనకు తెలుసును. ఇక యూరపు అమెరికాలలో కేవలము ఆర్థిక సంబంధమైన స్థితిగతులవల్ల ఏర్పడ్డ అంతరములు ఉన్నవి. వారిపోట్లాటలు మన కులకలహాలకు ఏమాత్రమూ తీసిపోవు. 'ఎర్నెస్టుబార్కరు' 1915 లో ఒకవ్యాసము వ్రాస్తూ ఈఅభిప్రాయమునే సూచించాడు. "బర్ట్రాండు రస్సెలు" "స్వాతంత్ర్యానికి మార్గాలు" అనే గ్రంథములో ఈవేర్వేరు తరగతుల మధ్య ఏర్పడ్డ సమరానికి నివారణోపాయాలను గూర్చి వ్రాశాడు.

19 వ శతాబ్దపు చివర యాభైసంవత్సరాలలో, పెట్టుబడిదార్లైన ధనికులకూ కార్మికులకూ (కూలివాళ్లకు) తగాదాలు పెరిగిపోయినవి. అందువల్ల రాజ్యములో ప్రాంతాలవారీగా ఇంతింతమంది ప్రతినిధులని ఏర్పడ్డపద్ధతి అంటే అసంతృప్తి కలిగింది. అప్పటినుంచీ ప్రాంతాలనుబట్టి కాకుండా, తరగతులను బట్టిగాని, వృత్తులను బట్టిగాని, ప్రాతినిధ్యము కావలెనని ఒక నూతనవాదమును 'కోలు' 'లాస్కీ' మొదలైన సాంఘికవాదులు లేవతీశారు. ఈపద్ధతిలో పారిశ్రామికశ్రేణులకూ వృత్తిసంఘాలకూ ప్రత్యేకప్రాతినిధ్యము ఉంటుంది. ఈసూత్రమును అనుసరించే, రషియాలో సోవియటురాజ్యాంగమున్నూ, కొంతవరకు నవీనజర్మనీరాజ్యాంగమున్నూ ఏర్పరచబడ్డవి. వీటిలో వేర్వేరు ఆర్థికప్రయోజనాలు (interests) కలవారికి వేర్వేరు ప్రాతినిధ్యమున్నది. ప్రాంతాలవారీగానే ప్రాతినిధ్యమిచ్చేపద్ధతి ఇంకా అమలులో ఉంచుకున్న రాష్ట్రాలవారిని ఈనూతనపద్ధతివారు అదేపనిగా ఆక్షేపిస్తున్నారు.—ఈఆక్షేపణ ఎంతవరకు ఫలించిందంటే (ప్రాంతాలవారీగా) ప్రజాప్రతినిధిసంస్థలకు మూలకందమని అనుకునే ఇంగ్లండులోకూడా ప్రభువులసభను ఈనూతనపద్ధతిగా సంస్కరింపవలసిందని సూచనలు బయలుదేరినవి.— అతిక్లిష్టమైన ఆర్థికనిర్మాణముగల ఆధునికరాష్ట్రాలలో కేవలముప్రాంతాలనుబట్టిప్రాతినిధ్యమివ్వడమువల్ల ప్రయోజనము లేదనీ, పదార్థాలను ఉత్పత్తిచేసేవారికీ వాటిని ఉపయోగించుకునేవారికీ, పెట్టుబడిదార్లకూ కార్మికులకూ, వ్యవసాయదార్లకూ పారిశ్రామికులకూ, ఎవరికితగిన ప్రాతినిధ్యము వారికి ఈపద్ధతివల్ల ఏర్పడదనీ నవీనసిద్ధాంతము. ఈపోరాటమును మాన్పడానికి రస్సెలు ఒకఉపాయము చెప్పాడు. రాజ్యమంతా సమానాధికారముగల రెండువర్గముల క్రింద చీల్పమంటాడు. ఒకవర్గములో పదార్థాలను వినియోగించేవాళ్లూ, రెండోదానిలో ఉత్పత్తిచేసేవాళ్లూ ఉండవలెనంటాడు. ఏదోవిధముగా, రెండోవర్గమువారి నిరంకుశత్వము ప్రబలకుండా మొదటివారు కాపాడుకోవచ్చునట. ఇది చాలా అవకతవక వ్యవహారము. రాజ్యమును చెరిసమానముగా అధికారముగల రెండువర్గాలుగా చీల్చడమువల్ల అరాచకము తప్పక సిద్ధిస్తుంది. అకస్మాత్తుగా వచ్చే అవాంతరాలన్నిటినీ దాటగల మహాశక్తి రాజ్యములో ఏదోఒక్కసంస్థలో లేకపోతే, నిరంతరమూ

పోరాటమే ఉంటుందని చరిత్ర చదివినవాళ్లకు బాగా తెలుసును. అసలు యూరపుఖండచరిత్రలోనే ఒకవైపు రాజకీయాధికారమూ ఇంకొకవైపు మతాధికారమూ ఉండి, పౌరుల మనస్సునూ అభిమానాన్నీ అటూఇటూ లాగడమువల్ల అనేక ఆపత్తులు సంభవించినవి. హిందూదేశములో ఈస్థితే ఇంకా నిలిచి ఉన్నది. మతసంబంధమైన మూఢసిద్ధాంతాలవల్లనే మనరాజకీయాభివృద్ధికి పెద్దఆటంకము వచ్చింది. మనకు ప్రజాస్వామ్యము సిద్ధించకపోవడానికి ఇప్పటికీ ఇదే గొప్పఇబ్బంది. యూరపు అమెరికాలలో సర్వమతసమానమనేది ప్రజాస్వామ్యానికి మూలసిద్ధాంతము. మనదేశములోఅది ఇంకా కుదరలేదు. అది స్థిరపడేవరకూ మనకు ప్రజాస్వామికమైనరాజ్యాంగము రాదేమోనని సంశయించవలసిందే.

పాశ్చాత్యదేశాలలో ప్రజాస్వామ్యానికి శత్రువులు మూడు. (1) సైనికబలము (2) సామ్రాజ్యకాంక్ష (3) పెట్టుబడిదార్ల పలుకుబడి. ఆదేశాలలో ఇంతవరకూ కేవలము రాజకీయములోమాత్రమే ప్రజాస్వామ్యము సంపాదించారు. సాంఘికముగానూ పారిశ్రామికముగానూ కూడా ప్రజాస్వామికము ఏర్పడకపోతే, రాజ్యానికి శాశ్వతమైన కుదురుబాటు ఉండదు. ఎప్పుడోఅప్పుడు పేరుకు సర్వాధికారాలూ ఉన్నా రాష్ట్రమనే మహాసంస్థ కూలిపోతుంది. ఒక్కసందర్భములో రాజకీయప్రజాస్వామ్యానికీ పారిశ్రామికప్రజాస్వామ్యానికీ దగ్గర సంబంధ మున్నది. ఆధునిక రాష్ట్రము నిర్వహించే కొన్నికార్యాలు ఆర్థిక సంబంధమైనవి. పన్నులు, తపాలాఫీసు, రైళ్ళు (హిందూదేశము వంటివాటిలో) కొంతవరకు ఆర్థికమే. ఇట్టిఆదాయమున్నంత మాత్రాన రాష్ట్రము ఆర్థికసంస్థగా మారిపోక పోవచ్చును. అయినా ఆర్థిక సంబంధముమాత్రము ఉంటున్నది. పారిశ్రామికసంక్షోభమువల్ల కలిగే దురాగతాలను గుర్తెరగడమువల్లనే ప్రజాస్వామ్యాదర్శము స్పష్టమవుతున్నది. ఈదురాగతాలలో మొదటిది నిరుద్యోగ సమస్య. పారిశ్రామికవిషయాలలో ఉన్నతస్థితియందున్న ఇంగ్లాండు వంటి దేశాలలో దీనివల్ల గొప్పవిపత్తు వచ్చేటట్లున్నది. కూలిదొరకక పోవడమువల్ల ఎప్పుడూ కడుపునిండా కూడులేక, కట్ట గుడ్డలేక, అల్లాడిపోయే స్త్రీపురుషులూ, వారిపిల్లలూ మంచిపౌరులు కాజాలరు. హిందూదేశములో కోట్లకొద్దీ స్త్రీపురుషులకు గొడ్లకున్న తిండికూడా

లేకపోతున్నది. యజమానులు లేకపోవడమే దీనికి కారణము. ఆవులకూ గుఱ్ఱాలకూ యజమానులు లేకుండా ఎవరుపడితే వారు వాటిని ఉపయోగించుకోగలిగితే ఏమవుతుంది? ప్రతినాగరక రాష్ట్రములోనూ అసంఖ్యాకులైన జనులకు ఆగతే పట్టింది. ఈవిపరీతమైన ఆర్థిక స్థితివల్ల అస్థిరత్వమనే రాజకీయారిష్టము సంభవిస్తున్నది. కార్మికులైన స్త్రీపురుషుల బ్రతుకంతా యజమానులచేతిలో ఉంటుంది. అనుక్షణమూ వర్తకము బాగాసాగడము లేదనో, లాభాలు సరిగా రావడములేదనో, నెపముమీద వారిని పనిలోనుండి తీసివేసి నిరుద్యోగస్థితిలోకి దింపుతారనేభయము. ఇట్టివిపరీతమైన చంచల స్థితిలో ఉండేవాళ్లు మంచిపౌరులు కావడము ఎట్లా? ఆర్థికముగా వీరు ఇతరులమీద ఆధారపడి ఉంటారు. బానిసత్వానికీ దీనికీ అంతగా భేదములేదు. వారిలో మానుషమూ వివేచనాశక్తీ బాధ్యతా పెంపొందడానికి అవకాశమే లేదు. అందుకనే వీరిస్థితిని బాగుపరచడానికి పాశ్చాత్యదేశాలలో మంచిపలుకుబడిగల కార్మికసంఘాలు బయలుదేరినవి. వీటివల్ల ప్రతివ్యక్తికీ ఎక్కువ స్థైర్యము కలుగుతుంది. కూలికూడా సామాన్యముగా బజారులో ఇతరపదార్థలతోపాటు అమ్మే కొనే వస్తువను అభిప్రాయమును తొలగించడము వీటిఉద్దేశాలలోఒకటి. ఈఅభిప్రాయమును నశింపుచేస్తే, ప్రజాస్వామ్యాదర్శమును అంగీకరింపచేసినట్లే. ఈకార్మికసంఘాల ప్రయత్నాలే కాకుండా అసలురాష్ట్రప్రభుత్వముకూడా జోక్యము కలిగించుకోవడము అవసరమని అభిప్రాయము ఏర్పడ్డది. పిల్లలూ పెద్దవాళ్లూ పౌరసత్వానికి పనికిరాకుండా పోతుంటె రాష్ట్రప్రభుత్వము చూసి ఊరుకోవడ మెట్లా? వ్యక్తిస్వాతంత్ర్యమనే నెపముమీద అతివిపరీతమైన పారిశ్రామికనిరంకుశత్వము ప్రబలిపోయింది. ఒకఅమెరికా గ్రంథకర్త అన్నట్లు "పారిశ్రామికముగా, అమెరికాసంయుక్తరాష్ట్రములు * ప్రష్యియన్ పద్ధతిలో పడిపోయినవి." రాష్ట్రములోని పౌరులకూలిని ఆర్థికఅవసరములకు

* యుద్ధానికి పూర్వము జర్మనీసామ్రాజ్యములో ప్రష్యయూ ప్రధానభాగము. జర్మనీవారు పశుబలమునే ఉపాసిస్తారనీ, కేవలము రాక్షసులనీ, మిత్రమండలివారు చాటించేవారు. ప్రష్యయా నిరంకుశత్వానికి పెట్టిందిపేరని అనుకోవడము పరిపాటి అయినది. కో॥ రా॥

ఎంతవరకు ఉపయోగించవచ్చునో నిర్ణయించి ఒకహద్దు ఏర్పరచడము రాష్ట్రపాలకులవిధి. అందువల్లనే కొన్ని సంవత్సరాలనుంచీ అంతర్జాతీయ కార్మిక మహాసభల పలుకుబడివల్ల హిందూదేశములో ఫ్యాక్టరీ చట్టములు ఏర్పడ్డవి. పిల్లలకు నిర్బంధోచితవిద్య నేర్పడముతోనే రాజ్యాదాయములోనుంచి బడిపిల్లలకు తిండిపెట్టడముకూడా వచ్చింది. ఈపనులన్నీ రాజకీయప్రజాస్వామ్యముకొరకే దానిపేరుమీదుగానే జరుగుతున్నవి. పూర్వము 'రాష్ట్ర' మంటే 'మంచికార్యాలుజరగడానికుండే అభ్యంతరాలు తొలగించేసంస్థ'అని 'గ్రీను' నిర్వచనము చేశాడు. కాని ఈరోజులలో అంతమాత్రముతో సరిపోదు. పౌరులమంచిచెడ్డలూ నైతికాభివృద్ధీ చక్కగా కనిపెట్టి వాటికొరకు కష్టించి పనిచేయవలసిన బాధ్యతకూడా రాష్ట్రపాలకులదే. 'ధర్మ'మన్నా 'శాసన'మన్నా 'నేరస్థులను అదుపులో ఉంచి శిక్షించడమే' అనుకునే రోజులు పోయినవి. నిజమైన స్వేచ్ఛను ప్రసాదించి కాపాడడము నిమిత్తమే శాసనము ఏర్పడ్డది. హక్కులు శాసనమువల్ల వచ్చినవి. 'హాబ్‌హౌసు' వాదించినట్లు సంఘానికీ రాష్ట్రానికీ భేదమున్నమాట నిజమే. కాని అదంత ఖచితమైన భేదమని చెప్ప వీలులేదు. రాష్ట్రముకూడా ఒకవిధమైన సంఘమే. కాని రాష్ట్రము ఉత్తమోత్తమమైన సంఘము; అతివిశాలమై, సర్వవ్యాప్తమైన సంఘము. కాబట్టి రాష్ట్రము సంఘమును తనలో ఇముడ్చుకున్నది. అందువల్ల ఒకవిధముగా రాష్ట్రమూ సంఘమూ ఒకటే అయిపోతున్నవి. రాష్ట్రము అన్నిటినీ తనలో ఇముడ్చుకున్న మహాసంస్థకాబట్టి, కుటుంబమూ పారిశ్రామికశ్రేణీ మతసంఘమూ మొదలైన చిన్నచిన్నసంస్థలను కాపాడి వాటికి వ్యక్తులవల్లకాని, బలవత్తరములైన ఇతరసంఘాలవల్లగాని, అపాయమురాకుండా కాపాడవలెను. ఇటలీలోని 'ఫాసిస్టు' వాదాలే ఇప్పుడు బ్రిటీషుపార్లమెంటులో చర్చకువచ్చిన పారిశ్రామికశ్రేణులచట్టానికి(trade union bill)కారణభూతమైనవి.

పెట్టుబడిదారులైన ధనికుల ప్రాబల్యమేకాక, సైనికబలమూ నౌకాదళమూ సామ్రాజ్యపద్ధతికి సహాయభూతముగా ఉంటున్నవి. ఈసామ్రాజ్యపద్ధతికీ ప్రజాస్వామ్యపద్ధతికీ పరస్పరవైరుధ్యము మున్నది. ప్రజాస్వామికములో ప్రధానసూత్రము స్వయంనిర్ణయము- స్వపరిపాలనము. సామ్రాజ్యపద్ధతిలోనో, ఎన్నికబుర్లు చెప్పి కప్పిపుచ్చినా, సామ్రా

జ్యానికి స్వపరిపాలనము లొంగిపోవడమే సూత్రము. ఒకటి స్వాతంత్రానికీ, వేరొకటి ఆధిపత్యానికీ, మార్గాలు. ఈ రెంటికీ సమన్వయం ఎన్నటికీ కుదరదు. రాజకీయవిషయాలలో మూలసూత్రాలలోనే గల భేదాభిప్రాయాలనుబట్టి ఈ రెండుపద్ధతులూ ఏర్పడ్డవి. ఇదివరలో చెప్పినట్లు "ప్రజాస్వామికమైన సామ్రాజ్యపద్ధతి'' అసంభవము. ప్రజాస్వామ్యమంటే కేవలము ఒకవిధమైన పరిపాలనాపద్ధతిమాత్రమే కాదు. సాధారణముగా "పరిపాలన" స్వేచ్ఛకు భంగకరమే; కాని ప్రజాస్వామ్యములో పరిపాలనకూ, స్వేచ్ఛకూ సమన్వయము కుదిరింది. ఇక సామ్రాజ్యపద్ధతి స్వేచ్ఛను నాశనము చేస్తుంది. స్వేచ్ఛ ననుభవించే ఒకజాతి ఇతరజాతులను వశపరుచుకుని వారిపైన ఆధిపత్యము వహించడమువల్లనే ముఖ్యముగా అట్టిపరిపాలకజాతియొక్క స్వేచ్ఛకూడా నశింపు కావడానికి అవకాశ మున్నది. ప్రతివాడికీ తాను స్వేచ్ఛఅనుభవించడముకంటే కూడా ఇతరులమీాద అధికారము చెలాయించడమందే అభిలాష ఎక్కువ. ఈమాట 'మిల్లు' చాలాకాలము క్రిందటనే అన్నాడు. అవకాశ మున్నకొద్దీ అన్నిజాతులకూ మొత్తముమీాద ఇతరులను లోబరుచుకోవలె ననే కాంక్ష ఉంటుంది. అందరూ తాము ఇతరులను జయించడము వాళ్లమేలుకొరకే నని నమ్ముతున్నారు. శ్వేతజాతులు ఈ విధముగా కష్టపడి రాజ్యాలు జయించి, ప్రపంచమును ఉద్ధరించి, ఈ మహాభారమంతా మోస్తున్నామని అంటారు. కాని అట్లా అనుకోవడములో "సుపరిపాలన మెన్నటికీ స్వపరిపాలనకు సాటికా దని" పూర్వపు ఆంగ్లప్రధాని 'బానర్మన్' సూక్తిని పీరు మరుస్తున్నారు. 18 వ శతాబ్దములో ఇగ్లండులోని ఉదారవాదులు చెప్పినట్లు ఒకచెంప ఇతరదేశీయుల స్వాతంత్ర్యమును అణచివేస్తూ, ఇంకొకవైపున స్వదేశములో తమస్వాతంత్ర్యమును కాపాడుకోవడము అసంభవము.

పైచర్చవల్ల తేలినసారాంశ మేమంటే, ప్రజాస్వామ్యానికి కొన్ని ప్రధానమైన ఆటంకా లున్నవి. ప్రజలకు సరియైన విద్య లేకపోవడమూ, సైనికబలమూ, నౌకాబలమూ, ధనికుల ఆధిక్యమూ, అన్నీ ఇందులో చేరినవే. కొన్నిరాష్ట్రాలలో రాజకీయమైన ప్రజాస్వామ్యము ఏర్పడినా సాంఘికముగానో పారిశ్రామికముగానో ప్రజాస్వామ్యము కుదరలే దనికూడా గమనించాము— ఇందువల్ల రాజకీయప్రజాస్వామ్య మున్నచోట్లకూడా ఈఅభ్యంతరాలవల్ల, అందులో ముఖ్యముగాధని

కుల ఆధిపత్యమూ, సామ్రాజ్యకాంక్షా-వీటివల్ల పౌరులకు సరియైన న్యాయము జరగడము లేదు. ప్రజాస్వామ్యానికి ఈవిధముగా ఏర్పడిన శత్రువులను నాశనముచేయడానికే రషియాలోని సోవియట్టురిపబ్లికువారు ఇప్పటిపద్ధతిలోని ఇబ్బందులను తొలగించి క్రొత్తపద్ధతులను అమలులో పెట్టి చూస్తున్నారు. ఇంతవరకూ వారిప్రయత్నము సఫలమైనట్టు కనుపడదు. అయినప్పటికీ, రాజకీయములోనూ పారిశ్రామికవ్యవహారాలలోనూ గల గొప్పలోప మేమిటో వీరు కొంత కనిపెట్టినారని ఒప్పుకొనక తప్పదు. వ్యక్తుల స్వలాభమునిమిత్తము ప్రజల శక్తిసామర్థ్యాలను ఎవరో పెట్టుబడిదార్లు తమఇచ్చవచ్చినట్లు ఉపయోగించుకోవడమే అసలు అనర్థమని వీరు చెప్పుతారు.అంతవరకు నిజమే; కాని ఆర్థికములు కాని ఇతరసందర్భాల ప్రాబల్యమును వీరు గ్రహించక, కేవలము ఆర్థికవిషయమునే నొక్కి చెప్పడమువల్ల ఈసిద్ధాంతము కేవలము సత్యముకాదు. ఈబాధలకంతా ఒకటే నివారణోపాయ మున్నదని నాకు తోస్తున్నది. రాష్ట్రప్రభుత్వము ఈవిషయాలలో తటస్థులుగా ఉండకుండా, జోక్యము కలిగించుకుని, రాష్ట్రపక్షమున పరిశ్రమలు సాగించి, సర్వవ్యవహారములూ చక్కబెట్టి ఏదో స్వరూపములో రాష్ట్రీయసమిష్టివాదము (state socialism) ఆచరణలో పెట్టవలెను.

ఎటుతిరిగీ, మనశీర్షికలో ఉన్న అసలుప్రశ్నకు వచ్చాము. ఈనాటి స్థితిగతులలో ప్రజాస్వామ్యము సాగించడానికి వీలున్నదా? లేకపోతే ఒకవైపున 'బొల్షెవిజమూ' ఇంకొకవైపున 'ఫాసిస్టు' సిద్ధాంతమూ, ప్రబలిఉన్న ఈకాలములో ఎప్పటివలె ప్రజాస్వామ్యసిద్ధాంతాలనే నమ్ముకుని ఉండడము కేవలము భ్రమకాదా ? ఈప్రశ్నకు జవాబు ఒక్కటే. వేరొకటి ఉండజాలదు.

ఒకవంశమువారు తమమేలుకొరకే రాజ్యముచేయవచ్చును. ఒకతెగవారుకూడా అట్లే తమతెగమేలునే కాంక్షించి పరిపాలింపవచ్చును. ఈరెండుసందర్భాలలోకూడా పరిపాలకవర్గానికిబయటనున్న వారిక్షేమముకు భంగము కలుగుతుంది. కాని, అదేవిధముగా ప్రజలే తమక్షేమమునే అభిలషించి పరిపాలిస్తే, అప్పుడు ఎవరిప్రయోజనాలు (niterests) వదలివేసినట్లు? కొన్నికొన్ని రాష్ట్రాలలో ప్రజాస్వామిక పరిపాలనావిధానములో ఏలోటుపాటులున్నా ప్రజాస్వామ్యమనే ఆద

ర్శము మాత్రము స్వతంత్రులోతులకూ పరాధీనజాతులకూ కూడా ఉత్తే జము కలిగింపక మానదు. వేర్వేరు రాజకీయసంస్థల పరస్పరసంబంధ మును నిర్ణయించడానికి నానాజాతిసమితి వంటి నూతనసంఘములకు ఈఆదర్శము మార్గద్యోతకమైన వెలుగువలె ఉన్నది. దీనిలో ఇంకొక మహత్తు ఉన్నది. ఇది వ్యక్తిస్వాతంత్ర్యవాదమువలె వ్యక్తులకుమాత్రమే ఆదర్శము కాదు. జాతీయవాదమువలె పరిమితసంఘమునకే ఆద ర్శమునూ కాదు. ఇందులో అన్ని ఉన్నతాదర్శాలూ గర్భితమై ఉన్నవి. ఎందుకంటే తక్కినరాష్ట్రాలతోనూ జాతులతోనూ కల సంబం ధము ప్రజాస్వామ్యసిద్ధాంతాలమీాద ఆధారపడక పోయినట్లయితే ఏరాష్ట్రముగానీ జాతిగానీ ప్రజాస్వామ్యమును అంతరంగిక విషయా లలో నిలుపుకోజాలదు.

మానవజాతి యొక్క వికాసపరిణామములలో ప్రజాస్వామ్యమే తుదిమెట్టు కాదు—కాని, ప్రపంచమంతా ఆవరించిన ఉత్తమరాష్ట్రానికి గాని (world-state), లేక వివిధరాష్ట్రసమ్మేళనకు గాని ప్రజాస్వా మ్యము దాటిచూపు నని నమ్మవచ్చును, అట్టి సమ్మేళనములో జాతీయ భావములోనున్న ఉత్తమాశయములన్నీ పరిపక్వదశ పొందవ చ్చును. అమెరికాసంయుక్తరాష్ట్రములూ, బ్రిటిషుసామ్రాజ్యమూ, అట్టిసమ్మేళన మెంత ఫలప్రదముగా నిర్వహింపవచ్చునో తెలిపే ప్రత్యక్ష నిదర్శనాలు. అట్టి ఉత్తమమైన సర్వరాష్ట్ర సమ్మేళనము సిద్ధింప చేయవలెననే పూనిక ఉండవలెను. ఆర్థికముగా లాభకరమైనదానికంటే నైతికముగా ఉత్తమపథమని తోచినదానినే అవలంబించవలె ననే ఆసక్తి ఉండవలెను. ఇవిరెండూ ఉన్నట్లయితే నానాజాతిసమితి సజీవమై ప్రత్యక్ష మవుతుంది. అప్పుడు ప్రజాస్వామికానికి ప్రబలశత్రువులైన సామ్రాజ్యకాంక్షా, ధనికుల ఆధిక్యతా. అచిరకాలముననే—అవి ఇదివర కెప్పుడో నశించవలసింది— భూస్థాపితము కావచ్చును.

లక్నో. వంగల శివరామ్

అలవాటు : ఆలోచన

శ్రీ గోపరాజు రామచంద్రరావుగారు, ఎం, ఏ

(అధ్యాపకులు, ఆనందకళాశాల, కొలంబో)

మనస్సుకు నచ్చినపని చెయ్యవచ్చు. కాని అన్నిపనులూ మనకు తెలిసే చేస్తున్నామా? నడిచేటప్పుడు కాలుతీసి కాలువేస్తున్న సంగతి మనకు తెలియనే తెలియదు. తప్పటడుగులు వేసేటప్పుడు మాత్రం చిన్నపిల్లలు చాలా జాగ్రత్తగా ఆలోచించి అడుగుతీసి అడుగు వేస్తారు. అంతకంతకు నడక అలవాటవడంచేత మనస్సు దానిమీద వుంచకపోయినా పని జరిగిపోతుంది.

బడిలో ప్రశ్నకు జవాబు చెప్పగానే పిల్లవాడిని "కూర్చో" అనడం ఉపాధ్యాయులకు అలవాటు. స్నేహితుడిల్లు తెలియక వెతుకుతుండే ఒక ఉపాధ్యాయుడు రోడ్డుమీద బడిపిల్లవాడు కనబడగానే "అబ్బాయి! సైన్సుమేష్టరుగారిల్లు ఎక్కడ"ని అడిగాడు.

"ఆమేడ అవతలి దండీ"

"సరే, కూర్చో"

రోడ్డుమీదనేనా కూర్చోడం? కాదు. ఈమాట అలవాటులో పొరబాటు.

బజారులో "మేక" అనగానే ఒళ్లో ఏమున్నదీ ఆలోచించక లేచే దుకాణదార్లని చాలామందిని చూచాము. అలాగే అలవాట్లన్నీ మంచికైనా, చెడ్డకైనా, అభ్యాసం చేసుకునే టప్పుడే జాగ్రత్తగా ఆలోచించాలి. కాఫీ టీ నాటకాల అలవాట్లు ఇదే పద్ధతి.

మన జీవయాత్ర అంతా అలవాట్లతోనే నిండివుంది. పొద్దున లేస్తే పడుకునే వరకూ చేసే పనులు మూడువంతుల ముప్పాతిక అలవాట్లు. వ్రాయడం చడవడం మాట్లాడడం మనులుకోవడం అన్నీ అలవాట్లే. ఇటువంటి అలవాట్లని రిఫ్లెక్సు పనులు (Reflex actions) అంటారు. ఈరిఫ్లెక్సుపనులతో మనస్సుకు సంబంధంలేదు. రిఫ్లెక్సు పనులు అవుతున్నట్లు చాలామట్టుకు మనస్సుకు తెలియనే తెలియదు. కొన్ని కొన్ని ముఖ్యమైన పనులకే మనస్సు ఆలోచిస్తుంది. మనస్సు గొప్ప బ్యాంకు ఏజంటు లాంటిది. చిన్న చిన్న వ్యవహారాలు, వసూళ్లు, ఖర్చులు ఏజంటుకి తెలియకుండానే అవుతవి. కాని ఈచిన్న పనులు కూడా మొట్టమొదట ఒకపద్ధతిలో పెట్టేవాడు ఏజంటే. తరువాత అలవాట్ల ప్రకారం చిన్నపనులు జరిగిపోతవి. అందులో ఏదైనా అవక తవక వస్తే ఏజంటుకి తెలుస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు కూడా ఏజంటే ఆలోచిస్తాడు. అలాగే జీవితకర్మలు చాలామట్టుకు అలవాటుతో అయిపోతవి. మనస్సుకి మాత్రం కట్టుపెత్తనం. ఈఅలవాట్లు పద్ధతిలో పెట్టడంకూడా మొదట మనస్సే చేస్తుంది.

పనులు అన్నీ రెండు విధాలు. మనస్సుకి తెలియకుండా చేసే పనులు అలవాట్లు (రిఫ్లెక్సు పనులు). మనస్సుకి తెలిసి చేసేపనులు ఆలోచనలు. ఇందులో ఆలోచనలకన్న అలవాట్లు హెచ్చు. కాని అలవాట్లు అన్నీ ఆలోచనలనుండే పుట్టుతవి.

కొలంబో గోపరాజు రామచంద్రరావు

'జయంతి'కి విరాళములు

రెండవసంచికలో ప్రకటించినవి రూ ౧,౨౯౦

శ్రీమతి మనపాక కమలమ్మగారు,	బందరు	౨౫
శ్రీయుత పి. సత్యనారాయణరావుగారు, బి, ఏ; ఎం, ఎల్,	చెన్నపట్టణము	౨౫
,, సరస్వతుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, బి, ఏ; బి, ఎల్	,,	౨౫
,, పి. వి. రాజమన్నారు గారు, బి, ఏ; బి, ఎల్,	,,	౨౫
,, టి. బి. కృష్ణమూర్తిగారు, బి, ఇ.	,,	౨౫
,, కా. ఏ. రంగనాథం మొదలియారుగారు. బి, ఏ; బి, ఎల్	,,	౨౫
,, వింజమూరి అనంతాచార్యులుగారు, బి. ఏ,	,,	౨౫
,, బి. టి. యం. రాఘవాచార్యులుగారు. బి, ఏ; బి. ఎల్	,,	౨౫
,, వడ్లమన్నాటి వెంకట నారాయణరావు పంతులుగారు	,,	౨౫
,, అబ్బూరి అప్పారావు గారు	,,	౨౫
,, పాతూరి పట్టాభిరామయ్యగారు, ఎం, ఏ	బందరు	౨౫
,, కొమ్మారెడ్డి పట్టాభిరామయ్యగారు	,,	౨౫
,, చెరుకువాడ వెంకట నరసింహంగారు	,,	౨౫
,, గజ్జల సత్యనారాయణ మూర్తిగారు	,,	౨౫
,, నండూరి శేషాచార్యులుగారు బి, ఏ	తెనాలి	౨౫
,, కురుగంటి సీతారామయ్యగారు, ఎం, ఏ	,,	౨౫
,, పెద్దిభొట్ల వెంకట చలపతిరావుగారు బి, ఏ; బి, ఎల్	గుంటూరు	౨౫
,, లక్కరాజు బాలకోటీశ్వరరావుగారు	,,	౨౫
,, శిష్ట్లా సాక్షిసోమయాజులు గారు, బి, ఏ	బాపట్ల	౨౫
,, ఎ. ఎస్, నరసింహారావుగారు, బి, ఏ; బి, ఎల్	,,	౨౫
,, వెలగపూడి సుబ్బారావుగారు, బి, ఏ; బి, ఎల్	,	౨౫
,, గూడవల్లి రామబ్రహ్మముగారు	బెజవాడ	౨౫
,, మోతే గంగరాజుగారు, జమీందారు	ఏలూరు	౨౫
,, మోతే కృష్ణారావుగారు, జమీందారు	,,	౨౫

శ్రీయుత మూగంటి బాపినీడుగారు, ఎం, ఎస్, సీ.	చాటపర్రు	౨౫
,, మాడాప్రగడ హనుమంతరావుగారు,	నిడదవోలు	౨౫
,, సప్పా అప్పలస్వామి గారు	రాజమహేంద్రవరము	౨౫
,, మామిడిపూడి వెంకటరంగయ్యగారు, ఎం, ఏ,	విజయనగరము	౨౫
,, డాక్టరు ఏ, ఎల్, నారాయణగారు, ఎం, ఏ; డి, ఎస్. సీ,	,,	౨౦
, శొంఠి పురుషోత్తము గారు, ఎం, ఏ	,,	౨౫
,, నూగంపల్లి విజయరామయ్యగారు	,,	౨౫
,, రావికంటి వెంకటరమణమూర్తిగారు, ఎం, ఏ; బి, ఎల్	బరంపురము	౨౫
	మొత్తము రు	౨,౦౮౫

ఈవిధముగా మా ఉద్యమానికి తోడ్పడిన మిత్రులందరికీ కృతజ్ఞతతో వందనాలర్పిస్తున్నాము. ఏరాళము ఒక్కసంవత్సరమే ఇవ్వవలసి ఉంటుంది. తరువాత సంవత్సరాలలో సాధారణచందామాత్రమే

పరశువాకము
చెన్నపట్టణము

కోలవెన్ను రామకోటీశ్వరరావు
కార్యదర్శి, 'జయంతి'

జయంతి

సంపుటము ౧ సంచిక ౪

సంపాదకుడు :

విశ్వనాథ సత్యనారాయణ, బి, ఏ

'జయంతి' ఆలోచనా సంఘము

సారస్వతము:—

శ్రీ పున్నవ లక్ష్మీనారాయణపంతులుగారు, బారిష్టరు, గుంటూరు
,, వింజమూరి రంగాచార్యులుగారు, ఎం. ఏ; బి, ఎల్ ,,
,, ఇవటూరి కనకాచలం పంతులుగారు ఎం, ఏ; ఎల్, టి పర్లాకిమిడి
,, నండూరి వెంకట సుబ్బారావుగారు, బి, ఏ; బి, ఎల్, ఏలూరు

ధర్మశాస్త్రము:—

శ్రీమహామహోపాధ్యాయ తాతా సుబ్బరాయశాస్త్రిగారు, విజయనగరం
,, కిడాంబి రంగాచార్యులుగారు. ఎం, ఏ; బి, ఎల్, ,,
,, బంకుపల్లి మల్లయ్యశాస్త్రిగారు పర్లాకిమిడి
,, కావ్యవ్యాకరణతీర్థ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు

లలితకళలు:—

శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారు, విజయనగరము
,, అడివి బాపిరాజుగారు బి, ఏ. చెన్నపట్టణము
,, బెల్లకొండ రాఘవరావుగారు, పమిడిపాడు
,, పి. వి. రాజమన్నారుగారు బి, ఏ; బి; ఎల్, చెన్నపట్టణము
,, గొడవర్తి రామదాసుగారు, బి,ఏ; ఎం, ఆర్, ఏ, యస్, జయపురము

వార్తాశాస్త్రము:—

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్యగారు.ఎం,ఏ,ఎల్,టీ,విజయనగరం
,, బసవప్ప రామచంద్రరావుగారు, ఎం. ఏ. కలకత్తా

చరిత్ర - రాజనీతి:—

శ్రీ భావరాజు వెంకటకృష్ణారావుగారు, బి, ఏ; బి, ఎల్ రాజమండ్రి
,, వింజమూరి గోవిందరాజాచారిగారు, బి, ఏ; బి, ఎల్, చెన్నపట్టణము
,, కోలవెన్ను రామకోటీశ్వరరావుగారు, బి. ఏ; బి, ఎల్, ,,

భౌతికశాస్త్రము:—

శ్రీ డాక్టరు ఎ, ఎల్, నారాయణగారు, ఎం, ఏ; డి. ఎస్, సి.
,, డాక్టరు జయంతి చినకామేశ్వరరావుగారు, ఎం, ఏ; డి, ఎస్, సి.
,, పాతూరి పట్టాభిరామయ్యగారు, ఎం, ఏ; ఎల్. టి,

రసాయనశాస్త్రము:—

డాక్టరు యేమారి వెంకటరామయ్యగారు. డి, ఎస్, సి. విజయనగరము
శ్రీ కాళ్లకూరి సూర్యనారాయణగారు, ఎం, ఏ ఎల్, టి, చెన్నపట్టణము
,, ముదర్ల రాజాగారు, బి, ఏ, బందరు

ప్రకృతి శాస్త్రములు:—

శ్రీ గోపరాజు రామచంద్రరావుగారు, ఎం, ఏ, కొలంబో
,, డాక్టరు పుష్పాల లక్ష్మణరావుగారు; ఎం, ఏ; డి, ఎస్, సీ; (జర్మనీ)
,, పురాణం సూరిశాస్త్రిగారు, బి, ఏ; బందరు
,, కొంతి పురుషోత్తముగారు, ఎం, ఏ, విజయనగరం,

విషయసూచిక